

‘అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 338

బుధవారం 28-2-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ప్రజాభిమానమే ఇంధనం

అన్నా... ఆదుకోండి

ఆత్మీయ నేత అభయం

వివరాలు 6,7 లో





అశేష జనవాహిని తోడుగా కొనసాగుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ప్రజా సంకల్పయాత్ర

జనసంద్రంలో జననేత 100

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పాదయాత్రకు నేటితో వంద రోజులు

నాలుగేళ్లుగా ప్రజలు పడుతున్న కష్టాలు తెలుసుకోవడానికి.. అండగా తానున్నానంటూ అందరికీ భరోసానివ్వడానికి.. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర వందరోజుల మైలురాయిని చేరుకుంది. గత ఏడాది నవంబర్ 6న ఇడుపులపాయలో మొదలైన ఈ యాత్ర ఇచ్ఛాపురం వరకు సాగనున్న సంగతి తెల్సిందే. ఇప్పటికే వైఎస్ఆర్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాలను పూర్తి చేసుకుని ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో కొనసాగుతోంది. 1,340 కిలోమీటర్లు పూర్తయ్యాయి. అలుపెరగకుండా పాదయాత్ర చేస్తున్న ప్రతిపక్షనేతకు అన్ని వర్గాల ప్రజలు తమ కష్టాలు చెప్పకుంటున్నారు. వేలాదిగా వినతిపత్రాలు ఇస్తున్నారు. అందరి సమస్యలు వింటూ.. వారి కన్నీరు తుడుస్తూ, అండగా ఉంటానని జగన్ భరోసానిస్తున్నారు.

- సాక్షి, అమరావతి

ముంబైకి శ్రీదేవి పార్థివదేహం





మంగళవారం రాత్రి ముంబైలోని శ్రీదేవి నివాసానికి భౌతికకాయాన్ని అంబులెన్సులో తీసుకువస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్లో) శ్రీదేవి (ఫైల్)

మూడు రోజుల ఉత్కంఠకు తెర.. కేసు మూసేసిన దుబాయ్ పోలీసులు

- ప్రమాదవశాత్తూ బాత్‌టబ్‌లో పడి చనిపోయినట్లు నిర్ధారణ
- పబ్లిక్ ప్రాసిక్యూషన్ అనుమతితో బోనీ కపూర్‌కు మృతదేహం అప్పగింత
- ప్రత్యేక విమానం ద్వారా రాత్రి 9.30కు ముంబైకి తరలింపు
- కన్నీటి వీడ్కోలు కోసం తరలుతున్న అభిమానులు, నటులు

అభిమానుల సందర్శనార్థం నేటి ఉదయం 9.30 నుంచి 12.30 వరకు సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లో..

మధ్యాహ్నం 3.30 గంటలకు సేవా సమాజ్ శ్మశానవాటికలో అంత్యక్రియలు

2 లో

ఖజానాకు పూడ్చలేని ‘లోటు’!



ఉద్యోగులకు పీఆర్సీ బకాయిలు చెల్లించి ఉంటే కేంద్రం నుంచి రూ. 5,325 కోట్లు రాక

- రెవెన్యూ లోటుగా పరిగణించేది అంటున్న అధికారులు
- పెండింగ్‌లో పెట్టడంతో లోటు కింద ఇచ్చేందుకు నిరాకరణ
- బకాయిల కింద చూపిస్తూ లోటు అంటే ఎలా అంటున్న కేంద్రం

సాక్షి, అమరావతి

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన తప్పిదంతో భారీ మూల్యమే చెల్లించాల్సి వచ్చింది. ఉద్యోగులకు బకాయి పడ్డ పీఆర్సీ డబ్బులు వారికి చెల్లించేసి ఉంటే కేంద్రం నుంచి రెవెన్యూ లోటు ద్వారా పొందే వీలున్నా ఆ అవకాశాన్ని వదులుకుంది. ఫలితంగా రాష్ట్ర ఖజానాపై మరో రూ. 5 వేల కోట్లకుపైగా భారం పడింది.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించి ఉంటే...

రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లు కావస్తున్నా రెవెన్యూ లోటు భర్తీ విషయంలో చిక్కులు వీడటం లేదు. పాత పథకాల ద్వారా ఏర్పడిన రెవెన్యూ లోటును మాత్రమే భర్తీ చేస్తామని, కొత్త పథకాల వల్ల తలెత్తిన లోటును భర్తీ చేయలేమని కేంద్ర ఆర్థికశాఖతో పాటు నీతి ఆయోగ్ కూడా

మిగతా 12వ పేజీలో ▶

హోదాతో ఏమొస్తాయి?

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశ్న



- పోలవరానికి రూ.40 వేల కోట్లు రావు
- లోటు బడ్జెట్ కింద రావాల్సిన రూ.16 వేల కోట్లు రావు
- పరిశ్రమలకు రాయితీలు వస్తాయని కొందరు మభ్య పెడుతున్నారు
- ఒక హక్కుగా మాత్రమే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోరుతున్నాం..
- ఇతర రాష్ట్రాలకు కొనసాగిస్తున్నందునే మాకూ కావాలంటున్నాం
- ఏపీలో బీజేపీ, కాంగ్రెస్‌లు లేవని వ్యాఖ్య

సాక్షి, అమరావతి

ప్రత్యేక హోదాతో రాష్ట్రానికి ఏమొస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లు కావాలని, లోటు బడ్జెట్ కింద రూ.16 వేల కోట్లు రావాలని, ఇవన్నీ హోదా వల్ల రావన్నారు. చట్టంలో పేర్కొన్నట్లు ఒక హక్కుగా మాత్రమే హోదా కావాలంటున్నామని చెప్పారు. హోదా ఇవ్వలేమంటున్నారు కాబట్టి దానికి సమానమైన ప్రత్యేక సాయానికి అంగీకరించామన్నారు. హోదాతో రాయితీలు వస్తాయని

మిగతా 12వ పేజీలో ▶



నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

పరీక్షకు హాజరుకానున్న 10.26 లక్షల మంది

1,423 కేంద్రాల్లో మార్చి 19 వరకు..

కాపీ చేస్తే నాలుగేళ్లపాటు డిబార్

8 లో



ఆన్‌లైన్‌లో డిగ్రీ అడ్మిషన్లు

- అఫ్లియేషన్ అనుమతులకూ అదే విధానం
- పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి ఉమ్మడి పరీక్ష

8 లో



2016 గ్రూప్2 ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపిక జాబితా

విడుదల

- త్వరలో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల ఫలితాలు

- 12లో

ఫ్యామిలీలో

సారీ సిస్టర్

నేను శక్తి సాక్షి

ఏదైనా మందును కనిపెట్టాక ఎలుకల మీద, పందుల మీద ప్రయోగించి చూస్తారు. దాన్ని ల్యాబ్ టెస్టింగ్ అంటారు. కాసిన్ని రోజులు ఈ మగాళ్ల బుద్ధి మీద కూడా ల్యాబ్ టెస్టింగ్ చేస్తే... వేధింపులకు విరుగుడు మందు కనిపెట్టేందుకు వీలవుతుందేమో!! అప్పుడు మహిళలపై ఈ హెరాస్‌మెంట్‌లు, అత్యాచారాలు తగ్గుతాయేమో! ప్రయోగమేగా.. చేసి చూస్తే ఉపయోగమేగా!

త్రిపురలో కమల వికాసం?

- నాగాలాండ్‌లోనూ కాషాయం హవా
- మేఘాలయలో అధికారం కోల్పోనున్న కాంగ్రెస్
- ఈశాన్య రాష్ట్రాల ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడి

5 లో









1. శ్రీదేవి భౌతికకాయం అంటూ సామాజిక మాధ్యమాలు, కొన్ని చానళ్లలో వచ్చిన చిత్రం.. అయితే.. ఇది ఆమె పార్థివ దేహమేనంటూ ఇప్పటివరకూ అధికారికంగా ఎవరూ ప్రకటించలేదు. 2. మంగళవారం రాత్రి ముంబైలోని శ్రీదేవి ఇంటి వద్దకు భారీగా చేరుకున్న అభిమానులు 3. శ్రీదేవి భౌతికకాయాన్ని తీసుకొచ్చేందుకు విమానాశ్రయానికి వెళుతున్న అనిల్‌కపూర్ 4. నివాళులర్పించడం కోసం శ్రీదేవి నివాసానికి చేరుకున్న హీరో వెంకటేశ్

ముంబైకి శ్రీదేవి పార్థివదేహం

దుబాయ్ నుంచి ముంబైకి చేరుకున్న శ్రీదేవి భౌతికకాయం ● కేసు మూసివేసిన దుబాయ్ పోలీసులు

దుబాయ్/ముంబై

సినీనటి శ్రీదేవి మరణంపై ముసురుకున్న అనుమానాలకు తెరపడింది! దేశవ్యాప్తంగా గత మూడ్రోజులుగా నెలకొన్న ఉత్కంఠ వీడింది. స్పృహ కోల్పోయి ప్రమాదవశాత్తూ బాత్‌టబ్‌లో పడిపోవడం వల్లే శ్రీదేవి మరణించారని నిర్ధారిస్తూ దుబాయ్ పోలీసులు మంగళవారం కేసును మూసివేశారు. భౌతికకాయాన్ని భర్త బోనీకపూర్‌కు అప్పజెప్పారు. అంతకుముందే మృతదేహం పాడవకుండా చేసే ఎంబామింగ్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. ప్రత్యేక ప్రైవేటు విమానం ద్వారా శ్రీదేవి భౌతికకాయం మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో ముంబై చేరుకుంది. 10.30 గంటలకు లోఖండ్‌వాలాలోని గ్రీన్‌ఏకర్స్‌లోని శ్రీదేవి నివాసానికి తరలించారు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విలెపార్లె సేవా సమాజ్ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు అభిమానులు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం లోఖండ్‌వాలా కాంప్లెక్స్‌లోని సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లో శ్రీదేవి భౌతికకాయాన్ని ఉంచుతారు.

కేసు మూసేశారు.. కానీ..

దుబాయ్‌లో బంధువుల వివాహ వేడుకకు హాజరైన శ్రీదేవి అక్కడే తానున్న జుమైరా ఎమిరేట్స్ టవర్స్ హోటల్‌లోని గదిలో శనివారం హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. తొలుత, ఆమె గుండెపోటుతో మరణించారని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత గుండెపోటుతో కాదు.. బాత్‌టబ్‌లో పడిపోయి చనిపోయారని, ఆమె శరీరంలో మద్యం తాగిన ఆనవాళ్లున్నాయని, శరీరంపై గాయాలు కూడా ఉన్నాయని ఫోరెన్సిక్ నివేదికను ఉటంకిస్తూ గల్ఫ్ న్యూస్ పత్రిక ఒక కథనం ప్రచురించింది. దుబాయ్ పోలీసులు బోనీకపూర్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించారని, ఆయన పాస్‌పోర్ట్‌ను సైతం స్వాధీనం చేసుకున్నట్టు వార్తలు గుప్పుమన్నాయి. ఈ నేపథ్యంలో శ్రీదేవి మరణంపై అనేక అనుమానాలు తలెత్తాయి. అయితే వీటన్నింటికీ ముగింపు పలుకుతూ మంగళవారం దుబాయ్ ప్రభుత్వ మీడియా కార్యాలయం పలు ట్వీట్లు చేసింది. ''నటి శ్రీదేవి మరణంపై పూర్తి దర్యాప్తు అనంతరం.. ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పేందుకు దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ అనుమతించింది''అని అందులో పేర్కొంది. ''ఈ తరహా కేసుల దర్యాప్తులో చేపట్టాల్సిన అన్ని లాంఛనాలను దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ ముగించింది. ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం.. స్పృహ కోల్పోవడంతో బాత్‌రూమ్‌లోని బాత్‌టబ్‌లో ప్రమాదవశాత్తూ పడిపోయి ఆమె మృతి చెందారని నిర్ధారించారు. అందువల్ల కేసును దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ మూసివేస్తోంది''అని మరో ట్వీట్ చేసింది. అయితే ఆమె స్పృహ కోల్పోవడానికి గల కారణాలను మాత్రం ఎక్కడా పేర్కొనకపోవడం గమనార్హం.

నో కెమెరా.. ప్లీజ్!

'ఈ బాధాకర సమయంలో మాకు తోడుగా నిలిచిన మీడియాకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం''అని పేర్కొంటూ కపూర్, అయ్యప్పన్ కుటుంబాలు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశాయి. శ్రీదేవి భౌతికకాయాన్ని అభిమానులు, శ్రేయోభిలాషుల చివరి చూపుకోసం లోఖండ్‌వాలాలోని సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లో బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉంచుతామని ప్రకటనలో వివరించారు. 2 గంటల నుంచి అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. మీడియా కూడా నివాళులర్పించవచ్చని, అయితే కెమెరాలు, ఇతర రికార్డింగ్ వస్తువులను బయటే వదిలేసి రావాలని విజ్ఞప్తి చేశారు.

అనిల్ కపూర్ నివాసానికి తారాలోకం

ముంబైలోని బోనీకపూర్ సోదరుడు అనిల్ కపూర్ నివాసం శ్రీదేవి సహ నటులు, శ్రేయోభిలాషులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం నుంచే వారంతా రావడం ప్రారంభించారు. ''మా నాన్న మరణం తర్వాత నన్నంతగా బాధించింది శ్రీదేవి మరణమే. ఈ వార్త విన్నప్పటి నుంచి ఆమె ముఖమే పదేపదే నాకు గుర్తొస్తోంది. తను నన్నెంతో ప్రేమగా చూసేది. నాకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన వ్యక్తిత్వం ఆమెది. నేను తనను చిన్నమ్మ (మౌసీ)లా భావిస్తాను''అని బాలీవుడ్ నటి రాణి ముఖర్జీ కన్నీళ్ల పర్యంతమయ్యారు. అనిల్‌కపూర్ నివాసానికి వచ్చినవారిలో షారూఖ్ ఖాన్, ఆయన భార్య గౌరి ఖాన్, రజనీకాంత్, కమల్‌హాసన్, దీపిక పడుకోన్, రణ్‌వీర్ సింగ్, టబు, రేఖ, ఫరాఖాన్, జావేద్ అఖ్తర్, షబానా ఆజ్మీ తదితరులున్నారు. మరోవైపు లోఖండ్‌వాలాలోని శ్రీదేవి నివాసం వెలుపల అభిమాన నటికి చివరి వీడ్కోలు పలికేందుకు అశ్రునయనాలతో అభిమానులు వేచి చూస్తున్నారు.

తండ్రికి సాయంగా..

శ్రీదేవి మరణానికి ముందు.. శనివారం ఆమెను సర్‌ప్రైజ్ డిన్నర్‌కు తీసుకెళ్లేందుకు బోనీకపూర్ దుబాయ్ వెళ్లిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో ఆయన అక్కడే ఉన్నారు. మంగళవారం ఉదయం ఆయనకు తోడుగా ఉండేందుకు మొదటి భార్య కుమారుడు అర్జున్ కపూర్ కూడా దుబాయ్ బయల్దేరి వెళ్లారు. శ్రీదేవి భౌతికకాయాన్ని తమకు అప్పగించినప్పుడు బోనీతోపాటు ఆయన కూడా అక్కడే ఉన్నారు. శ్రీదేవి మృతదేహాన్ని ముంబైకి తీసుకువచ్చేందుకు ప్రముఖ పారిశ్రామిక వేత్త అనిల్ అంబానీ తన ఎంబ్రేయర్ విమానాన్ని దుబాయ్ పంపించారు.

చానెళ్ల అతిపై సెలబ్రిటీల మండిపాటు

శ్రీదేవి మరణంపై టీవీ చానెళ్ల అతిపై పలువురు బాలీవుడ్ ప్రముఖులు, ఆమె అభిమానులు మండిపడ్డారు. చానెళ్లు నిర్దయగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించాయని హీరోయిన్ విద్యాబాలన్, నటుడు ఫర్హాన్ అక్తర్ దుయ్యబట్టారు. 'ప్రాణానికి భారత్‌లో విలువ లేదన్న విషయాన్ని మీడియా మరోసారి రుజువు చేసింది. శ్రీదేవి మీకు వినోదం పంచేందుకు మరణించలేదు..'అని అమితాబ్ బచ్చన్ ఘాటుగా విమర్శించారు. 'మీకు, మీ ఫ్యామిలీకి ఏదైనా మంచి చేయాలనుకుంటే వెంటనే టీవీలు కట్టేయండి'అని ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మసాబా మాంటెనా పేర్కొన్నారు. ఓ లెజెండ్ మరణం చుట్టూ ఇన్ని కట్టుకథలు అల్లిన తర్వాత ఆమె ఆత్మకు ఎలా శాంతి చేకూరుతుంది అని సోనూ సూద్ ప్రశ్నించారు. రిపోర్టింగ్ ప్రమాణాలు ఏ స్థాయికి దిగజారాయో చూసుకొని చానెళ్లు సిగ్గు తెచ్చుకోవాలన్నారు. 'శ్రీదేవిని మీడియా లైవ్‌లో చంపేస్తుండగా దేశమంతా చేష్టలుడిగి చూసింది'అని అభిమాని, శ్రీదేవి మరణాన్ని ఓ వినోద కార్యక్రమంగా చూపడం ఇకనైనా ఆపాలని మరో అభిమాని ఆవేదన వ్యక్తంచేశారు.



తిరుపతిలోని శ్రీదేవి తాత వెంకటస్వామిరెడ్డి ఇల్లు

తాతగారి ఇల్లంటే ఎంతో ఇష్టం

ఏటా పుట్టినరోజున శ్రీవారి సన్నిధికి శ్రీదేవి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి ఊరన్నా, తిరుమల వెంకన్న దర్శనమన్నా సినీనటి శ్రీదేవికి ఎంతో ఇష్టం. బాల్యాన్ని గుర్తు చేసేది ఊరైతే, కోర్కెలు తీర్చేది వెంకన్న దేవుడు. అందుకే తన పుట్టిన రోజున (ఆగస్టు 13) ఎక్కడున్నా తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తుంటారు శ్రీదేవి. ఇది మాత్రమే కాదు.. ఇక్కడున్న తీర్థకట్ట వీధిలోని ఇంటి నెంబరు–93కి మరో ప్రాధాన్యత ఉంది. శ్రీదేవి తాతగారిల్లు ఇదే. ఆయన పేరు వెంకటస్వామిరెడ్డి. తాత గారిల్లంటే శ్రీదేవికి ఎంతో మమకారం. ఈ ఇంటిని చూస్తే తన బాల్యం, అప్పట్లో తనతో గడిపిన మిత్రులు గుర్తుకొస్తారని చెప్పేది. పాతబడ్డ ఇంటిని పడగొట్టి మళ్లీ కొత్త ఇల్లు కట్టుకోవడం.. అదే సమయంలో శ్రీదేవి సినిమాల్లో బిజీ అవడంతో ఇక్కడకు రాకపోకలు ఆగిపోయాయి. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా హోటల్‌కు వెళ్లడం.. అక్కడి నుంచి తిరుమలకు చేరుకోవడం.. దర్శనం అయ్యాక హోటల్‌కు బంధువుల్ని పిలిపించుకుని వారితో మాట్లాడ్డం జరిగేది. తెలుగు భాష పెద్దగా రాని శ్రీదేవి భర్త బోనీకపూర్.. తిరుపతిలో బంధువులు కలిసినపుడు 'నమస్తే' చెప్పడం మినహా పెద్దగా మాట్లాడేవారు కాదని ఇక్కడున్న శ్రీదేవి బంధువులు చెబుతున్నారు.



టీవీలో శ్రీదేవి మృతదేహం తరలింపు వార్తలు చూస్తోన్న వేణుగోపాల్‌రెడ్డి

మాది అపూర్వ బంధం

- బంధువులందరిలోనూ 'పప్పీ' అక్కే టాప్
- ఆమెలో కోపం, చిరాకు, ఏడుపు ఎప్పుడూ చూడలేదు
- నేనంటే ఎంతో అభిమానం... తిరుమల వెంకన్నపై అపారమైన భక్తి
- 'సాక్షి'తో కన్నీరుమున్నీరైన శ్రీదేవి సోదరి ప్రసన్నలక్ష్మి
- తిరుపతి బంధువులతో కలిసి ముంబైకి పయనం



తిరుపతిలో బంధువులతో శ్రీదేవి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, తిరుపతి: 'దేశంలోనే అగ్రశ్రేణి తారగా ఖ్యాతి గడించిన సూపర్‌స్టార్ శ్రీదేవికి సొంత చిన్నమ్మ కూతుర్నని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడేదాన్ని. ఆమె తిరుపతి వస్తే ఆ రోజంతా మాకు పండగే. ఎంతో ప్రేమ, ఆప్యాయతతో పలకరిస్తుంది. బంధువుల సంగతులన్నీ విని, అవునా.. అంటూ ఆశ్చర్యపోయేది. మాతో కలిసి సరదాగా తింటుంది. అవన్నీ ఇప్పుడు గుర్తొస్తున్నాయి. పప్పీ అక్క లేదంటే నమ్మశక్యంగా లేదు..' అంటూ శ్రీదేవి చిన్నమ్మ కూతురు ప్రసన్నలక్ష్మి కన్నీరుమున్నీరయ్యారు. అలవాట్లు, అభిరుచులు దాదాపు ఒక్కటే కావడంతో తమద్దరి మధ్యా అపూర్వ బంధం పెనవేసుకుందని ప్రసన్నలక్ష్మి వివరించారు. తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసే ప్రసన్నలక్ష్మికి శ్రీదేవి స్వయానా పెద్దమ్మ కూతురు. శ్రీదేవి, ప్రసన్నలక్ష్మిలు అక్కాచెల్లెళ్లైన రాజేశ్వరి, అనసూయల కుమార్తెలు. దుబాయ్‌లో శ్రీదేవి ఆకస్మికంగా కన్నుమూసిందన్న సమాచారం వినగానే తిరుపతి పద్మావతిపురంలో ఉండే పిన్ని అనసూయ, సోదరి ప్రసన్నలక్ష్మి, ఈమె భర్త గిరిప్రసాద్‌లు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. దుబాయ్ నుంచి శ్రీదేవి మృతదేహం ముంబైకు తీసుకువస్తున్నారని తెలుసుకున్న వీరంతా మంగళవారం హుటాహుటిన ముంబై వెళ్లారు. వెళ్లే ముందు వీరు శ్రీదేవితో తమ జ్ఞాపకాలను 'సాక్షి'తో పంచుకున్నారు.



శ్రీదేవితో ప్రసన్నలక్ష్మి (ఫైల్)

శనివారమంటే ఎంతో ఇష్టం..

'శ్రీదేవి అక్కను ఇంట్లో అందరూ ప్రేమగా పప్పీ అని పిలుస్తుంటారు. మేం కూడా అలాగే పిలుస్తుంటాం. తన పుట్టిన రోజైన ఆగస్టు 13న ఏటా తిరుమల వస్తుండేది. తిరుమల శ్రీవారికి శనివారం అంటే ఇష్టం. అక్కకు కూడా అదేరోజు ఇష్టం. యాధృచ్ఛికంగా శనివారమే తనూ చనిపోయింది. దేవుడు తనలో ఐక్యం చేసుకున్నాడని భావిస్తున్నామని' ప్రసన్నలక్ష్మి కన్నీరు పెట్టుకున్నారు. తమకున్న బంధువులందరిలోనూ పప్పీ అక్కే టాప్. ఆమె నటనలోనే కాదు. అన్నింటా ఆమె ముందుంటుంది. సినీ పరిశ్రమ గురించి ఆమె చెప్పే కబుర్లు గుర్తుకొస్తున్నాయి. చివరకు శ్రీదేవి అక్క మామ్ సినిమా ప్రమోషన్ కోసం తిరుపతి వచ్చింది. హోటల్ రూమ్‌లో ఉండి ఫోన్ చేసింది. మేమంతా అక్కడికెళ్లాం. సరదాగా భోజనం చేస్తూ మాట్లాడుకున్నాం. అదే లాస్ట్ ఆమెను చూడటం..' అని ప్రసన్నలక్ష్మి గుర్తుచేసుకున్నారు. ఆమెలో కోపం, చిరాకు, ఏడుపులాంటివి ఎన్నడూ చూడలేదని.. ఎప్పుడూ ఏంజెల్ (దేవత)లా కనిపించేదని ఆమె వివరించారు.

రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వేసవి సెగలు అప్పుడే ప్రారంభమయ్యాయి. రెండ్రోజుల నుంచి సాధారణం కంటే పగటి ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. అయితే రాయలసీమ కంటే కోస్తాంధ్రలో ఉష్ణతీవ్రత ఎక్కువగా ఉండటం గమనార్హం. ఫిబ్రవరి నెలాఖరుకు ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఏర్పడలేదని వాతావరణ నిపుణులు తెలిపారు. ఈ ఏడాది శీతాకాలంలో వర్షాలు కురవకపోవడం, ఆకాశంలో మేఘాల ఉధృతి తగ్గడం, గాలులు బలంగా వీయకపోవడం వల్ల వేసవి చాయలు ముందే రావడానికి కారణమని వాతావరణ శాఖ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ 'సాక్షి'కి చెప్పారు. ఇకపై రోజురోజుకూ ఎండలు మరింతగా పెరుగుతాయన్నారు. మరోవైపు రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు మాత్రం గణనీయంగా తగ్గుతున్నాయి. సాధారణకంటే 2 నుంచి 7 డిగ్రీల వరకు తక్కువగా నమోదవుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా తునిలో మంగళవారం 38 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే నాలుగు డిగ్రీలు ఎక్కువ.

శ్రీదేవి పంజరంలోని పక్షి

- పైకి కనిపించేంత అందమైన లోకం కాదామెది
- గుండెలో ఎన్నో బాధలు, భయాలు దాచుకుంది
- తండ్రి మరణం, తల్లి చర్యలు శ్రీదేవి జీవితాన్ని మలుపు తిప్పాయి
- శ్రీదేవి అభిమానులకు రామ్‌గోపాల్ వర్మ సుదీర్ఘమైన లేఖ
- లేఖలు రాయగలను కానీ కన్నీటిని ఆపుకోలేనంటూ ముగింపు



సాక్షి, ముంబై: శ్రీదేవికి వీరాభిమాని అయిన రామ్‌గోపాల్ వర్మ మరోసారి తన కలానికి పదును పెట్టారు. 'శ్రీదేవి అభిమానులకు ప్రేమలేఖ' అంటూ ఫేస్‌బుక్‌లో ఓ సుదీర్ఘలేఖ రాశారు. శ్రీదేవి జీవితంలో ఎవరికీ తెలియని విషయాలు, ఎన్నో జ్ఞాపకాలు, ప్రత్యక్షంగా చూసిన అనుభవాలు, తన భావోద్వేగాలు ఈ లేఖలో పంచుకున్నారు. పైకి కనిపించేంత అందమైన లోకం శ్రీదేవిది కాదని, ఆమె గుండెలో ఎన్నో భయాలు, బాధలు పొదివి పట్టుకున్నారని, తండ్రి ఉన్నంత వరకు ఆకాశంలో పక్షిలా స్వేచ్ఛగా ఎగిరిన ఆమె తండ్రి చనిపోయిన తర్వాత తల్లి చర్యల కారణంగా పంజరంలో పక్షిలా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ పైకి చూస్తున్నంత సంతోషంగా శ్రీదేవి లేరని చెప్పారు.

కలసినప్పటి నుంచి శ్రీదేవి జీవితం తెలుసు..

'అందమైన ముఖారవిందం. గొప్ప టాలెంట్. ఇద్దరు అందమైన కూతుళ్లతో కుదురుగా ఉన్న సంసారం.. ఇవన్నీ బయట నుంచి చూస్తున్నవారికి ఆమె కోరుకున్నట్లుగానే జీవితం ఉందని అనిపించవొచ్చు.. నిజానికి శ్రీదేవి సంతోషంగా ఉంటూ సంతోషకరమైన జీవితం గడుపుతుందా ? నేను తొలిసారి కలిసినప్పటి నుంచి శ్రీదేవి జీవితం నాకు తెలుసు. చాలా దగ్గరిగా ఆమెను చూశాను. తన తండ్రి ఉన్నంతకాలం పక్షిలా హాయిగా ఎగరడాన్ని నా కళ్లతో చూశాను' అని లేఖలో వెల్లడించారు.

చాలా ఎక్కువ అసంతృప్తితో ఉన్న మహిళ..

తండ్రి మరణం, తల్లికి అనారోగ్యం, ఆర్థికసమస్యల కారణంగా ఆమె సంతోషంగా లేదన్నారు. 'ఇంగ్లిష్ వింగ్లిష్' చిత్రం సమయంలో తప్ప ఆమెకు ఎప్పుడూ నచ్చిన జీవితం లేదని, చాలా ఎక్కువ అసంతృప్తితో ఉన్న మహిళ శ్రీదేవి అన్నారు. ఆమె జీవితం ఊహించని మలుపులు తిరిగిందని, సున్నిత మనస్కురాలైన శ్రీదేవికు మనశ్శాంతి అనేది లేకుండా పోయిందన్నారు. శ్రీదేవి చాలా చిన్నవయసులోనే కెమెరా ముందుకు వెళ్లారని దాంతో ఆమె సహజంగా ఎదగడానికి కావాల్సిన స్పేస్ దొరకలేదన్నారు.

పిల్లల విషయంలోనూ కాస్త ఒత్తిడి..

బయటి జీవితంతో బిజీ అయిన ఆమె అనూహ్యంగా తన జీవితంలోకి తొంగిచూసుకోవడం ప్రారంభించారని చెప్పారు. వయసు అనేది ప్రతి నటికి ఓ పీడకల అని, దీనిని కాపాడుకునే విషయంలో శ్రీదేవి మినహాయింపేమీ కాదంటూ ప్లాస్టిక్ సర్జరీల గురించి ప్రస్తావించారు. ఆమె తల్లిదండ్రులు, బంధువులు, భర్త సూచనల మేరకే నడుచుకునే వారని, పిల్లల విషయంలో కూడా కొంత ఒత్తిడికి గురయ్యేవారని తెలిపారు. శ్రీదేవి మానసిక పరిస్థితి నిత్యం గందరగోళాలతో నిండుకుంటూ ఉండేదని వర్మ చెప్పారు. శ్రీదేవి అంటే తనకు పడిచచ్చేంత అభిమానంతోపాటు గుండెల నిండా ప్రేమే ఉంటుందంటూ వెల్లడించారు. ఇలాంటి లేఖలు ఇకముందు కూడా రాస్తానేమో గానీ, కన్నీటిని మాత్రం ఎప్పటికీ ఆపుకోలేనంటూ ఆయన లేఖను ముగించారు.



అలవాటు పొప్పున కొడతారు! దూరంగా కూర్చోమని చెప్పాగా!

రాంమాధవ్‌ను కలిసిన మంత్రి మాణిక్యాలరావు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రమంత్రి మాణిక్యాలరావు మంగళవారం న్యూఢిల్లీలో బీజేపీ జాతీయ కార్యదర్శి రాంమాధవ్‌ను కలిసి రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను వివరించారు. క్షేత్ర స్థాయిలో బీజేపీ, టీడీపీ శ్రేణుల మధ్య నెలకొన్న గందరగోళ పరిస్థితులను వివరించారు. గంట పాటు జరిగిన ఈ సమావేశంలో జిల్లాలవారీగా నాయకులు, కేడర్ మధ్య నెలకొన్న అభిప్రాయభేదాలకు సంబంధించి రామ్‌మాధవ్‌కు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పుతో పాటు పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

ముస్లింల కోసం ఒకేషనల్ కళాశాల ఏర్పాటు చేయండి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా

సాక్షి, అమరావతి: చదువు మధ్యలో ఆపేస్తున్న వారిలో మైనార్టీ విద్యార్థులు అత్యధికంగా ఉంటున్నారని, దీనికి గల కారణాలను అన్వేషించి తగు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కోరారు. మంగళవారం ఏపీ శాసనసభపక్ష మైనార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మైనార్టీ శాఖ చైర్మన్ అత్తార్ చాంద్‌భాషాకు పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మహ్మద్ ముస్తఫా మాట్లాడుతూ.. గుంటూరులో ఒకేషనల్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

సాక్షి
బుధవారం, ఫిబ్రవరి, 28

కమ్యూనిస్టు రారాజు!

సమష్టి నాయకత్వ ప్రాధాన్యతను ప్రవచించే కమ్యూనిస్టు పార్టీలు చివరకు వ్యక్తి ప్రాధాన్యమున్న పార్టీలుగా రూపాంతరం చెందడం ప్రపంచంలో కొత్తగాదు. అధికారం ఉన్నచోటా, లేనిచోటా ఇది కనబడుతూనే ఉంటుంది. చైనా కమ్యూనిస్టు పార్టీ కూడా అదే తోవన వెళ్లదల్చుకున్నదని ఆదివారం వెల్లడైన ప్రతిపాదనలు ధ్రువీకరిస్తున్నాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను యావజ్జీవ అధ్యక్షుడిగా చేయడం, ఉపాధ్యక్ష పదవికి కూడా అదే వర్తింపజేయడం ఆ ప్రతిపాదనల్లో అతి కీలకమైనది. సోమవారం ప్రారంభమైన కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సమావేశాలు మూడు రోజులు కొనసాగి బుధవారం ముగుస్తాయి. దీంతోపాటు మరో పది ప్రతిపాదనలను అది పరిశీలిస్తుంది. మిగిలినవాటి మాట అటుంచి షీ జిన్‌పింగ్‌కు శాశ్వత అధ్యక్ష పదవి కట్టబెట్టే ప్రతిపాదనకు ఏకగ్రీవ ఆమోదం లభించడం లాంఛనప్రాయమేనని వేరే చెప్పనవసరం లేదు. చైనా అధికారిక పత్రికలన్నీ ఇప్పటికే అందుకాయన అన్నివిధాలా అర్హుడంటూ స్తోత్రపాఠాలు ప్రారంభించాయి. పద్నాలుగేళ్ల తర్వాత దేశ రాజ్యాంగానికి సవరణలు ప్రతిపాదించడం ఇదే మొదటిసారి. ఇప్పుడున్న రాజ్యాంగ నిబంధన ప్రకారం అయిదేళ్లపాటు ఉండే దేశాధ్యక్ష పదవిలో రెండు దఫాలు మించి ఉండటం సాధ్యపడదు. ఆ లెక్కన 2013లో అధ్యక్షుడిగా ఎన్నికైన షీ జిన్‌పింగ్ 2023 వరకూ ఆ పదవిలో ఉండాలి. సవరణకు కేంద్ర కమిటీ ఆమోదం లభించాక మార్చి 5న ప్రారంభం కాబోయే చైనా పార్లమెంటు నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ పరిశీలనకు వెళ్తుంది. 2,924మంది సభ్యులుండే ఆ సభ దీనికి ఆమోదముద్ర వేయడం ఖాయం.

నిరుడు అక్టోబర్‌లో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లోనే షీ జిన్‌పింగ్ తిరుగులేని అధినాయకుడిగా రూపొందుతున్న దాఖలాలు కనబడ్డాయి. ఆ మహాసభల్లో జిన్‌పింగ్ వరసగా రెండోసారి పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడంతోపాటు దేశ చరిత్రలో అంతవరకూ మావో, డెంగ్ జియావో పింగ్‌లకు మాత్రమే దక్కిన అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. 'మావో ఆలోచనా విధానం', 'డెంగ్ జియావో పింగ్ సిద్ధాంతం' వరసలో షీ జిన్‌పింగ్ 'నూతన శకంలో చైనా విశిష్టతలతో కూడిన సామ్యవాద ఆలోచనా విధానం' కూడా చేరింది. మావో, డెంగ్‌లను మాత్రమే సంబోధించే 'అధినేత' పదాన్ని ఆయనకు కూడా ఉపయోగించడం ప్రారంభించారు. వాస్తవానికి నిరుడు జరిగిన పార్టీ కాంగ్రెస్ సందర్భంలోనే 'శాశ్వత అధ్యక్ష పదవి' షీ జిన్‌పింగ్ సొంతమవుతుందన్న ఊహాగానాలొచ్చాయి. ఎందుకంటే ఆ సమావేశాల్లో జిన్‌పింగ్ వారసుడిగా ఎవరినీ ప్రముఖంగా చూపలేదు. సాధారణంగా ప్రధాన కార్యదర్శితోపాటు రెండో స్థానంలో ఉండేవారికి పార్టీ కాంగ్రెస్ నిర్వహణలో ముఖ్య బాధ్యతలు అప్పజెబుతారు. ఆ రకంగా వారు ప్రచారంలోకొస్తారు. జిన్‌పింగ్‌ను తిరుగులేని అధినేతను చేయడానికి కొన్నేళ్లుగా చాలా ప్రయత్నాలే సాగుతున్నాయి. అందులో 'అవినీతి వ్యతిరేక పోరు' ప్రధానమైంది. జిన్‌పింగ్ తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శి కాగలరనుకున్న చోంకింగ్ మున్సిపల్ కమిటీ మాజీ కార్యదర్శి సన్ ఝెంగ్ కాయ్ తోపాటు ఆయనకు మద్దతునీయగలరని భావించిన మరో 12మంది సీనియర్ నాయకులపై అవినీతి ముద్రవేసి పార్టీ నుంచి బయటకు నెట్టడం ఆ ప్రయత్నాల్లో ఒకటి.

తన అధికార పీఠాన్ని సుస్థిరం చేసుకోవడానికి షీ జిన్‌పింగ్ చేస్తున్న ప్రయత్నాలు ఏకకాలంలో ఆయన బలాన్ని, బలహీనతను సూచిస్తాయి. పార్టీలో ప్రత్యర్థుల మాట అటుంచి కనీసం భిన్నాభిప్రాయం వ్యక్తం చేసేవారెవరూ మిగల్లేదని ఈ పరిణామం తెలియజెబుతోంది. అది అధిగమించగా ఆయన బలాన్నే సూచిస్తుంది. అదే సమయంలో ఇప్పుడు అమల్లో ఉన్న నిబంధన ప్రకారం షీ జిన్‌పింగ్ పదవీకాలం మరో అయిదేళ్లుంటుంది. అది ముగిసే తరుణంలో శాశ్వత అధికారం కోసం ఆయన ప్రయత్నించవచ్చు. కానీ అప్పటికల్లా తనకు పార్టీపై పట్టు ఉంటుందో లేదోనన్న బెంగ ఆయనను పీడించడం వల్లనే ఆ పని చేసినట్టు కనబడుతోంది. ఆర్థిక రంగంలోనేకాక ఇతర రంగాల్లో తీసుకోబోయే అనేక చర్యలు తనకు అవరోధాలవుతాయన్న భావన ఆయనకు కలిగినట్టుంది. మావో హయాంలో, మరీ ముఖ్యంగా సాంస్కృతిక విప్లవకాలంలో ఘోర తప్పిదాలు జరిగాయని, దీనంతటికీ ఒకే వ్యక్తి వద్ద అధికారం కేంద్రీకృతం కావడమే కారణమని డెంగ్ జియావోపింగ్ నాయకత్వంలోని కమ్యూనిస్టు పార్టీ ఆకళింపుచేసింది. ఇలాంటి ధోరణులు తలెత్తకుండా ఉండేందుకని 1982లో ఆమోదించిన దేశ రాజ్యాంగంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల్లో ఎవరూ రెండు దఫాలకు మించి కొనసాగరాదన్న నిబంధన విధించారు. జిన్‌పింగ్ ఇప్పుడున్న పదవులు తక్కువేమీ కాదు. ఆయన దేశాధ్యక్షుడు మాత్రమే కాక కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, కేంద్ర మిలిటరీ కమిషన్ చైర్మన్, కేంద్ర జాతీయ భద్రతా కమిషన్ చైర్మన్, కేంద్ర సైనిక, పౌర ఏకీకృత అభివృద్ధి కమిషన్ తదితర అనేక పదవులున్నాయి.

ఒక వ్యక్తి వద్ద పదవులన్నీ కేంద్రీకృతమైనప్పుడు, తిరుగులేని అధికారాలు చేజిక్కించుకున్నప్పుడు పర్యవసానాలెలా ఉంటాయో చరిత్ర నిండా మనకు దాఖలాలు కనబడతాయి. అలాంటివారు నియంతలుగా మారి దేశ ప్రజలపై స్వారీ చేయడమే కాదు...వేరే దేశాలకు ముప్పుగా మారిన సందర్భాలు కూడా ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మతిమాలిన విధానాల వల్ల ప్రపంచంలోనే ఆ స్థానం క్రమేపీ పలచనవుతోంది. ఆర్థికంగా పటిష్టంగా ఉన్న చైనా దాన్ని భర్తీ చేయాలని చూస్తోంది. అదే సమయంలో ఈ ప్రాంతంలో తిరుగులేని శక్తిగా రూపొందాలనుకుంటోంది. ఇంటా బయటా ఇందుకెదురయ్యే సవాళ్లను అధిగమించాలంటే ఎలాంటి నిర్ణయమైనా తీసుకోవడానికి అవసరమైన సంపూర్ణమైన అధికారాలు తనకుండాలని షీ జిన్‌పింగ్ విశ్వసిస్తున్నారు. అది చివరకు జిన్‌పింగ్‌ను ఎక్కడికి తీసుకెళ్తుందో, చైనాను ఏ తీరానికి చేరుస్తుందో రాగలకాలంలో తెలుస్తుంది.



అధికారాన్ని కాంక్షించే వారి తదుపరి ఆకాంక్ష అపరిమిత అధికారమే.
రాబర్ట్ షెయా
-అమెరికన్ నవలా రచయిత, జర్నలిస్టు

గ్రహం అనుగ్రహం


శ్రీ హేవిళంబినామ సంవత్సరం ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం తిథి శు.త్రయోదశి ఉ.10.34 వరకు తదుపరి చతుర్దశి నక్షత్రం ఆశ్లేష రా.1.13 వరకు తదుపరి మఖ వర్జ్యం ప.2.43 నుండి 4.12 వరకు దుర్ముహూర్తం ప.11.47నుండి 12.34 వరకు అమృతఘడియలు రా.11.43 నుండి 1.13 వరకు

సూర్యోదయం	: 6.24		
సూర్యాస్తమయం	: 6.01	యమగండం :	
రాహుకాలం :	ప.12.00 నుండి 1.30 వరకు	ఉ.7.30 నుండి 9.00వరకు	

నమాజ్ వేళలు

ఫజర్	: 5.23	మగ్రీబ్	: 6.22
జొహర్	: 12.29	ఇషా	: 7.35
అసర్	: 4.44		

'నివాళి' చెబుతున్న నిజాలు



దేవులపల్లి అమర్

ఆంధ్రప్రదేశ్‌కు అనేక వాగ్దానాలు చేసిన బీజేపీ, టీడీపీ రెండూ కూడా రాష్ట్ర ప్రజలకు జవాబుదారీ అన్న విషయం గుర్తించాలి. కేంద్రం నుంచి ఏ సహాయమూ రాలేదంటున్న చంద్రబాబు కేంద్ర సహాయం అద్భుతం, అమోఘం అని ఈ నాలుగేళ్లు ఎందుకు భజన చేశారో చెప్పాలి. తాము ఇచ్చిన నిధులకు ఇప్పుడు లెక్కలు చెపుతూ అందులో బోలెడు అవినీతి జరిగిందంటున్న బీజేపీ నాయకులు అధికారం తమ చేతిలో ఉండి కూడా ఇంతకాలం లెక్కలు ఎందుకు అడగలేదో, ఎందుకు అవినీతికి అడ్డుకట్ట వేయలేదో కూడా చెప్పాలి.

డేట్‌లైన్ హైదరాబాద్



భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర చదువుకున్నవారికి వినాయక్ దామోదర్ సావర్కర్ గురించి తెలియకుండా ఉండదు. బీజేపీ, ఆరెస్సెస్ సహా హిందూత్వవాదులంతా ఆయనను స్వాతంత్ర్య వీర్ సావర్కర్ అని పిలుచుకుంటారు. దేశంలో ఇప్పుడు అధికారంలో ఉన్న మితవాదశక్తులు నిద్రలో కూడా కలవరించే 'అఖండ భారత్'ఆలోచన వీర్ సావర్కర్ బలపరిచినదే. స్వాతంత్ర్యోద్యమంలో సావర్కర్ పాత్ర గురించి రెండు వాదనలు ఉన్నాయి. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడినందుకు సావర్కర్‌కు బ్రిటిష్ పాలకులు 50 ఏళ్ల జైలు శిక్ష విధించి అండమాన్ సెల్యూలర్ జైలుకు పంపారని బీజేపీ, ఆరెస్సెస్ తదితర హిందూత్వ అనుకూలవాదులు చెబుతారు. బ్రిటిష్ పాలనకు అనుగుణంగా నడుచుకుంటాననీ, క్షమాభిక్ష పెట్టమని వేడుకుంటూ లేఖ రాసినకారణంగా ఆయనను విడుదల చేశారనీ, మహాత్మాగాంధీ పిలుపు మేరకు జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనవద్దనీ, బ్రిటిష్ వారిచ్చిన పదవులకు రాజీనామా చెయ్యొద్దనీ తన వారికి పిలుపు ఇచ్చిన సావర్కర్ స్వాతంత్ర్యవీరుడు ఎట్లా అవుతాడని కాంగ్రెస్ వాదులూ కమ్యూనిస్ట్‌లూ వాదిస్తుంటారు. బీజేపీ, ఆరెస్సెస్‌లకు మాత్రం ఇప్పటికీ ఎప్పటికీ సావర్కర్ ఆరాధ్యదైవమే.

నివాళిలోనూ రాజకీయమే

సరే, సావర్కర్‌ను ఎవరి కోణం నుంచి వారు విశ్లేషించవచ్చు. స్వాతంత్ర్య పోరాటకాలంలో వ్యవహార శైలిని బట్టి ఆయన వ్యక్తిత్వాన్ని ఎవరయినా అంచనా వెయ్యవచ్చు. ఎవరికయినా, ముఖ్యంగా రాజకీయాల్లో ఉన్నవాళ్లు ఇటువంటి విషయాల్లో స్పష్టమయిన అభిప్రాయం కలిగి ఉండాలి, ఉంటారు కూడా. అయితే ఇప్పుడు సావర్కర్ ప్రస్తావన ఎందుకు అనే సందేహం కలగవచ్చు. మొన్న అంటే ఈ నెల 26వ తేదీ సావర్కర్ వర్ధంతి. 1966 ఫిబ్రవరి 26 వ తేదీన, అంటే 52 ఏళ్ల క్రితం ఆయన చనిపోయారు. ఆ సందర్భంగా దేశంలో చాలామంది సావర్కర్ అభిమానులు ముఖ్యంగా హిందూత్వవాదులు తమకు తోచిన పద్ధతుల్లో నివాళులు అర్పించారు. సావర్కర్ పాత్రను వ్యతిరేకించే వారు ఎవ్వరూ ఎక్కడా ఆయనకు నివాళులు అర్పించలేదు. అంతమాత్రాన ఆయన అభిమానులకు పోయేదేమీలేదు. అయితే సావర్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పించి అంతలోనే నాలుక కరుచుకుని ఆ నివాళిని వెనక్కి తీసుకునే వాళ్లను ఏమనాలి? అదికూడా మామూలు వ్యక్తులు అయితే వేరు. రాజకీయ దిగ్గజం, అపర చాణక్యుడు అని పేరు తెచ్చుకున్న, 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే నాయకుడు ఆ పని చేస్తే ఎట్లా అర్థం చేసుకోవాలి?

పాపం, సావర్కర్ గురించి ఆయనకు ఏమీ తెలియదు, ఎవరో చెపితే పొరపాటున నివాళులు అర్పించారు. ఆ వెంటనే మరెవరో, అయ్యో సావర్కర్ బ్రిటిష్ పాలనను సమర్థించినవాడు, క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించాడు అని గుర్తు చేస్తే వెనక్కి తీసుకున్నారని అర్థం చేసుకోవాలా? ఆ పని చేసింది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. చంద్రబాబు చాలా సీనియర్ నాయకుడు. ఆయనే తరచూ ఆమాట చెబుతూ ఉంటారు, దేశంలో ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో ఉన్న వాళ్లందరిలో తానే సీనియర్‌నని. అంతేకాదు, తాను స్టేట్స్‌మన్‌ని అని కూడా ఆయనే పదే పదే గుర్తు చేస్తుంటారు. వీర్ సావర్కర్ ఎవరో, ఆయనకు నివాళులు అర్పించాలా, కూడదా అన్న విషయాలు చంద్రబాబునాయుడు వంటి 'స్టేట్స్‌మన్'కు తెలియకుండా ఉంటాయని ఎట్లా అనుకుంటాం? మొన్న 26వ తేదీన పొద్దున్నే చంద్రబాబునాయుడు ట్విటర్‌లో వీర్ సావర్కర్‌కు నివాళులు అర్పించారు. అయితే కొద్దిసేపట్లోనే ఆ నివాళిని ట్విటర్ నుంచి తొలగించేశారు. మామూలు పరిస్థితుల్లో అయితే ఇది ఎవరూ పెద్దగా పట్టించుకునే విషయం కాదు. రాజకీయ అవసరాల కోసం ఎవరినయినా ఏ జంకూ లేకుండా వదిలించుకోగలిగిన చంద్రబాబు బీజేపీని మరొక్కసారి వదిలించుకోబోతున్నారనే వార్తలు బాగా ప్రచారంలో ఉన్న సమయంలో ఇది జరిగింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్నంత మాత్రాన వీర్ సావర్కర్‌ను కీర్తించాల్సిన అవసరం లేదు. ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాల్లో బీజేపీ సిద్ధాంతాలను నూటికి నూరు శాతం సమర్థించే వారే ఉండాలని లేదు. రాజకీయ అవసరాల కోసం, మళ్లీ మాట్లాడితే అధికారం కోసం ఎవరు ఎవరితో అయినా జత కడుతుంటారు, ఎవరినయినా వదిలేస్తారు. అందులో సిద్ధహస్తుడయిన చంద్రబాబు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 2004 ఎన్నికల ముందటి అవతారం మళ్లీ ఎత్తదల్చుకున్నారు కాబట్టి చంద్రబాబు నాయుడు ఇప్పుడు బీజేపీని వదిలించుకుని సెక్యులర్ బురఖా వేసుకోవాలని ఆలోచిస్తున్నారు కాబట్టే ట్విటర్‌లో నుంచి వీర్ సావర్కర్ నివాళి మాయమైంది.

ఇద్దరూ సమాధానాలు చెప్పాలి

చంద్రబాబునాయుడు తమను వదిలేస్తాడన్న విషయం బీజేపీకి కూడా తెలుసు. అందుకే కొన్నిరోజులుగా స్వరం పెంచింది. బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు కంభంపాటి హరిబాబు ఆంధ్రప్రదేశ్‌కి ఈ మూడున్నర ఏళ్లలో ఇచ్చిన నిధుల లెక్కలు చెబుతున్నారు. మరో బీజేపీ నాయకుడు, శాసనమండలి సభ్యుడు సోము వీర్రాజు ఆ నిధుల్లో జరిగిన అవినీతి గురించి చాలా గట్టిగా మాట్లాడుతున్నారు. 1995లో ఎన్టీ రామారావు నుంచి అక్రమంగా అధికారం లాక్కున్నాక, 1999లో బీజేపీ సహాయంతో, అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రజాకర్షణ శక్తి, కార్గిల్ వంటి అంశాలు కలిసొచ్చి అత్తెసరు మార్కులతో బయటపడ్డారు చంద్రబాబు. మళ్లీ 2014లో అదే బీజేపీ సహాయం, మోదీ సమ్మోహన శక్తి, పవన్‌కల్యాణ్ సహకారంతో మరోసారి అత్తెసరు మార్కులతోనే అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ఇప్పుడు మరోసారి బీజేపీని వదిలేయడం పెద్ద విశేషం ఏమీ కాదు. ఆయనకు ఎన్నడూ స్వయం ప్రకాశకత్వం లేదు. అందుకే బహుశా 2019లో కొత్త మిత్రుల వెతుకులాటలో పడ్డారేమో! అయితే 2004లో ఆయన హైదరాబాద్‌లోనే అడ్వాణీ రథం దిగేసి తెగతెంపులు చేసుకున్నప్పటి బేలతనం ప్రస్తుత బీజేపీ నాయకత్వంలో లేదు. బీజేపీ ఇప్పుడు అమాయక చక్రవర్తి అటల్ బిహారీ వాజ్‌పేయి చేతుల్లో లేదు. 'కట్ త్రోట్'రాజకీయాలు నడుపుతున్న అమిత్ షా, నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉంది.

2014లో ఆంధ్రప్రదేశ్‌కు అనేక వాగ్దానాలు చేసిన బీజేపీ, టీడీపీ రెండూ కూడా రాష్ట్ర ప్రజలకు అనేక విషయాల్లో జవాబుదారీ అన్న విషయం గుర్తించాలి. కేంద్రం నుంచి ఏ సహాయమూ రాలేదంటున్న చంద్రబాబునాయుడు కేంద్ర సహాయం అద్భుతం, అమోఘం అని ఈ నాలుగేళ్లు ఎందుకు భజన చేశారో ప్రజలకు చెప్పాలి. తాము ఇచ్చిన నిధులకు ఇప్పుడు లెక్కలు చెపుతూ అందులో బోలెడు అవినీతి జరిగిందంటున్న బీజేపీ నాయకులు అధికారం తమ చేతిలో ఉండి కూడా ఇంతకాలం లెక్కలు ఎందుకు అడగలేదో, ఎందుకు అవినీతికి అడ్డుకట్ట వేయలేదో కూడా ప్రజలకు చెప్పాలి. సరయిన జవాబులు రాకపోతే ఏం చెయ్యాలో ప్రజలు నిర్ణయించుకుంటారు.

విజన్ 2033లో చంద్రబాబు

చివరగా, చంద్రబాబునాయుడు చట్టసభల్లోకి ప్రవేశించి నిన్నటితో 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన మానసపుత్రిక అయిన ఒక మీడియా సంస్థ యజమానితో పెట్టిన సుదీర్ఘ ముచ్చట్లలో ఆయనే స్వయంగా చెప్పుకున్నారు- క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించిన మొదటిరోజే మంత్రి పదవిని ఆశించిన విషయం. అట్లాగే రాజకీయ పుట్టుకే అసమ్మతితో అని కూడా చెప్పుకున్నారు. మొదటిసారి 1978లో 26 ఏళ్ల వయసులోనే మంత్రి పదవి ఇవ్వనందుకు డాక్టర్ చెన్నారెడ్డి ప్రభుత్వం మీద అసమ్మతి కార్యక్రమం మొదలు పెట్టానని గర్వంగా చెప్పుకున్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి, అందునా ఆంధ్రప్రదేశ్ వంటి సంక్షోభ స్థితిలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ పదవీకాలంలో ప్రజలకు ఏం చేసిందీ చెప్పే ప్రయత్నం లేకపోగా 'మందు కొట్టేవారా, తోటి విద్యార్థుల చేత మందు కొట్టించి తగాదాలకు వెంట తీసుకువెళ్లేవారా, చిల్లర ఖర్చుల కోసం పేకాట ఆడేవారా' వంటి చిల్లర ముచ్చట్లకు పరిమితం కావడంతో వీక్షకులు ముక్కున వేలేసుకున్నారు.


ఈ ముచ్చట్లలోనే ముఖ్యమంత్రి ఒక్క విషయం మాత్రం స్పష్టం చేశారు. అమరావతిలో రాజధాని నిర్మించడానికీ, రాష్ట్రానికి పెట్టుబడులు తేవడానికీ తనకు ఇంకో పదిహేను సంవత్సరాలు అధికారం కావాలని చెప్పారు. బహుశా ఆయన విజన్ 2033 కావచ్చు.

datelinehyderabad@gmail.com

అందరి మంచినీ కోరిన అక్షరం

మనిషి అంతరంగం, క్లిష్ట సమయాలలో చేసే పోరాటమే కాదు, అప్పుడు తోటివారి విషయంలో ఉండవలసిన మానవతా స్పర్శనే మునిపల్లె రాజు తన కథలకి వస్తువుగా ఎంచుకున్నారు. ఆయన అందరి మంచిని కోరే మానవతావాది.

సందర్భం



వి.రాజారామ మోహనరావు



కల్మషం, మర్మం, లౌక్యం వంటివాటికి ఎంతో దూరంగా ఉండే ఆధునిక ముని మునిపల్లె రాజు. గతం, వర్తమానాలను సమంగా మేళవించుకోగలిగిన విశిష్ట వ్యక్తిత్వం ఆయనది. ఆయన రచనలు ఆ వ్యక్తిత్వాన్నే ప్రతిబింబించాయి. మృదు స్వభావం, విస్తృత పఠనంతో అబ్బిన అవగాహన, ఎదుటివారిని మెప్పించడానికి కాకుండా, జీవితాన్ని మెప్పించడానికి అనవరత తపన– వెరసి మునిపల్లె రాజు. కవిత్వం, సమీక్ష, నవల– ఇలా వివిధ ప్రక్రియలు చేపట్టినా, ఆయన ప్రధానంగా కథకుడు. మంచితనం వైపు, ఉత్తముల వైపు, ఆదర్శం వైపు మొగ్గు చూపే రచయితలు ఎక్కువే. బలహీనుల పట్ల సానుభూతి కలిగిన వారూ ఉంటారు. కానీ మునిపల్లె రాజు మాత్రం అందరి మంచిని కోరే మానవతావాది. ఒకరకంగా మనిషితనం పట్ల, మంచి జీవితం పట్ల ఆయనది అత్యాశ. కానీ అభిప్రాయాల దగ్గర మాత్రం నిర్మొహమాటి. మునిపల్లె రాజు (16.3.1925–24.2.2018) గుంటూరు జిల్లా గరికపాడులో పుట్టారు. తండ్రి హనుమంతరావు, తల్లి శారదాంబ. 1943 నుంచి 1983 వరకు నాలుగు దశాబ్దాల పాటు ఆయన భారత రక్షణ శాఖలో వివిధ హోదాలలో పనిచేశారు. పదవీ విరమణానంతరం సికింద్రాబాద్‌లో స్థిరపడ్డారు. అయితే ఈ ప్రస్థానంలో చాలా ఎగుడుదిగుళ్లు ఉన్నాయి. అవి ఆయన మాటల్లోనే: 'మా పూర్వీకులది గుంటూరు జిల్లా మునిపల్లె. కలకత్తా–మద్రాసు ట్రంక్ రోడ్ పక్కనే ఉండడం వల్ల కొంత నాగరికత సంతరించుకున్న గ్రామం. నా జననం రెండు ప్రపంచ సంగ్రామాల మధ్య నెలకొన్న ఆర్థిక మాంద్య దశలో–హంగ్రీ థర్టీస్ అనబడే 1925లో. మా తరాన్ని ఊండెడ్ జనరేషన్ అని చరిత్ర పేర్కొంటున్నది. ఆ తర్వాత మా కుటుంబం దగ్గర్లోనే ఉన్న తెనాలి పట్టణానికి తరలిపోయింది. అదొక సాంస్కృతిక కేంద్రం. దానితోడు మా కుటుంబంలో రాజకీయ చైతన్యం, పుస్తక పఠనం, సామాజిక సంస్కరణల పట్ల గాఢా నురక్తి ఉండడంతో నేను ఆ దిశలోనే పయనించాను. అన్ని భావధారలకీ సంబంధించిన ఏదో ఒకరకం చర్చ నిత్యం మా ఇంట్లో జరుగుతూ ఉండేది. అది వినడం, విశ్లేషించి జీర్ణించుకోవడం నాకు అలవడ్డాయి. మా నాన్నగారి హఠాన్మరణం తదుపరి మా పేదరికం వల్ల చిన్న ఉద్యోగం చూసుకుని, ఆ ఉద్యోగ రీత్యానే దేశాటనం చేశాను. భారత దేశపు బహుళత్వంలోని ఏకత్వం అనుభవంలోకి రావడం ఈ దేశాటనం వల్లనే. మొదట్లో కవిత్వ ధోరణి ప్రబలంగా ఉన్నా, కాల్పనిక సాహిత్యంలో వచన ప్రక్రియలందే మనసు లగ్నమైంది. నా విద్యార్థి దశలో అబ్బిన రచనా వ్యాసంగం– ఇప్పటికీ నన్ను సమ్మోహితుడిని చేస్తుంది. కొత్తగా కలం పట్టిన యువకుల వ్యక్తీకరణను ప్రోత్సహించడం నాకెంతో ఆనందం. రష్యన్ మాస్టర్ల సాహిత్యం వల్ల అన్ని వాదాల కన్నా, మానవతావాదమే నన్ను ఆకర్షించింది. నా రచనలన్నింటిలో అది ప్రతిఫలిస్తుందని నా విశ్వాసం.'

రాజుగారి కథలు జీవితంలోని దయనీయ కోణంతో పాటు, ఔదార్యాన్ని కూడా చూపించి సమాజం పట్ల సానుకూలతను పెంచుతాయి. మనిషి అంతరంగం, క్లిష్ట సమయాలలో చేసే పోరాటమే కాదు, అప్పుడు తోటివారి విషయంలో ఉండవలసిన మానవతా స్పర్శనే మునిపల్లె రాజు తన కథలకి వస్తువుగా ఎంచుకున్నారు. వారాలు చేసుకుని చదువుకోవడం కొంతమంది పేద పిల్లల జీవిత దృశ్యమే కాదు, మరికొందరి ఔదార్యానికీ అనురాగానికీ ప్రతిరూపం. ఇలాంటి వారాల పిల్లలు రాజుగారి కథలలో కనిపిస్తారు. ఆయన 'వారాలబ్బాయి' కథ ప్రత్యేకమైనది. ఊరు మంచినే తన మేలుగా భావించే ముదుసలి శేషమ్మ జీవితంలో అన్ని బాధలనీ భరిస్తూ తల్లిగా తన బాధ్యతకే అంకితమైన జానకమ్మ, జీవితపు విలువని, ఆధ్యాత్మిక వారసత్వాన్ని తెలిపే దొడ్డమ్మ.. ఇలా రాజుగారి కథలలో ఎన్నెన్నో పాత్రలు.


రాజుగారు రాసిన ఒకే ఒక నవల 'పూజారి' (1952). బీఎన్ రెడ్డి నిర్మించిన 'పూజాఫలం' చిత్రానికి ఇదే మాతృక. ఈ నవలారంభమే గాఢమైనది. రచయిత తాత్వికత, అంతర్దృష్టి ఎలాంటివో తెలియచేసే ఆరంభమది. ఒక ఊరిలో ఒక పార్క్ దగ్గర నవల ఆరంభమవుతుంది. అది ఆలనా పాలనా లేనట్టే ఉన్నా, నిరుపయోగంగా లేదు. అంటే ఎవరి ఇష్టం వచ్చినట్టు వారు విని యోగించుకుంటున్నారు. నవలా నాయకుడు మధు పరిచయం ఈ అంశం ద్వారా చెప్పారు రచయిత. మధు పెద్ద జమీకి వారసుడు. తల్లీతండ్రీ మరణించడంతో తాతగారి సంరక్షణలో ఉన్నాడు. కానీ క్షయ వ్యాధి సోకి, మదనపల్లి శానెటోరియంలో ఉంటున్నాడు. అన్నీ ఉన్నా ఉత్సాహం లేదు. అందుకే 'నిరాశా వేదాంతి' అతడు. కానీ ఇలాంటి జీవితంలోనూ రెండు మంచి అలవాట్లు అతడికి ఉన్నాయి. ఒకటి సంగీతం పట్ల మక్కువ. రెండు క్రమం తప్పకుండా కళాశాలకు వెళ్లడం. తోడుగా ఉండేందుకు ఇంటి కింది భాగం అద్దెకు ఇచ్చారు. వీరి అమ్మాయే ప్రీతి. ఆమె రాక మధుకు అనూహ్య అనుభవం. కళాశాలలో పరిచయమైన శ్రీరాం కూడా మధుకు ఇష్టమే. వాళ్లిద్దరిలో మధుకి నచ్చిన అంశం ఆశ, ఆత్మబలం. కానీ ప్రీతి ఎలా వచ్చిందో అలాగే నిష్క్రమించింది. కానీ జమీ గుమాస్తా రామకృష్ణయ్య కూతురు సుశీల మధునీ, జమీని ఒక క్లిష్ట పరిస్థితి నుంచి రక్షిస్తుంది. ఈ క్రమంలో మధు, సుశీల దగ్గరవుతారు. డిఫాటిజమ్ – అపరాధ భావం అన్నది ఓ మానసిక శాఖ. దానికి ప్రతిరూపంగా మధు పాత్రని నిర్మించారు మునిపల్లె రాజు. మంచి రచయిత కాలం కన్నా ఒక్క అడుగైనా ముందే ఉండి ఆలోచిస్తాడు. అందుకు పూజారి నవల మంచి ఉదాహరణ. నిజానికి ఎల్లలు ఎరుగని ఆలోచన ఆయనది.

(వ్యాసకర్త ప్రముఖ రచయిత 91105 32710)

రైతు బడ్జెట్... అబ్రకదబ్ర

ఒకవైపు రైతు ఆదాయం రెట్టింపు చేయాలని కేంద్రం భావిస్తున్నా.. రైతుల ఆదాయాలు దిగజారిపోతున్నాయి. ప్రత్యామ్నాయం ఉంటే 69% మంది రైతులు వ్యవసాయం నుంచి బయటకి వచ్చేయడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం.

విశ్లేషణ



డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

''ముసుగుల్ని తొలగిస్తేనే గానీ వాస్తవాలు బయటపడవన్నది ఓ నానుడి''. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ యేడాది ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌కు 'రైతు బడ్జెట్' అనే ముసుగు తగిలించారు. విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు అని నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. నిజంగా జైట్లీ బడ్జెట్ రైతులకు మేలు చేసేదే అయితే సంతోషమే! రైతాంగాన్ని మభ్యపెట్టేది అయితే మాత్రం.. అది ఆత్మవంచనే అవుతుంది. నేతి బీరకాయలో నెయ్యి ఏ మేరకు ఉంటుందో... ఆ చందంగానే జైట్లీ బడ్జెట్‌లో రైతు సంక్షేమం ఉందని రైతు సంఘాలు దేశవ్యాప్తంగా నిట్టూర్చుతున్నాయి.



కేంద్ర బడ్జెట్ కంటే ఒక రోజు ముందుగా విడుదలైన ఆర్థిక సర్వే దేశ వ్యవసాయ రంగ స్థితిగతుల్ని ఎత్తిచూపింది. స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయ రంగం వాటా క్రమంగా తగ్గిపోతున్నప్పటికీ, ఇప్పటికీ అది మెజారిటీ ప్రజల జీవనాధారంగానే కొనసాగుతున్నదని, భారత ఆర్థిక వ్యవస్థకు అదొక చోదకశక్తి అని ఆర్థిక సర్వే పేర్కొంది. ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను కొన్ని జాతీయ పత్రికలు సైతం వ్యవసాయ బడ్జెట్ అంటూ ఆకాశానికి ఎత్తేశాయి. నిధుల కేటాయింపులను, కనీస మద్దతు ధరలను ఖర్చులపై 50% (డా. స్వామినాథన్ సిఫార్సు మేరకు) పెంచి ఇస్తామంటూ చేసిన ప్రకటనల నేపథ్యంలో సమాజంలో అన్ని వర్గాలు, ఆఖరుకు మీడియాతో సహా భ్రమల్లో మునిగిపోయారు.

కేటాయింపుల పరంగా చూస్తే.. దాదాపు పాతిక లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు కేటాయించి ఇచ్చింది రూ. 68,836 కోట్లు. ఈ అంకెలు ఘనంగా మేడిపండును తలపించేటట్లు న్నాయి. ఉదాహరణకు పంటల బీమా పథకానికి రూ. 13,000 కోట్లు కేటాయింపులు చేశారు. రెండేళ్ల క్రితం 2016–17 బడ్జెట్‌లో ఇదే పథకానికి రూ. 5,500 కోట్లు కేటాయించారు. ఈ సొమ్ముతో దేశవ్యాప్తంగా 30% సాగు విస్తీర్ణానికి బీమా చేయించాలన్నది అప్పటి లక్ష్యం. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో 22%, తెలంగాణలో 10% విస్తీర్ణానికే రైతులు బీమా ప్రీమియం చెల్లించారు. దేశం మొత్తంమీద 30% విస్తీర్ణానికి రైతులు ప్రీమియం కట్టారని ఇందుకోసం చివరికి రూ. 13,240 కోట్లు ఇచ్చినట్లు సవరించిన 2016–17 బడ్జెట్ లెక్కల్లో చూపించారు. 30% విస్తీర్ణానికి బీమా చేయిస్తేనే కేంద్రానికి రూ. 13,240 కోట్లు అవసరం అయినప్పుడు బీమా పరిధిలోకి ఈ ఏడాది 50% సాగు విస్తీర్ణాన్ని తేవాలని పెట్టుకున్న లక్ష్యానికి రూ. 13,000 కోట్లు ఏవిధంగా సరిపోతాయి? కనీసం 22,000 కోట్లు పైనే కావాలి గదా! ఇటువంటి విచిత్రాలు జైట్లీ బడ్జెట్‌లో చాలానే కనిపిస్తాయి.

కౌలుదారులకు బ్యాంకుల రుణ వితరణ ఈ సారి కూడా ఎండమావిగానే మిగిలిపోనుంది. దేశంలో కౌలుదారీ వ్యవసాయం గణనీయంగా పెరిగిన విషయం తెలిసికూడా వరుస ప్రభుత్వాలు కౌలుదారులను ఆదుకోవడంలో ఘోరంగా విఫలం అవుతున్నాయి. గుర్తింపుకార్డులు లేవనే నెపంతో బ్యాంకులు వారికి రుణాలివ్వడం లేదు. కౌలు దారులకు గుర్తింపు కార్డులిచ్చే ప్రక్రియ నత్తనడక కంటే హీనంగా తయారైంది.

రైతుల ఆదాయాన్ని పెంచడానికి, రెట్టింపు చేయడానికి ఏకైక మార్గం.. డా.ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతాన్ని కలిపి కనీస మద్దతు ధర ఇవ్వడమే! అయితే, ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే.. ఉత్పత్తి వ్యయంపై 50% కలిపి ఇవ్వడం సాధ్యపడదని సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ద్వారా తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే.. తాజా బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పంట ఉత్పత్తి ఖర్చుపై 50% కలిపి ఇస్తామంటూ ప్రకటన చేసినప్పుడు అందరూ ఆశ్చర్యపోయిన మాట నిజం.

ఎంఎస్‌పీ నిర్ధారణకు ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతి ఎంతమాత్రం అంగీకారం కాదు. సమగ్రమైన ఉత్పత్తి ఖర్చు డా.స్వామినాథన్ అంచనావేసిన సి2 కాకుండా, కొన్ని ఖర్చులను మినహాయించి ఏ2+ఎఫ్ఎల్‌ను ప్రాతిపదికన తీసుకోవడం రైతాంగాన్ని మోసగించడమే. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే నివేదికను పరిగణనలోకి తీసుకుని కేంద్రం నిర్ణయిస్తున్న మద్ధతుధరలు.. ఏ2 పద్ధతి ప్రకారం కూడా ఉండడంలేదు. ఉదాహరణకు, వచ్చే ఖరీఫ్‌కు సంబంధించి సీఏసీపీకి పంపిన నివేదికలో ఏ2 ప్రాతిపదికనే ధాన్యం ఉత్పత్తి ధర క్వింటాల్‌కు రూ. 2,022గా ఉంది. కానీ, ప్రస్తుతం ఏ గ్రేడ్ రకం ధాన్యానికి మద్దతు ధర క్వింటాల్‌కు కేవలం రూ. 1,590గా ఉంది. అన్ని రాష్ట్రాల ఉత్పత్తి ధరల సరాసరి క్వింటాల్‌కు రూ. 1,100గా నిర్ణయించి.. ఆ మేరకు మద్దతు ధరను కేంద్రం నిర్ణయిస్తున్నది. దాని ప్రకారమే మద్దతు ధరలు ఒకటిన్నర రెట్లు ఉన్నాయని ఆర్థికమంత్రి జైట్లీ చెప్పుకుంటున్నారు. జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతుకు భరోసా లభించిందని, క్లిష్టపరిస్థితుల్లో ఉన్న వ్యవసాయరంగానికి ఊతమిచ్చేదిలా ఉందంటూ చేస్తున్న శాస్త్రీయత లేని ప్రకటనలు మోసపూరితమైనవి. ఇవే విధానాలు కొనసాగితే 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యంలో ఎన్డీఏ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు.

వ్యాసకర్త ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నాయకులు | 9989024579

సవరణ: మంగళవారం నాటి సాక్షి సంపాదక పేజీలో ప్రచురించిన 'నిజాయితీకి నిదర్శనాలు' వ్యాసంలో 'థానే' అనే పదాన్ని 'రాణే' అని చదువుకోగలరు. ఎడిటర్

త్రిపురలో కూలనున్న ఎర్రకోట!

- త్రిపురలో కమల వికాసం
- నాగాలాండ్‌లోనూ హవా
- మేఘాలయలో అధికారం కోల్పోనున్న కాంగ్రెస్
- ఈశాన్య రాష్ట్రాల ఎగ్జిట్ పోల్స్

న్యూఢిల్లీ: దేశంలో కమ్యూనిస్టుల చివరి కంచుకోట కూడా కూలిపోబోతోందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. త్రిపురలో 1993 నుంచి ఇప్పటి వరకు ఏకంగా 25 ఏళ్లుగా సీపీఎం ఒక్కటే అధికారంలో ఉంది. దేశంలో ప్రస్తుతం కమ్యూనిస్టులు ఇతరులతో పొత్తులేకుండా పాలిస్తున్న ఏకైక రాష్ట్రం త్రిపుర మాత్రమే. అయితే ఈసారి అక్కడ బీజేపీ పీఠ మెక్కనుందని న్యూస్ ఎక్స్, మై యాక్సిస్ ఇండియా ఎగ్జిట్ పోల్స్‌లో తేలింది. నాగాలాండ్‌లో కూడా బీజేపీయే స్వల్ప ఆధిక్యంతో గెలవచ్చని ఎగ్జిట్‌పోల్స్ తేల్చాయి. అయితే సీ–ఓటర్ సర్వే మాత్రం వీటికి భిన్నంగా ఉంది. త్రిపురలో కమ్యూనిస్టులు తమ అధికారాన్ని నిలుపుకునే అవకాశం ఉందంటోంది. త్రిపురలో ఈ నెల 18న, మేఘాలయ, నాగాలాండ్‌లలో మంగళవారం పోలింగ్ జరిగింది. మూడు రాష్ట్రాల ఫలితాలూ ఈ శనివారం వెలువడనున్నాయి. మూడు రాష్ట్రాల శాసనసభల్లోనూ సమానంగా 60 సీట్లే ఉన్నాయి. అయితే త్రిపుర, మేఘాలయల్లో ఇద్దరు అభ్యర్థులు మృతి చెందడంతో, నాగాలాండ్‌లో ఒక స్థానానికి ఏకగ్రీవంగా ఎన్నిక జరగడంతో మూడు రాష్ట్రాల్లో 59 సీట్లకే పోలింగ్ జరిగింది.



గరో హిల్స్‌లో ఓటేశాక సిరా గుర్తు చూపిస్తున్న మేఘాలయ సీఎం సంగ్మా, కుటుంబసభ్యులు

మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీ కూటమి చెప్పుకోదగ్గ సంఖ్యలో సీట్లను సాధిస్తుందనీ, కాంగ్రెస్ మాత్రం నాగాలాండ్, త్రిపురల్లో ఖాతానే తెరవక పోవచ్చని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన పీపుల్స్ పల్స్ సంస్థ నిర్వహించిన ప్రీ పోల్ సర్వేలోనూ త్రిపుర, మేఘాలయలకు సంబంధించి దాదాపుగా ఇవే ఫలితాలు వచ్చాయి.

త్రిపురలో...: త్రిపురలో న్యూస్ ఎక్స్ ప్రకారం బీజేపీ–ఐపీఎఫ్‌టీ (ఇండిజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర) కూటమికి 35 నుంచి 45 సీట్లు, 51 శాతం ఓట్లు రానున్నాయి. యాక్సిస్ మై ఇండియా అంచనా ప్రకారం బీజేపీ–ఐపీఎఫ్‌టీ కూటమికి 44–50 సీట్లు, 49 శాతం ఓట్లు వస్తాయి. అయితే సీ–ఓటర్ మాత్రం త్రిపురలో సీపీఎం, బీజేపీ కూటమిల మధ్య సీట్ల తేడా స్వల్పంగా ఉంటుందనీ, సీపీఎంకు 26–34, బీజేపీ కూటమికి 24–32 సీట్లు వస్తాయని చెబుతోంది.

మేఘాలయలో...: కాంగ్రెస్ అధికారంలో ఉన్న మేఘాలయలోనూ న్యూస్ ఎక్స్ ప్రకారం అత్యధికంగా ఎన్‌పీపీ (నేషనల్ పీపుల్స్ పార్టీ)కి 23–27 సీట్లు రానున్నాయి. సీ–ఓటర్ ప్రకారం ఎన్‌పీపీకి 17 నుంచి 23 దక్కనున్నాయి. యాక్సిస్ మై ఇండియా మాత్రం బీజేపీకి 30 సీట్లు వస్తాయంటోంది.

నాగాలాండ్‌లో...: నాగాలాండ్‌లో బీజేపీ–ఎన్‌డీపీపీ కూటమికి 27 నుంచి 32 సీట్లు వస్తాయని న్యూస్ ఎక్స్ చెబుతోంది. సీ–ఓటర్ ప్రకారం బీజేపీ కూటమికి 25 నుంచి 31 సీట్లు దక్కనున్నాయి.

త్రిపుర

సర్వే సంస్థ	బీజేపీ+	లెఫ్ట్	కాంగ్రెస్
న్యూస్ ఎక్స్	35–45	14–23	0
యాక్సిస్ మై ఇండియా	44–50	9–10	–
సీ–ఓటర్	24–32	26–34	0–2
2013లో సీట్లు	-	50	10

నాగాలాండ్

సర్వే	బీజేపీ+	ఎన్‌పీఎఫ్	కాంగ్రెస్
న్యూస్ ఎక్స్	27–32	20–25	0–2
సీ–ఓటర్	25–31	19–25	0–4
2013లో సీట్లు	1	38	8

మేఘాలయ

సర్వే సంస్థ	బీజేపీ	కాంగ్రెస్	ఎన్‌పీపీ	ఇతర పార్టీలు
న్యూస్ ఎక్స్	8–12	13–17	23–27	2–6
యాక్సిస్ మై ఇండియా	30	20	2	4
సీ–ఓటర్	4–8	13–19	17–23	8–12
2013లో వచ్చిన సీట్లు	-	29	2	16

నాగాలాండ్, మేఘాలయలో 75 శాతం పోలింగ్

న్యూఢిల్లీ: నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో 75% పోలింగ్ నమోదైంది. మేఘాలయలో ఓటింగ్ ప్రశాతంగా ముగియగా నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, బీజేపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణల్లో ఒకరు చనిపోయారు. నాగాలాండ్ రాష్ట్రం అకులుటో నియోజకవర్గం జున్‌హెబోటో జిల్లాలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో ఒకరు చనిపోగా పలువురు గాయపడ్డారు. పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) అభిజిత్ సిన్హా తెలిపారు. మోన్ జిల్లా టిజిట్ నియోజకవర్గంలోని ఓ గ్రామంలోని పోలింగ్ స్టేషన్ సమీపంలో బాంబు పేలి ఒకరు గాయపడ్డారని చెప్పారు. సుధోస్డు, లాడిగఢ్‌లో పోలింగ్ స్టేషన్‌ల వద్ద ఉద్రిక్తతల కారణంగా ఎన్నిక నిలిపివేసినట్లు వివరించారు. క్రైస్తవ వ్యతిరేక పార్టీకి ఓటేయరాదంటూ మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లోని ఓ ప్రైవేట్ రేడియో స్టేషన్ జాకీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. ఎన్నికలకు మతం రంగు పులిమేందుకు యత్నించిన ఆ స్టేషన్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈనెల 18వ తేదీన ఎన్నికలు జరిగిన త్రిపురతోపాటు మేఘాలయ, నాగాలాండ్ ఓట్ల లెక్కింపు వచ్చే నెల 3న చేపట్టనున్నారు.



రీబోహీలో ఓటేసిన మహిళా ఓటరు

నీట్ 'అర్హత'లో మా పాత్ర లేదు: సీబీఎస్ఈ

ఈసారి 150 పట్టణాల్లో పరీక్షా కేంద్రాలు



న్యూఢిల్లీ: వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్‌కు విద్యార్హతలు నిర్ణయించడంలో తమ పాత్ర లేదని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏమైనా అభ్యంతరాలుంటే మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ)ని సంప్రదించాలని సూచించింది. దూర విద్యలో ఇంటర్మీడియెట్ పూర్తిచేసిన వారు, 12వ తరగతిలో జీవశాస్త్రాన్ని అదనపు సబ్జెక్టుగా అభ్యసించిన వారిని నీట్‌కు అనర్హులుగా ప్రకటించడంతో ఫిర్యాదులు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీబీఎస్ఈ స్పందిస్తూ..' ఎంసీఐ సమర్పించిన విద్యార్హతల మేరకు నీట్ పరీక్ష నిర్వహణ వరకే మా బాధ్యత. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించాం. ఇకపై ఎలాంటి ఫిర్యాదులనైనా మాకు పంపే ముందు నీట్ వెబ్‌సైట్‌లో ఉంచిన సమాచారాన్ని జాగ్రత్తగా చదువుకోగలరు' అని అభ్యర్థులకు సూచించింది. మరోవైపు, మే 6న జరిగే నీట్ పరీక్షకు మరో 43 పట్టణాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మానవ వనరుల అభివృద్ధి మంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడించారు. ఇందులో తెలంగాణ నుంచి 2 పట్టణాలు, ఆంధ్రప్రదేశ్ నుంచి 5 పట్టణాలున్నాయి. దీంతో ఈసారి మొత్తం 150 పట్టణాల్లో పరీక్ష జరుగుతుంది.

తమిళనాడుకు తొలి డిఫెన్స్ కారిడార్

న్యూఢిల్లీ: దేశంలోనే తొలి డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను తమిళనాడులో అభివృద్ధి చేసే ప్రక్రియను కేంద్రం ప్రారంభించింది. చెన్నై, హొసూర్, కోయంబత్తూర్, సేలం, తిరుచిరాపల్లిలను కలుపుతూ ఈ డిఫెన్స్ కారిడార్ ఉండనుంది. ఈ ప్రాజెక్టుకు ప్రస్తుతం అధికారులు తుదిరూపునిస్తున్నారు. దేశంలో రెండు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్లను నెలకొల్పుతామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. మరో కారిడార్‌ను బుందేల్‌ఖండ్ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని గత వారమే ప్రకటించారు.

తేజస్ కీలక పరీక్ష విజయవంతం



బెంగళూరు: స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన తేలికపాటి యుద్ధవిమానం (ఎల్‌సీఏ) 'తేజస్' మరో కీలక పరీక్షను విజయవంతంగా పూర్తి చేసుకుంది. సోమవారం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన తేజస్ ఎల్ఎస్‌పీ8 విమానం తిరిగి సురక్షితంగా చేరుకోవటంతోపాటు, ఇంజిన్ ఆన్‌లో ఉండగానే ఇంధనం నింపుకుంది. ఇలాంటి సదుపాయం ఉన్న భారత వైమానిక దళ విమానాల్లో తేజస్ మొట్టమొదటిదని హాల్ తెలిపింది. తేజస్‌కు ఉన్న ఈ సౌలభ్యంతో ఇంధనం నింపుకునే సమయం సగానికి సగం తగ్గిపోతుందని వివరించింది.

హైదరాబాద్ నుంచి హజ్ టికెట్ 65 వేలు

న్యూఢిల్లీ: హజ్ యాత్రికుల విమాన చార్జీలను గణనీయంగా తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి కార్యాలయం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో టికెట్ ధర రూ.20 వేల నుంచి రూ.97 వేల వరకు తగ్గుతుందని మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వి అన్నారు. 2014లో అప్పటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయించిన టికెట్ ధరలతో పోలిస్తే 18 నుంచి 49శాతం తక్కువని తెలిపారు. తాజా నిర్ణయంతో అహ్మదాబాద్, ఢిల్లీ నుంచి హజ్ యాత్రకు ప్రస్తుతం ఉన్న విమాన చార్జీ రూ.98, 750 నుంచి రూ.65,015కు, ముంబై నుంచి రూ.98,750 నుంచి రూ.57,857కు తగ్గుతుంది. శ్రీనగర్ నుంచి టికెట్ ధర ఇది వరకు రూ.1,98,350 ఉండగా అది గరిష్టంగా దాదాపు సగం తగ్గి రూ.1,01,400కే వస్తుంది. వారణాసి నుంచి ఉన్న రూ.1,12,300గా ఉన్న టికెట్ ధర కనిష్టంగా తగ్గి రూ.92,004 అవుతుంది. హైదరాబాద్ నుంచి ప్రస్తుతం ఉన్న టికెట్ ధర రూ.1,01600 నుంచి రూ.65,766కు దిగిరానుంది. ఈ తగ్గింపు ఎయిరిండియా, సౌదీ ఎయిర్‌లైన్స్‌తోపాటు ఫ్లైనాస్ విమానాల్లో ప్రయాణించే వారికి వర్తించనుంది. సౌదీ అరేబియాకు చెందిన ఫ్లైనాస్ సంస్థ మన దేశంలోని 21 విమానాశ్రయాల నుంచి జెడ్డా, మదీనాలకు సర్వీసులను నడుపుతోంది. 2012 నాటి సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు హజ్ యాత్ర సబ్సిడీలను నెల క్రితం ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసింది.

ఇది పైసా వసూల్ సర్కారు

- కర్ణాటక ప్రభుత్వంపై ప్రధాని మోదీ ధ్వజం
- ఇక్కడ నడిచేది 'సీదా రూపయ్యా' సర్కారు

సాక్షి,బెంగళూరు: ''కర్ణాటకలో సిద్దరామయ్య ప్రభుత్వం ఉందని కొందరు అనుకుంటున్నారు. కానీ, ఇక్కడ నడిచేది 'సీదా రూపయ్యా సర్కారు' అని ప్రజలు భావిస్తున్నారు'' అని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. ఇక్కడ డబ్బు లేనిదే ఏ పనీ జరగదనీ, రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న ఇలాంటి ప్రభుత్వం ఒక్క నిమిషం కూడా ఉండటానికి వీలు లేదని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి బీఎస్ యడ్యూరప్ప 75వ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం దావణగెరెలో నిర్వహించిన భారీ సభలో ఆయన మాట్లాడారు.



దావణగెరెలో వేదికపై నుంచి అభివాదం చేస్తున్న మోదీ, యడ్యూరప్ప, ఈశ్వరప్ప

ఎలాంటి మేలూ చేయని సిద్దరామయ్య ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. ఈ ప్రభుత్వం ఢిల్లీ పెద్దలను సంతృప్తి పరచటం, అసంతృప్త నాయకులకు వసూళ్లలో వాటాలివ్వటం అనే రెండు పనులను మాత్రం చేస్తోందని దుయ్యబట్టారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు కాంగ్రెస్సే కారణమని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు, మంత్రుల ఇళ్లపై జరిగిన ఐటీ దాడుల్లో బయటపడిన బంగారం, డబ్బుల కట్టలు ఎవరి సొమ్మని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. అంతకుముందు జరిగిన కార్యక్రమాల్లో సిద్దరామయ్య ప్రభుత్వాన్ని పది శాతం కమీషన్ ప్రభుత్వం అని విమర్శించిన ప్రధాని.. ఆ సమాచారం తప్పని,, అవినీతి అంతకుమించి ఉంటుందని తెలిసిందని అన్నారు. ఈ వ్యవహారం కర్ణాటకలో అందరికీ తెలుసన్నారు. స్వచ్ఛ భారత్, వాటర్‌షెడ్, స్మార్టు సిటీల కోసం కేంద్రం ఇస్తున్న వేలాది కోట్ల నిధులను ప్రభుత్వం వినియోగించుకోవటం లేదన్నారు. ప్రజల ఆకాంక్షలను పట్టించుకునే బీజేపీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. త్వరలో జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సీఎం అభ్యర్థిగా బలమైన లింగాయత్ వర్గానికి చెందిన యడ్యూరప్పను బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. మంగళవారం యడ్యూరప్ప పుట్టినరోజు కూడా కావటం గమనార్హం. కాగా, రాష్ట్రంలో ప్రధాని పర్యటన ఈ నెలలో ఇది మూడోది.

సీబీఐని తప్పుపట్టినందుకే ఆమెను తొలగించారు

మరో జడ్జీకి ఉద్వాసనపై రాహుల్



న్యూఢిల్లీ: సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు విచారణ జరుపుతున్న జడ్జిని బాధ్యతల నుంచి తప్పించటంపై ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించారు. ఈ ఘటనలో మీడియా మౌనాన్ని, సీబీఐ దర్యాప్తు తీరును తప్పుపట్టినందుకే జస్టిస్ రేవతిని తొలగించారని ఆరోపించారు. సొహ్రాబుద్దీన్ కేసుతో సంబంధమున్న బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాతోపాటు కొందరు సీనియర్ ఐపీఎస్ అధికారులను తప్పించటంపై దాఖలైన పిటిషన్లను బాంబే హైకోర్టులో జస్టిస్ రేవతి మొహితే–డేరే ఆధ్వర్యంలోని ఏకసభ్య ధర్మాసనం రోజువారీగా గత మూడు వారాలుగా విచారిస్తోంది. అయితే, ఆమెను ఈ బాధ్యతల నుంచి తప్పించి, జస్టిస్ ఎన్‌డబ్ల్యూ సాంబ్రేకి అప్పగిస్తున్నట్లు మంగళవారం హైకోర్టు వెబ్‌సైట్‌లో అధికారిక ప్రకటన వెలువడింది. కాగా, ఈ కేసులో నిజానిజాలను నిగ్గు తేల్చేందుకు యత్నించిన మరో జడ్జి బీజీ లోయా చనిపోయిన సంగతి తెలిసిందే.

'ఈజ్ ఆఫ్ జస్టిస్ డెలివరీ'కి ఇదే సమయం

న్యాయ వ్యవస్థను హేతుబద్ధీకరించాలి: సుప్రీం

న్యూఢిల్లీ: న్యాయ వ్యవస్థను హేతుబద్ధీకరించడానికి ఇదే తగిన సమయమని సుప్రీం కోర్టు పేర్కొంది. ఏళ్లుగా సాగుతోన్న కేసుల పరిష్కారానికి ఈ దిశగా యోచించాలని సూచించింది. అలాగే 'కేస్ మేనేజ్‌మెంట్' వ్యవస్థ అందుబాటులోకి రావాలంది. ఢిల్లీలో భూమి కొనుగోలుకు సంబంధించి 1986 నాటి కేసు విచారణ తన ముందుకు వచ్చినప్పుడు ధర్మాసనం ఈ విధంగా స్పందించింది. 31 ఏళ్లుగా ఒక కేసు కొలిక్కిరాకపోవడం తమకు ఆందోళన కలిగిస్తోందని, ఇరు కక్షిదారులు కూడా కేసు భవితవ్యంపై ధీమాగా లేరని జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'ఈజ్ ఆఫ్ డూయిం గ్ బిజినెస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ కాంట్రాక్ట్ అనే రెండు పదాలను ఈ మధ్య తరచుగా వింటున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మాటను న్యాయ వ్యవస్థకు అనువర్తింపజేస్తే.. మొత్తం వ్యవస్థను హేతుబద్ధీకరించి కేస్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను అమల్లోకి తేవాల్సి ఉందని స్పష్టమవుతోంది. అప్పుడే కేసుల విచారణ వేగవంతమవుతుంది' అని బెంచ్ పేర్కొంది.

అమెరికాకు మేలు చేయట్లేదు

హార్లీ డేవిడ్‌సన్ బైక్‌లపై భారత్ దిగుమతి సుంకం తగ్గించడంపై ట్రంప్

వాషింగ్టన్: హార్లీ డేవిడ్‌సన్ మోటార్ సైకిళ్లపై కస్టమ్స్ సుంకాన్ని భారత్ తగ్గించినప్పటికీ అమెరికాకు పెద్ద మేలు జరగడం లేదని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. హార్లీ డేవిడ్‌సన్, ట్రియంఫ్ బ్రాండ్లు సహా దిగుమతి చేసుకునే విలాసవంత మోటార్‌సైకిళ్లపై భారత్ కస్టమ్స్ సుంకాన్ని 50 శాతానికి తగ్గించడం తెలిసిందే. మంగళవారం రాష్ట్రాల గవర్నర్లతో సమావేశమైన ట్రంప్.. ప్రధాని మోదీని ఉద్దేశించి మాట్లాడుతూ 'బైక్‌లపై దిగుమతి సుంకాన్ని 50 శాతానికి తగ్గిస్తున్నట్లు అద్భుతవ్యక్తి (మోదీ) నాకు ఒక రోజు ఫోన్ చేసి చెప్పారు. నేను సరేనన్నాను. కానీ మనకు వచ్చిన లాభమేం లేదు. మనం వాళ్లకు మేలు చేస్తున్న విధంగానే వాళ్లు కూడా మనకు మేలు చేస్తున్నారని ఆయన అనుకుంటున్నారు' అని అన్నారు.

మళ్లీ రాచరికం వైపు అడుగులా!

- జిన్‌పింగ్ పదవీకాల పెంపు ప్రతిపాదనపై చైనాలో వ్యతిరేకత
- బహిరంగ లేఖలు రాసిన ప్రముఖ జర్నలిస్ట్, మహిళా పారిశ్రామికవేత్త



బీజింగ్: అధ్యక్షుడు జిన్‌పింగ్ నిరవధికంగా అధికారంలో కొనసాగేలా అనుమతించే ప్రతిపాదనపై చైనాలో వ్యతిరేకత మొదలైంది. అధికార కమ్యూనిస్ట్ పార్టీ(సీపీసీ) నిర్ణయాన్ని శాసనకర్తలు తిరస్కరించాలని కోరుతూ సోమవారం ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, పాత్రికేయులు లీ డతోంగ్, మహిళా వ్యాపారవేత్త వాంగ్ ఇంగ్ బహిరంగ లేఖలు రాశారు. వారి వ్యాఖ్యలు స్థానిక మెసేజింగ్ యాప్ వీచాట్‌లో విస్తృతంగా వ్యాపించాయి. చైనా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు రెండు సార్లే పదవి చేపట్టాలంటున్న ప్రస్తుత నిబంధనలను రద్దుచేస్తూ రాజ్యాంగ సవరణ చేయాలని అధికార పార్టీ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఇది అమల్లోకి వస్తే జిన్‌పింగ్ తన జీవిత కాలమంతా అధికారంలో కొనసాగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ఇలా అయితే, చైనా మళ్లీ రాచరిక పాలనలోకి వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

తిరోగమన పయనం..

ఈ పరిణామాలపై లీ డతోంగ్ స్పందిస్తూ... అధ్యక్షుడి పదవీ కాల పరిమితులను ఎత్తేస్తే దేశంలో అస్థిరత ఏర్పడుతుందని అన్నారు. దేశాధినేత పదవికి నిర్దిష్ట కాల పరిమితి లేనట్లయితే, తాము మళ్లీ రాచరిక యుగంలోకి వెళ్తున్నట్లేనన్నారు. ప్రభుత్వ సంస్కరణలకు గట్టి మద్దతుదారైన వాంగ్ ఇంగ్ తన లేఖలో.. 'మా తరం అంతా మావో పాలనలోనే గడిచిపోయింది. అది గతం. మళ్లీ ఎలా అటు వైపు వెళ్తాం? అధికార పార్టీ ప్రతిపాదన పూర్తిగా వంచనాపూరితం. మెజారిటీ ప్రజల అభిప్రాయలకు విరుద్ధం' అని పేర్కొన్నారు. చైనా రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు ఐదేళ్ల చొప్పున రెండు పర్యాయాలకు మించి అధికారంలో కొనసాగకూడదు. ఆధునిక యుగంలో చైనా స్వాభావిక సామ్యవాద వ్యవస్థ పరిరక్షణకే ఈ ప్రతిపాదన చేసినట్లు విదేశాంగ మంత్రి లూ కాంగ్ పేర్కొన్నారు.

చితాభస్మంతో హోలీ



మంగళవారం వారణాసిలోని ప్రఖ్యాతిగాంచిన మణికర్ణిక ఘాట్‌లో చితాభస్మంతో హోలీ జరుపుకుంటున్న శివభక్తులు

ప్రజాప్రతినిధులను ఏసీబీ పరిధిలోకి తీసుకురావాలి

హోంమంత్రి చినరాజప్ప



రాజమహేంద్రవరంలో అవినీతి నిరోధక శాఖ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న చినరాజప్ప

తాడితోట (రాజమహేంద్రవరం): అవినీతికి పాల్పడే ప్రజా ప్రతినిధులను కూడా ఏసీబీ పరిధిలోకి తీసుకురావాలని ఉప సీఎం, హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రూ.95 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అవినీతి నిరోధక శాఖ భవన సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో 50 ఆధునిక పోలీస్ స్టేషన్లు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 20 పూర్తి చేశామన్నారు. అవినీతి రహిత పాలన ప్రజలకు అందించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి ఏసీబీ కోర్టును రాజమహేంద్రవరంలో త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయాక రూ.1,679 కోట్లు లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ రాష్ట్రం పురోభివృద్ధిలో ముందుకు సాగుతోందన్నారు. ఎంపీ మాగంటి మురళీమోహన్ మాట్లాడుతూ అవినీతి నిరోధక శాఖ మరింత పటిష్టంగా పని చెయ్యాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ రాము సూర్యారావు, ఆదిరెడ్డి అప్పారావు, మాట్లాడారు.

నదులే మాయం చేసేలా ఉన్నారు

- ఇష్టారాజ్య ఇసుక తవ్వకాలపై హైకోర్టు ఆగ్రహం
- అక్రమ తవ్వకాలకు గోదావరి నదిని అడ్డాగా మార్చేశారని ఆందోళన
- ములకల లంక గ్రామంలో ఇసుక తవ్వకాలపై స్టే
- వంగలపూడి గ్రామంలో తవ్వకాలపై విచారణకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో ఇష్టారాజ్యంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇసుక తవ్వకాలు జరుగుతున్న తీరును చూస్తుంటే భవిష్యత్తులో నదులు లేకుండా చేసేలా ఉన్నారంటూ ఆందోళన వ్యక్తం చేసింది. ఉభయ రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోందంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. 'నదుల హద్దులు నిర్ణయించకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో ఇసుక అక్రమ తవ్వకాలకు అంతు లేకుండా పోతోంది. ఇసుక తవ్వకాలు ఇప్పుడు ఓ పెద్ద రాకెట్‌గా మారిపోయింది. గతంలో అక్రమ ఇసుక తవ్వకాలకు కృష్ణానదిని అడ్డాగా మార్చేస్తే, ఇప్పుడు ఆ జాబితాలో గోదావరి నదిని కూడా చేర్చారు. జీవితంలో అన్ని విషయాలను డబ్బుతో ముడిపెట్టడం సరికాదు' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం, ములకల లంక గ్రామ పరిధిలో గోదావరి ఒడ్డున పట్టా భూముల్లో కృష్ణారావు అనే వ్యక్తి జరుపుతున్న ఇసుక తవ్వకాలపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. రెండు వారాల పాటు ఈ ప్రాంతంలో ఎటువంటి ఇసుక తవ్వకాలు జరపవద్దని, ఆ మేర తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం నది పరిధిలోకి వస్తుందో, రాదో స్పష్టతనిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఇదే మండలం, వంగలపూడి గ్రామ పరిధిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై న్యాయాధికారితో విచారణ జరిపించి నివేదిక ఇవ్వాలని ఆ జిల్లా జడ్జిని ఆదేశించింది. ఇక్కడ భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరపకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మీలతో కూడిన ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ములకల లంక, వంగలపూడి గ్రామాల పరిధిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై వంగలపూడి గ్రామానికి చెందిన ఎం.వీర వెంకట శ్రీనివాస్ హైకోర్టులో వేర్వేరుగా రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై మంగళవారం ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది.


హైదరాబాద్ చేరిన హోదా యాత్ర



పంజగుట్ట: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ పశ్చిమగోదావరి జిల్లా వీరవసర మండలం మెట్టగూడికి చెందిన ఓ యువకుడు చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం హైదరాబాద్ చేరుకుంది. వెంకట్ ఈ నెల 14న తిరుపతి నుండి ఢిల్లీకి సైకిల్‌పై బయలుదేరాడు. ప్రత్యేక హోదా అనేది ఐదు అక్షరాల పదం కాదని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవమని అతని సైకిల్‌పై మూడువైపులా బోర్డులు అమర్చుకుని యాత్ర చేస్తున్నాడు. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వెంకట్ మాట్లాడుతూ ఈ యాత్ర 2,400 కిలోమీటర్ల మేర సాగుతుందని, మార్చి 15న ఢిల్లీకి చేరుకుటున్నట్లు తెలిపారు.

పిచ్చి పరాకాష్టకు..!

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బదులు ఆంధ్రజ్యోతి ప్రభుత్వం!
- దేవాదాయశాఖ ప్రభుత్వ ప్రకటనలో విడ్డూరం
- ముక్కున వేలేసుకుంటున్న జనం



ప్రకటనలో 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం' అని ఉండాల్సిన చోట 'ఆంధ్రజ్యోతి ప్రభుత్వం' అని ఉన్న దృశ్యం

కడప కల్చరల్: 'పిచ్చి కుదిరింది.. తలకు రోకలి చుట్టండి..' అనే సామెత ప్రభుత్వ పాలనకు అద్దం పడుతోంది. ప్రభుత్వం నుంచి వచ్చే సమాచారం ఓ తెలుగు పత్రిక వార్తా ఏజెన్సీకి అప్పగించిన విషయం తెలిసిందే. 'ఫలానా పత్రిక ఏజెన్సీ ద్వారా' అంటూ పత్రికలకు అందే సమాచారంలో తెలియజేస్తారు. అయితే ఆ పత్రికపై ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు ఇష్టం తారస్థాయికి పెరిగిందేమో.. ఏకంగా సర్కారు పేరే మార్చేశారు. మంగళవారం జిల్లా సమాచార శాఖ ద్వారా అందిన దేవదాయ శాఖకు చెందిన ప్రెస్‌నోట్‌లో 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం' అని ఉండాల్సిన చోట 'ఆంధ్రజ్యోతి ప్రభుత్వం' అని ఉండడం గమనార్హం. దీన్ని చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఆ పత్రికపై ప్రభుత్వానికి ప్రేమ ఉండొచ్చుగానీ పత్రిక పేరే ప్రభుత్వం పేరుగా ప్రకటనలో రావడం శోచనీయమంటున్నారు. దీనిపై జిల్లా సమాచార శాఖ ఏడీని అడిగితే ఆ ప్రకటన అమరావతి కార్యాలయం నుంచి వచ్చిందని, అందుకే తాము యథాతథంగా పత్రికలకు పంపామని చెప్పుకొచ్చారు.

ప్రజలు చూపిస్తున్న అభిమానమే వారి సంక్షేమం కోసం పని చేయడానికి ప్రేరణ కలిగిస్తోంది. చనిపోయిన తర్వాత కూడా వారి గుండెల్లో జీవించి ఉండాలన్న తపన నా చేత ముందడుగు వేయిస్తోంది. సమస్యలను పరిష్కరిస్తానని జనం పెట్టుకున్న నమ్మకం నా బాధ్యతను మరింత పెంచుతోంది. వారి నమ్మకాన్ని నిలబెట్టడానికి శక్తివంచన లేకుండా పని చేయాలనే సంకల్పం పాదయాత్రలో అలుపు తెలియకుండా చేస్తోంది. - ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



ప్రజలందరి కష్టాలను కళ్లారా చూస్తున్నా. ప్రజలు వచ్చి నాతోపాటు అడుగులో అడుగు వేస్తున్నారు. పాదయాత్రలో కష్టంగా ఏమీ అనిపించడం లేదు. నా కుటుంబానికి కూడా దూరం కాలేదు. నాన్నగారు ఇచ్చిన పెద్ద కుటుంబంతో కలిసి ముందుకు నడుస్తున్నా.

- ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



చిత్తూరు

శ్రీకాళహస్తిలో జరిగిన బహిరంగ సభలో అశేషజనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న వైఎస్.జగన్



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

గూడూరులో జరిగిన బహిరంగ సభలో అశేషజనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత



వైఎస్సార్

ఎర్రగుంట్లలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న జగన్



అనంతపురం

కదిరిలో జగన్ సభకు హాజరైన అశేష జనవాహిని

జనసంద్రంలో 100 రోజులు

- ప్రజాసంకల్ప పాదయాత్ర సాగిస్తున్న జగన్
- ప్రజల కష్టాలు వింటూ.. కన్నీరు తుడుస్తూ.. భరోసానిస్తూ..
- అడుగులు వేస్తున్న ప్రతిపక్షనేతకు అడుగడుగునా జన నీరాజనం..
- ఆప్యాయత పంచుతున్న పల్లెలు.. అక్క చెల్లెమ్మలు..
- దారులలో పూలు పరిచి స్వాగతిస్తున్న అభిమానులు
- ఆదరించి అక్కున చేర్చుకుంటున్న అవ్వాతాతలు
- రైతన్నలకు, నేతన్నలకు, నిరుద్యోగులకు కొండంత అండగా..
- కష్టాలు తీరుస్తానంటూ ఊరటనిస్తూ.. ముందుకు సాగుతున్న జగన్
- వేనవేల వినతిపత్రాలు.. వందలాది సభలు-సమావేశాలు

అది వజ్ర సంకల్పం.. వేల కిలోమీటర్లుకాలినడకన సాగాలన్న మహా సంకల్పం.. పేదల కష్టాలు తెలుసుకోవాలి. వాటికి కారణాలను అన్వేషించాలి. ఆ కష్టాలతో కుంగిపోతున్నవారి కన్నీళ్లు తుడవాలి. బతుకు మీద ఆశ కల్పించాలి. కష్టాలను తొలగించడానికి నేనున్నా అంటూ భరోసానివ్వాలి. ఇదీ ప్రతిపక్షనేత, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించిన ప్రజా సంకల్ప యాత్ర నేపథ్యం. పాదయాత్రకు విరామమన్నదేలేదు.. అకుంఠిత దీక్ష ముందు అన్ని అసౌకర్యాలూ దూదిపింజెల్లా ఎగిరిపోయాయి. లక్ష్యం దిశగా ఆ అడుగులు పడుతున్నాయి.. ఒక్క అడుగుతో మొదలైన ఆ పాదయాత్రకు వేల అడుగులు తోడయ్యాయి... ఎటు చూసినా జనమే జనం.. జనసంద్రం.. పార్టీలతో నిమిత్తం లేదు.. సంఘాలతో పనిలేదు...వేలాదిమంది స్వచ్ఛందంగా తరలివస్తున్నారు.. కష్టాలు చెప్పుకుంటున్నారు.. కన్నీటిపర్యంతమవుతున్నారు. వారి కన్నీరు తుడుస్తూ.. అండగా తానున్నానన్న భరోసా కల్పిస్తూ అకుంఠిత దీక్షతో జగన్ ముందుకు సాగుతున్నారు.

ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు జనం వెల్లువలా తరలివస్తున్నారు. గ్రామాలకు గ్రామాలు ఆయన వెంట కదులుతున్నాయి. పల్లె, పట్నం అనే తేడా లేకుండా జగన్ వెంట జన ప్రవాహం నడుస్తోంది. విపక్ష నేత కోసం తమ గ్రామాలను రంగవల్లులతో ముస్తాబు చేస్తున్నారు. భారీ ఎత్తున స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్ల వెంట బారులు దీరి గంటల తరబడి ఎదురుచూస్తున్నారు. జగన్‌ను చూసేందుకు, ఆయనతో కరచాలనం చేసేందుకు యువత ఉత్సాహంతో ఎదురు చూస్తోంది. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఆయన రాకకోసం జనం వేచిచూస్తున్నారు. హారతులు ఇచ్చి స్వాగతం పలికేందుకు మహిళలు పోటీపడుతున్నారు. వృద్ధులను, వికలాంగులను ఆయన పలకరించి, సమస్యలు తెలుసుకుంటున్నారు. జగన్‌ను చూసేందుకు, ఆయనకు సంఘీభావం తెలిపేందుకు జనం పోటీపడుతున్నారు. మేడలు, మిద్దెలు ఎక్కి చేతులు ఊపుతూ, కేరింతలు కొడుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, యువతీ యువకులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు అలా అందరూ తమ పనులను పక్కనబెట్టి జగన్‌కు సంఘీభావం తెలుపడానికి కదలివస్తున్నారు.

ఆత్మబంధువులా అందరి కన్నీరు తుడుస్తూ..

పాదయాత్రలో జగన్ వేలాది మంది రైతులను కలిశారు. దారిలో పొలాల్లోకి వెళ్లి రైతులను కలసి వారి కష్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాయలసీమలో శనగ రైతులు... పండ్లతోటల రైతన్నలు... చిత్తూరులో టమోటా రైతులు... నెల్లూరులో నిమ్మ రైతులు... ఇలా అన్ని ప్రాంతాల్లోనూ రైతులను కలుసుకున్నారు. వాళ్ళ దయనీయ స్థితిపై చలించిపోయారు. గిట్టుబాటు ధర లేక అలమటిస్తున్న రైతుల కష్టాన్ని అర్థం చేసుకున్నారు. అమరావతిలో ఆత్మహత్యలకు ప్రయత్నించిన కృష్ణా జిల్లా రైతన్నలను పాదయాత్ర నుంచే ఫోన్‌లో పరామర్శించారు. ధైర్యం చెప్పారు కడప జిల్లా జమ్మల మడుగు వై కోడూరు జంక్షన్ వద్ద అపరాల రైతుల కన్నీటి గాథను జగన్ ఓపికగా విన్నారు. సీపీఎస్ రద్దు కోసం ఆందోళన చేస్తున్న ఉద్యోగులు జగన్‌ను కలుసుకున్నారు. వారి డిమాండ్‌ను నెరవేరుస్తామని, వారికి అండగా ఉంటామని జగన్ భరోసా ఇచ్చారు. వేతనాలు అందని అంగన్‌వాడీలు చెప్పుకున్న కష్టాలను సొంత అన్నలా విని ఓదార్చారు. విద్యుత్, ఆర్టీసీ, పలు ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు పాదయాత్ర సాగే చోట్ల జగన్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని, ప్రైవేటు పరిశ్రమలలో 75 శాతం స్థానికులకే ఇచ్చేలా చట్టం తెస్తామని జగన్ ఇచ్చిన హామీలు నిరుద్యోగులకు ఊరటనిచ్చాయి. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోనూ జగన్ పర్యటించారు. ప్రతీ సమస్యను అడిగి తెలుసుకున్నారు. బెల్టు షాపుల కారణంగా చితికిపోతున్న కుటుంబాలు... పెన్షన్ అందక అగచాట్లు పడే పేదలు... ప్రభుత్వ మోసంతో నష్టపోయిన డ్వాక్రా మహిళలను జగన్ కలిశారు. వాళ్ల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.. పాదయాత్ర సందర్భంగా అడుగడుగునా ఆత్మీయ సమ్మేళనాలు జరుగుతున్నాయి. ప్రతీ జిల్లాలోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ సమాజాలతో జగన్ మమేకమయ్యారు. క్షేత్రస్థాయి ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రతీ కులంలోనూ పేదలను ఆదుకునే అనేక పథకాలను జగన్ ప్రకటించారు. ఈ సందర్భంగా వీలైనంత ఎక్కువమందితో ముఖాముఖి చర్చించారు. వారి కన్నీటి గాథలను విన్నారు. ఓదార్చేందుకు ప్రయత్నించారు.

పండుగలన్నీ ప్రజల్లోనే.

సంక్రాంతి సంబరాలు, క్రిస్‌మస్ వేడుకలు... రథసప్తమి, శివ రాత్రి... ఏ వేడుకైనా జగన్ జనం మధ్యే జరుపుకున్నారు. పాదయాత్ర సాగిన గ్రామాల్లోనే ప్రజలతో కలిసి వేడుకలు చేసుకున్నారు. చిత్తూరు జిల్లాలో పాదయాత్ర జరుగుతున్నప్పుడు సంక్రాంతి పండుగొచ్చింది. వారం రోజుల పాటు మహిళలు ఇళ్ళ ముందు ముగ్గులతో జగన్‌కు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. యాత్ర సాగిన ప్రతీ ఊరిలోనూ మహిళలు ప్రత్యేకంగా చేసిన పిండి వంటలను తమ అభిమాన నేతకు రుచి చూపించేందుకు పోటీ పడ్డారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పూర్ణ కుంభంతో జగన్‌ను స్వాగతించారు. ప్రజల మధ్యే జగన్ క్రిస్‌మస్ వేడుకలు జరుపుకున్నారు. రథ సప్తమి, శివ రాత్రి పర్వదినాల్లో భక్తులు అభిమానంతో జగన్ పేరుతో దేవాలయాల్లో పూజలు చేయించారు. కులమతాలకు అతీతంగా ప్రతీ ప్రార్థనా మందిరాన్ని జగన్ సందర్శించారు.



ప్రజాభిమానమే ఇంధనం

- ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- జనం గుండెల్లో జీవించి ఉండాలన్న తపన ముందడుగు వేయిస్తోంది
- నాన్నగారు ఇచ్చిన పెద్ద కుటుంబంతో కలిసి నడుస్తున్నా...
- పాదయాత్ర మహాయజ్ఞం.. చిన్నచిన్న ఇబ్బందులను పట్టించుకోకూడదు
- లెక్కలేనంత అభిమానం చూపిస్తున్న ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటా..

పాదయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

అక్షరాలా 99 రోజులు.. 1,340 కిలోమీటర్లకు పైగా అలుపెరుగని నడక. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి ప్రజాభిమానమే చోదకశక్తిగా పనిచేస్తోంది. జనం తన పట్ల చూపుతున్న ఆదరణే ఆయనలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ప్రజలు అనుభవిస్తున్న కష్టాల ముందు పాదయాత్రలో తన ఇబ్బందులు ఒక లెక్కే కాదని జగన్ అంటున్నారు. నిత్యం మితాహారం తీసుకుంటూ, ధ్యానం, యోగాసనాలతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రజాసంకల్ప యాత్రను 99 రోజులు దిగ్విజయంగా పూర్తిచేశారు. బుధవారంతో పాదయాత్ర 100 రోజుల మైలురాయిని అధిగమించనుంది. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ప్రకాశం జిల్లా పొదిలి నుంచి చీమకుర్తి వైపు కిక్కిరిసిన జనసందోహం మధ్య ప్రజాసంకల్ప యాత్ర కొనసాగిస్తూనే 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడారు. పాదయాత్ర నేపథ్యాన్ని.. ప్రజలతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆరు కోట్ల మంది ఆంధ్రుల అభిమానమే తనను ముందుకు నడిపిస్తోందని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. తమ కష్టాలు చెప్పుకోవడానికి ఎదురేగి వస్తున్న జనం మధ్యే పలు అంశాలపై స్పందించారు.

అది నిజంగా అదృష్టం

ప్రజలు చూపిస్తున్న అభిమానమే వారి సంక్షేమం కోసం పని చేయడానికి ప్రేరణ కలిగిస్తోందని జగన్ చెప్పారు. చనిపోయిన తర్వాత కూడా వారి గుండెల్లో జీవించి ఉండాలన్న తపన తనచేత ముందడుగు వేయిస్తోందన్నారు. సమస్యలను పరిష్కరిస్తానని జనం పెట్టుకున్న నమ్మకం తన బాధ్యతను మరింత పెంచుతోందని పేర్కొన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టడానికి శక్తివంచన లేకుండా పని చేయాలనే సంకల్పం పాదయాత్రలో అలుపు తెలియకుండా చేస్తోందని వివరించారు. దేవుడు ప్రజల ఆప్యాయత స్పష్టంగా కనిపించేలా చేయడం నిజంగా అదృష్టమన్నారు.

ఒక్కరైనా సంతోషంగా లేరు

''సంతోషంగా ఉన్న ముఖం నాకు పాదయాత్రలో ఒక్కటైనా కనిపించడం లేదు. రైతులు సంతోషంగా లేరు. పాలకులు రుణ మాఫీ హామీని అమలు చేయకపోవడంతో రైతన్నల బతుకులు అతలాకుతలం అయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం రాకముందు వరకు రైతులకు వడ్డీలేని రుణాలు దక్కేవి. చంద్రబాబు వచ్చిన తర్వాత రైతులకే కాదు.. డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు వడ్డీ సొమ్మును ప్రభుత్వం బ్యాంక్‌లకు కట్టడం మానేసింది. నిరుద్యోగులు ఉద్యోగాలు దొరక్క పొట్ట చేతపట్టుకొని ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నారు. రాష్ట్రంలో కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఉన్న ఉద్యోగాలే ఊడగొడుతున్న పరిస్థితిని చూస్తున్నాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు కాక, సొంతంగా ఫీజులు కట్టలేక విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని పాలకులు పూర్తిగా నిర్వీర్యం చేశారు. హైదరాబాద్‌కు వెళ్లి వైద్యం చేయించుకోవడానికి అవకాశం లేకుండా పరిమితులు విధించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు 8 నెలలుగా బిల్లులు చెల్లించకుండా వ్యవస్థను కుప్పకూల్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే జనం ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ప్రజలపై కక్ష గట్టినట్లుగా వ్యవహరిస్తోంది'' అని వైఎస్ జగన్ విమర్శించారు.

ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటా...

''ప్రజలందరి కష్టాలను కళ్లారా చూస్తున్నా. ప్రజలు వచ్చి నాతో పాటు అడుగులో అడుగు వేస్తున్నారు. పాదయాత్రలో కష్టంగా ఏమీ అనిపించడం లేదు. నా కుటుంబానికి కూడా దూరం కాలేదు. నాన్నగారు ఇచ్చిన పెద్ద కుటుంబంతో కలిసి ముందుకు నడుస్తున్నా. పాదయాత్ర ఒక యజ్ఞం. మహాయజ్ఞం. ఆ యజ్ఞానికి అంతరాయం కలగకుండా కదులుతున్నాం. కోర్టు నుంచి మినహాయింపు అడిగినా.. రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వారానికి ఒక రోజు విరామం ఇవ్వాల్సి వస్తోంది. అది కూడా ఎక్కడ ఆపామో అక్కడే తర్వాతి రోజు పాదయాత్ర మొదలు పెడుతున్నాం. యజ్ఞం జరుగుతున్నప్పుడు బరువు తగ్గడం లాంటి చిన్న విషయాలను పట్టించుకోకూడదు. నడుస్తున్నప్పుడు బరువు తగ్గడం మామూలే. ప్రజల బాగు కోసం నిలబడంలో వెనకడుగు ఉండదు. ప్రజల కోసం జీవితాన్ని అర్పిస్తున్నప్పుడు.. సహనం, ఓర్పు సహజంగానే వస్తాయి. ప్రజల ఆప్యాయతల ముందు నేను చూపించే ఓర్పు, సహనం చాలా చిన్న విషయాలు. లెక్కలేనంత అభిమానం చూపిస్తున్న జనానికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. అంతకంటే చెప్పగలిగేది ఏముంటుంది?'' అని జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.


మితాహారం.. చాలీచాలని నిద్ర

ప్రజాసంకల్ప యాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి మితాహారం తీసుకుంటున్నారు. సాధారణంగా ఉదయం అల్పాహారం తీసుకొనే అలవాటు ఆయనకు లేదు. పాదయాత్రలో ఉదయం టీ, ఒక గ్లాసు పండ్లరసం తీసుకుంటున్నారు. మధ్యాహ్నం కాసిన్ని పండ్ల ముక్కలు, మజ్జిగతోనే సరిపెట్టుకుంటున్నారు. రాత్రికి ఒకట్రెండు చిన్న పుల్కాలు, పప్పు, కూరగాయలతో చేసిన ఒకట్రెండు కూరలు ఆహారంగా తీసుకుంటున్నారు. మాంసాహారం ముట్టడం లేదు. పాదయాత్రలో జననేతకు నిద్ర కూడా తక్కువే. పాదయాత్ర జరుగుతున్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన టెంట్‌లో పడుకుంటున్నారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో నిద్రకు ఉపక్రమించే ఆయన.. వేకువజామున 4 గంటలకు కాస్త ముందుగా మేల్కొంటున్నారు. దాదాపు గంటన్నరపాటు ధ్యానం, యోగా చేస్తున్నారు. అనంతరం టీ తాగి పత్రికలు చదువుతున్నారు. స్నానాదికాలు ముగించుకున్న తర్వాత ముఖ్య నాయకులను కలుస్తున్నారు. టెంట్ నుంచి బయటకు వచ్చే సమయంలో ఆ రోజు పాదయాత్ర షెడ్యూల్ తెలుసుకుంటున్నారు. మధ్యాహ్నం భోజన విరామంలోనూ నేతలతో భేటీలు ఉంటాయి. మిగతా సమయం అంతా ప్రజల మధ్యే ఉంటున్నారు. కంటినిండా నిద్ర, పరిపడా విశ్రాంతి లేకపోయినా ఆయనలో ఆలసట ఏమాత్రం కనిపించడం లేదు.



కర్నూలు

పత్తికొండలో అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



ప్రజా సంకల్ప యాత్ర	99 రోజులు
యాత్ర పూర్తయిన జిల్లాలు	5 పూర్తయి, 6వ జిల్లాలో సాగుతోంది
రోజుకు సగటున పాల్గొంటున్న వారి సంఖ్య సుమారు	25,000 మంది
ఇప్పటి వరకు నడిచిన దూరం	1339 కి.మీ
యాత్ర పూర్తి చేసిన నియోజకవర్గాలు	43
నిర్వహించిన బహిరంగ సభలు	39
వివిధ వర్గాలతో ముఖాముఖి	203
వివిధ వర్గాలతో నిర్వహించిన సమావేశాలు	18
జెండా ఆవిష్కరణలు	190

ప్రకాశం జిల్లా కనిగిరి వద్ద పాదయాత్రలో కనుచూపు మేర జనం



ఆత్మీయ నేత అభయం

- అన్ని వర్గాల ప్రజలకు వైఎస్ జగన్ భరోసా
- రైతుకు పెట్టుబడుల కోసం ఏటా రూ.12,500
- ముందుగానే గిట్టుబాటు ధర ప్రకటన.. ఉచితంగా బోర్లు

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: వైఎస్సార్ సీపీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలపై వరాల జల్లు కురిపిస్తూ ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర ప్రజల కష్టాలు తెలుసుకుని.. వారికి భరోసా ఇచ్చేందుకు ఇడుపులపాయ నుంచి ప్రజా సంకల్ప యాత్రను ప్రారంభించిన వైఎస్ జగన్ చిత్తశుద్ధితో ఇస్తున్న హామీలు, ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలతో జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు. కష్టాల్లో ఉన్న తమను ఆదుకోడానికి వచ్చిన ఆపద్బాంధవుడిలా రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారు. ప్రజా సంకల్ప యాత్ర వంద రోజుల ప్రస్థానంలో ఆయన ఇచ్చిన హామీలన్నీ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు, యావత్ రాష్ట్ర ప్రజల అభ్యున్నతి, వికాసానికి తోడ్పడేవే. అందుకే జగన్ కొత్త పథకాన్ని ప్రకటించినపుడల్లా జనం జేజేలు పలుకుతున్నారు. కేరింతలు, హర్షధ్వానాలతో మద్దతు తెలుపుతున్నారు.

పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో కొన్ని..

- టీడీపీ పాలనలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన ఏపీఎస్ ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేస్తాం
- సీపీఎస్ విధానం రద్దు
- ఏటా క్రమం తప్పకుండా ఉద్యోగాల నోటిఫికేషన్లు
- కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తాం
- కొత్తగా స్థాపించే పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం.
- తొమ్మిది గంటల పాటు వ్యవసాయానికి పగటి పూటే ఉచితంగా విద్యుత్ సరఫరా
- రైతులకు ఉచితంగా బోర్ల పథకం..
- రైతు భరోసా పథకం కింద ఏటా రూ. 12,500
- పంటకు ముందుగానే గిట్టుబాటు ధర ప్రకటన.. రూ.3000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి
- సహకార రంగంలో మూత పడిన డెయిరీలను తెరిపిస్తాం. ఈ డెయిరీలకు పాలు పోసే రైతులకు ప్రతి లీటరుకు రూ.4 ప్రోత్సాహకం.
- ఎస్సీ, ఎస్టీ కాలనీలకు ఉచిత విద్యుత్
- మాలలు, మాదిగలకు చెరో కార్పొరేషన్
- ఆర్యవైశ్యులు, కమ్మ, రెడ్డి, రాజు కులాలు.. ఇంకా ఇతర కులాలకు కార్పొరేషన్ల ఏర్పాటు.
- ముస్లింలకు దుల్హన్ పథకం కింద ఇస్తున్న నగదు రూ.50,000 నుంచి రూ.1,00,000కు పెంపు.
- మసీదుల్లో పనిచేసే ఇమాం, మౌజన్‌లకు రూ.10 వేలు, రూ.5 వేలు వేతనం. అదే విధంగా ఆలయాలు, చర్చీల్లో..
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళల పింఛన్ అర్హత వయసును 45 ఏళ్లకు తగ్గింపు. సాధారణ పింఛన్ పొందేందుకు అర్హత వయసును 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గింపు. అవ్వాతాతలకు రూ.2000 పింఛన్
- ప్రతి గ్రామంలోనూ సచివాలయం ఏర్పాటు.. 72 గంటల్లో సమస్యల పరిష్కారం.
- ఆరోగ్యశ్రీ: వైద్యం ఖర్చులు రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ పరిధిలోకి. ఎక్కడైనా వైద్యం చేయించుకునే వెసులుబాటు. పేదలకు ఎంతటి ఆపరేషన్ అయినా ఉచితంగా చేయిస్తాం. వైద్యం చేయించుకున్నాక డాక్టర్ సలహా మేరకు విశ్రాంతి తీసుకునే సమయంలోనూ ఆర్థిక సాయం. కిడ్నీ, తలసీమియా బాధితులకు నెలకు రూ.10 వేల పింఛన్
- చిన్నపిల్లలను బడికి పంపినందుకు తల్లులకు ఏటా రూ.15,000
- పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఎంత ఖర్చయినా భరిస్తాం. హాస్టల్ ఖర్చులకోసం ఏటా రూ.20 వేలు.
- డ్వాక్రా అక్కచెల్లెమ్మల బాకీ సొమ్ము నాలుగు విడతల్లో వారి చేతికే..
- ప్రతి పేదవాడికీ ఇల్లు. అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్
- సాగునీటి ప్రాజెక్టులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి
- మూడు దశల్లో సంపూర్ణ మద్య నిషేధం అమలు



ఎందాకైనా మీ వెంటే..

ఇడుపులపాయ నుంచి జగన్‌తోపాటు పాదయాత్రలో నడుస్తున్న అభిమానులు



చెర్లోపల్లె వద్ద ఆకట్టుకుంటున్న వైఎస్ జగన్ భారీ కటౌట్



ప్రకాశం

కందుకూరులో జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం. సభలో ప్రసంగిస్తున్న జగన్

అన్నా.. ఆదుకోండి


- పాదయాత్రలో వైఎస్ జగన్‌కు వినతుల వెల్లువ
- ప్రజా సమస్యలపై ఫిర్యాదుల పరంపర
- అన్ని వర్గాల ఆవేదనను ఆలకిస్తున్న ప్రతిపక్ష నేత
- కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ యంత్రాంగం

ప్రజాసంకల్ప యాత్ర నుంచి 'సాక్షి' ప్రతినిధి: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగేళ్లవుతోంది. జనం సమస్యల వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. తమ కష్టాలను ఎవరికి చెప్పుకోవాలో, ఎవరు తీరుస్తారో తెలియక దిక్కులు చూస్తున్న ప్రజానీకానికి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశాదీపంగా కనిపిస్తున్నారు. మీకు నేనున్నానంటూ పాదయాత్రగా చేస్తూ నేరుగా జనం మధ్యకే వచ్చిన జగన్‌ను కలిసి తమ బాధలను ఏకరువు పెడుతున్నారు. పంటలకు గిట్టుబాటు ధరల కోసం రైతన్నలు.. పింఛన్ల కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు... తల దాచుకోవడానికి సొంత గూడు కోసం పేదలు.. కొలువుల కోసం నిరుద్యోగులు.. ఉద్యోగ భద్రత కోసం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది... ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు.. ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స కోసం రోగులు... ఇలా అన్ని వర్గాలవీ అవే ఎదురు చూపులు. చంద్రబాబు ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోదు, మీరు అధికారంలోకి వచ్చాకైనా మా సమస్యలను పరిష్కరించండయ్యా అంటూ ప్రతిపక్ష నేతను వేడుకుంటున్నారు. ప్రతి గ్రామంలోనూ సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. ఎవరిని కదిలించినా కన్నీళ్లే రాలుతున్నాయి.

ఫిర్యాదులు కోకొల్లలు: గతంలో వచ్చే పింఛన్లను టీడీపీ ప్రభుత్వం నిలిపివేసిందంటూ ప్రతి గ్రామంలోనూ వృద్ధులు, వితంతువులు జగన్‌ను ఫిర్యాదు చేశారు. 80 శాతం అంగవైకల్యం ఉన్నా పింఛను మంజూరు కావడం లేదని దివ్యాంగులు జగన్ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం కొత్తగా ఒక్క ఇల్లు కూడా కట్టించలేదని పేదలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ సరుకులు ఇవ్వడం ఆపేశారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో జన్మభూమి కమిటీ సభ్యుల ఆగడాలపైనా ఫిర్యాదులందాయి. గిట్టుబాటు ధర మాత్రం రావడం లేదని రైతులు పాదయాత్రలో జగన్‌కు వివరించారు. తాగునీటి ఇబ్బందులను జనం జగన్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రకాశం జిల్లా చినారికట్ల గ్రామంలో జగన్ మహిళలతో కలిసి ఖాళీ బిందెలు పట్టుకొని పాదయాత్రలోనే నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లాలో ప్రైవేట్ చక్కెర ఫ్యాక్టరీలకు ప్రయోజనం చేకూర్చేందుకు చంద్రబాబు సర్కార్ సహకార షుగర్ ఫ్యాక్టరీలను దివాలా తీయించిందని జిల్లా రైతులు జగన్‌కు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో మైనింగ్ కార్యకలాపాలు ఆగిపోయాని, వాటి అనుబంధ పరిశ్రమలపై ఆధారపడ్డ తాము ఉపాధి కోల్పోయామని కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. కాంట్రాక్టు ఉద్యోగులు సమాన పనికి సమాన వేతనం అందజేయాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలంటూ సీపీఎస్ ఉద్యోగులు వివిధ ప్రాంతాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఆరోగ్య సమస్యలపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి.

వినతులు, ఫిర్యాదుల కంప్యూటరీకరణ

పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డికి వివిధ వర్గాల ప్రజలు అందజేస్తున్న వినతులు, ఫిర్యాదులను పార్టీ ఎప్పటికప్పుడు కంప్యూటరీకరణ చేస్తోంది. రోజూ ఏ ఊరిలో ఏ వ్యక్తి ఏ సమస్యపై ఫిర్యాదు చేశారన్న వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న వినతులను ప్రభుత్వ యంత్రాంగానికి పంపేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. వినతులు అందిన వెంటనే కంప్యూటీకరణ పూర్తిచేసి, వాటిని అధికారులకు పంపడంతో పాటు అధికారుల నుంచి తిరిగి బాధితులకు సమాచారం తెలియజేసేలా ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పారు.



అక్కంపల్లి వద్ద జై జగన్ అంటూ నినదిస్తున్న అవ్వ



పులిగుంట వద్ద అవ్వను ఓదార్చుతున్న జననేత వైఎస్ జగన్ | కమ్మకండ్రిగలో వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో ఈల వేస్తున్న ఓ సోదరి | జగన్‌తో కలసి నడుస్తున్న అక్కచెల్లెమ్మలు | గండ్లపల్లె శివారులో వరి ధాన్యం తూర్పారబడుతున్న జగన్ | తూపల్లె సమీపంలో జగన్‌ను చూసేందుకు పరుగెత్తుకొస్తున్న జనం | నల్లసింగయ్యగారి పల్లెలో జగన్ కోసం పూలబాట పరచి ఎదురు చూస్తున్న అక్కచెల్లెళ్లు | అవ్వతో ఆప్యాయంగా.. | అనంతపురం జిల్లా కందుకూరులో దివ్యాంగురాలు సాలమ్మ సమస్యను ఓపికగా వింటున్న జగన్ | మూలకండ్రిగ వద్ద వైఎస్ జగన్‌తో కలిసి నడుస్తున్న గీత కార్మికుడు | తుర్కుగుడ్డవెన వద్ద చిన్నారిని ఆప్యాయంగా హత్తుకున్న జగన్ | చిత్తూరు జిల్లా కోబాక వద్ద జాలర్లతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుంటున్న ప్రతిపక్షనేత వైఎస్ జగన్



ప్రకాశం జిల్లా అగ్రహారం సమీపంలో అశేషజనవాహిని మధ్య కొనసాగుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పాదయాత్ర

కాటూరువారిపాలెం శివారులో జగన్‌తో కలిసి అడుగులేస్తున్న ముస్లిం మహిళలు



అడుగడుగునా వేదనలే..

- సర్కారు తీరుతో అన్నీ ఇక్కట్లే అని ప్రతిపక్ష నేత జగన్‌తో గోడు వెళ్లబోసుకున్న బాధితులు
- మనందరి ప్రభుత్వం రాగానే ఆదుకుంటామని జననేత హామీ



దివ్యాంగులకు ఆత్మీయ స్పర్శ..

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రతినిధి: నాలుగేళ్లుగా ఈ ప్రభుత్వంలో తాము తీవ్ర కష్టాలు అనుభవిస్తున్నామని వివిధ వర్గాల ప్రజలు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌తో మొరపెట్టుకున్నారు. తమ కష్టాలు చూసీ కూడా పాలకులు ఆదుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం 99వ రోజు ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలో జగన్ పాదయాత్ర కొనసాగింది. ఫిరదౌసీ నగర్ సమీపంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దివ్యాంగులు జగన్‌ను కలిశారు. షేక్ మీరాబీ అనే మహిళకు ఖాసీంపీరా, బాజీ అనే ఇద్దరు కుమారులు, మస్తాన్‌బీ అనే కుమార్తె ఉంది. ముగ్గురూ పుట్టుకతో దివ్యాంగులు. వీరిని పోషించడం సాధ్యం కాదని మీరాబీని భర్త వదిలేసి వెళ్లిపోగా, ఆమె కూలి చేస్తూ పిల్లలను పోషిస్తోంది. వీరికి ఫించన్ కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా లంచం ఇస్తేనే పింఛన్లు వచ్చేలా చేస్తామని జన్మభూమి కమిటీ సభ్యులు తేల్చి చెప్పారు. ఈ అన్యాయాన్ని ఆమె జగన్‌కు వివరించి వాపోయింది. 'ప్రస్తుత పాలకులకు మానవత్వం లేదనడానికి ఇంతకన్నా నిదర్శనం లేదు. విధి వక్రీకరించి ఈ కుటుంబంలోని ముగ్గురు దివ్యాంగులైతే వారిని ఆదుకోవాలన్న కనీస విజ్ఞత, విచక్షణ ప్రస్తుత పాలకులకు కొరవడటం దౌర్భాగ్యం. ప్రజా సంక్షేమమే మా మతం, పేదలను ఆదుకోవడమే మా అభిమతం అని చెప్పుకునే పాలకులు సిగ్గుతో తలదించుకోవాలి' అని వైఎస్ జగన్ అన్నారు.

తమను ఆదుకోవడం లేదని రైతుల ఆవేదన

ఈ ప్రభుత్వం తమ గురించి ఇసుమంత కూడా పట్టించుకోవడం లేదని అన్నదాతలు జగన్‌తో వాపోయారు. మిర్చి పంట కళ్ల ముందే ఎండిపోతోందని ఒక రైతు జగన్‌కు చూపించారు. అనంతరం ఉప్పలపాడులో జగన్ వైఎస్ఆర్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. తమకు నెలకు రూ 500 జీతం ఇస్తున్నారని, ఇంతకంటే అన్యాయం మరొకటి లేదని ఆశా వర్కర్లు జగన్ ఎదుట వాపోయారు. తమకు జీతాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మనందరి ప్రభుత్వం రాగానే తప్పకుండా జీతాలు పెంచుతామని వారికి జగన్ హామీ ఇచ్చారు. సర్వశిక్ష అభియాన్‌లో పని చేస్తున్న 5 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వారి ప్రతినిధులు జగన్‌కు వినతిపత్రం ఇచ్చారు. తమకు పీఎఫ్, ఈఎస్ఐ కూడా లేదని చెప్పారు. పలువురు కిడ్నీ రోగులు జగన్‌ను కలిశారు. తమకు పూర్తి స్థాయిలో ఉచిత వైద్యం చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మనందరి ప్రభుత్వం రాగానే నవరత్నాలతో అందరినీ ఆదుకుంటామని జగన్ ధైర్యం చెప్పారు.


ఆస్ట్రేలియాలో 'వంద'నం



సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర 100 రోజుల మైలురాయిని అధిగమిస్తున్న సందర్భంగా ఆస్ట్రేలియాలోని ప్రవాస భారతీయులు సంఘీభావ యాత్ర నిర్వహించారు. చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి, మలికిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో బొడికె ప్రతాప్, యర్రగుంట్ల భాస్కర్‌రెడ్డి, ముమ్మిడిగారి ప్రతాప్, కొచ్చర్లకోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, సామాన్యులను ఇబ్బందల పాల్జేస్తున్న టీడీపీ ప్రభుత్వంపై పోరాటం చేస్తున్న జగన్‌కు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని వారు ప్రకటించారు.



ప్రత్యేక హోదా ప్లకార్డు పట్టుకొని నడుస్తున్న వైఎస్ జగన్



99వ రోజు

27-02-2018, మంగళవారం

ఉప్పలపాడు, ప్రకాశం జిల్లా

ప్రజా సంకల్పం పాదయాత్ర డైరీ

కొత్త పరిశ్రమలంటూ మభ్యపెట్టడం భావ్యమేనా?

ఈ ప్రాంతం మొత్తం మంచినీటికి కటకటే. గ్రామగ్రామానా ఖాళీ బిందెలతో ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి. కాటూరువారిపాలెంలో కలిసిన అక్కచెల్లెమ్మలు 'అన్నా.. బిందెడు నీళ్ల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సిన పరిస్థితులొచ్చాయి. వాడుకోడానికి నీళ్లమాట దేవుడెరుగు.. కనీసం తాగే నీళ్లు కూడా లేవు. వారానికి ఒక్క ట్యాంకరే వస్తోంది. నీళ్ల కోసం ఎన్ని ఆందోళనలు చేసినా పెడచెవిన పెడుతున్నారు. వెయ్యి అడుగుల బోరు వేసినా నీళ్లు పడటం లేదు. ఒక వేళ పడినా.. అది ఫ్లోరైడ్ గరళమే. మేమేమీ పెద్ద కోరికలు కోరడం లేదు.. కనీసం మంచినీళ్లు ఇప్పించాలంటున్నాం. తాగునీటి కోసం పెద్దలు పనులకు పోకుండా, పిల్లలు స్కూళ్లు ఎగ్గొట్టి ట్యాంకర్ల వెనుక పరుగులు పెడుతున్నాం..' అంటూ తమ కష్టాల్ని చెప్పుకొచ్చారు. ఫిబ్రవరిలోనే ఇలా ఉంటే.. ఇక ఏప్రిల్, మే నెలల్లో వారి పరిస్థితి ఇంకెంత కనాకష్టంగా ఉంటుందో! నాన్నగారి కల సాకారమై, వెలిగొండ ప్రాజెక్టు పూర్తయి ఉంటే.. వీరికి ఈ ఇబ్బందులుండేవి కావు కదా.. అనిపించింది. ఆ ప్రాజెక్టు మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఈ ప్రభుత్వ వైఖరితో వారి ఆశలు ఎండమావులవుతున్నాయి. దాదాపు 15 లక్షల మందికి పైగా ప్రజల తాగునీటి కష్టాలు తీర్చే ఈ ప్రాజెక్టుకు సంబంధించి మిగిలిన అరకొర పనులు కూడా పూర్తిచేయకపోవడం క్షమించరాని నేరమే.. ఇది కచ్చితంగా నేరపూరిత నిర్లక్ష్యమే.

ఫిరదౌసినగర్‌లో కలిసిన షేక్ మీరాబీ కష్టం వింటే.. పగవారికి కూడా ఇలాంటివి రాకూడదనిపించింది. ఆమెకు ఎదిగొచ్చిన ముగ్గురు పిల్లలున్నారు.. ఇద్దరబ్బాయిలు, ఒకమ్మాయి. ఆ ముగ్గురికీ రెండు కాళ్లూ పనిచేయని అవిటితనం. పుట్టుకతోనే అవిటివారైన వీరిని నేనెక్కడ సాకి సంతరించేదని ఆమె భర్త వదిలేసి పోయాడట. వార్ధక్యంలో అండగా ఉండాల్సిన పిల్లలు మంచానికే పరిమితమయ్యారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదు. కూలి చేసుకుంటూ అవిటి బిడ్డల్ని సాకాల్సిన దుస్థితి. చిన్నపాటి గుడిసెలోనే జీవితం. ఏ సంక్షేమ పథకమూ అందని దురదృష్టం. 90 శాతం వైకల్యం ఉన్నా ఏ బిడ్డకూ పింఛన్‌రాని దయనీయ స్థితి. 'పింఛన్ కావాలంటే లంచం ఇవ్వాలంటున్నారు సార్.. ఈ జన్మభూమి కమిటీల వారు. నేనెక్కడి నుంచి తెచ్చేది?' అంటూ కంటతడి పెట్టిన ఆ అక్కను చూసి మనసు కలత చెందింది. ఇటువంటి వారికి కూడా సాయం చేయని ఈ ప్రభుత్వం ఉండీ ప్రయోజనమేమి?

తలమళ్ల దాటాక.. గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానులు కలిశారు. 'సార్.. మీ నాన్నగారి హయాం మాకు స్వర్ణయుగం. ఈ ప్రభుత్వం వచ్చాక రైతుల్లానే మేము కూడా ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితులొచ్చాయి. మాలాంటి చిన్నతరహా పరిశ్రమలకు ఎలాంటి ప్రోత్సాహకాలూ ఇవ్వడంలేదు సరికదా.. కరెంటు చార్జీలు రెట్టింపయ్యాయి. సబ్సిడీలు ఎత్తేశారు. జీవో నం.37 పేరుతో ఇష్టారాజ్యంగా పెనాల్టీలు వేస్తున్నారు. రాయల్టీలు తడిసిమోపెడవుతున్నాయి. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టు.. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ పేరిట మరింత భారం మోపారు. మా మనుగడే ప్రశ్నార్థకమవుతోంది' అంటూ సమస్యలు చెప్పుకున్నారు. రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు, వేల పరిశ్రమలు, లక్షలాది ఉద్యోగాలంటూ.. అభూత కల్పనలతో అరచేతిలో స్వర్గం చూపిస్తున్న ముఖ్యమంత్రిగారికి.. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఈ చిన్న తరహా పరిశ్రమలు కనిపించడంలేదేమో! ఉన్న చిన్నపాటి పరిశ్రమలే మీ దెబ్బకు మూతపడుతుంటే.. కొత్త పరిశ్రమలంటూ మభ్యపెట్టడం భావ్యమేనా?

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. ప్రకాశం జిల్లాలో చాలా గ్రామాల్లో గుక్కెడు మంచినీళ్ల కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఫ్లోరైడ్ దెబ్బకు వేలాది జీవితాలు నాశనమవుతున్నాయి. దీనికి పరిష్కారమార్గమైన వెలిగొండ ప్రాజెక్టులాంటి మహత్తర పథకం కళ్లెదుటే కనిపిస్తున్నా.. మిగిలిన కొద్దిపాటి పనులు కూడా పూర్తిచేయకపోవడంలో మీ ఆంతర్యమేంటి? ప్రజల కనీస అవసరాల పట్ల, ప్రజారోగ్యం పట్ల మీకున్న శ్రద్ధ ఇదేనా? 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం అంటూ గొప్పలుపోతున్నారు.. ఇదేనా ఆ అనుభవం నేర్పిన విజ్ఞత?

వైఎస్. జగన్.

ప్రజాసంకల్ప యాత్ర 99వ రోజు	99వ రోజు		నేటి పాదయాత్ర షెడ్యూల్
ఇప్పటి వరకు నడిచిన దూరం 1,340 కి.మీ	నడిచిన దూరం 16.2 కి.మీ	ప్రారంభం: ఉదయం 8 గంటలకు కాటూరివారిపాలెం ముగింపు: సా. 5.45 గంటలకు ఉప్పలపాడు ముఖ్యాంశాలు: ● కాటూరివారిపాలెం, అన్నారం క్రాస్, తలమళ్ల, ఫిరదౌసినగర్, గోగినేనిపాలెం, ఉప్పలపాడులో జనంతో మమేకం ● అగ్రహారంలో పార్టీ జెండా ఆవిష్కరణ	ప్రారంభం: ఉ. 8 గంటలకు, ఉప్పలపాడు ముఖ్యాంశాలు: ఉప్పలపాడు, వెల్లూర్ క్రాస్, మర్రిచెట్లపాలెం, బూదవాడలో జనంతో మమేకం ● రామతీర్థంలో పార్టీ జెండా ఆవిష్కరణ ● చీమకుర్తిలో బహిరంగ సభ, 100వ రోజు పైలాన్, వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ

చిన్న పిల్లను... నా పెళ్లి ఆపండి ప్లీజ్..

100కు ఫోన్ చేసి పోలీసుల రక్షణ కోరిన బాలిక

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): 'సార్.. నేను ఇంటర్మీడియట్ చదువుతున్నాను.. నాకు ఇష్టం లేకుండా మా ఇంట్లో పెద్దవాళ్లు పెళ్లి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నన్ను కాపాడండి' అంటూ ఓ బాలిక 100కు ఫోన్ చేసి పోలీసుల రక్షణ కోరిన ఘటన మంగళవారం విజయవాడలో చోటుచేసుకుంది. వాంబేకాలనీకి చెందిన బాలిక సత్యనారాయణపురంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుంది. అకస్మాత్తుగా ఇంట్లోవారు పెళ్లి చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి పసుపు కుంకుమల కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ఆ బాలిక ఈ తంతు గురించి 100కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో రంగంలోకి దిగిన నున్న రూరల్ పోలీసులు మహిళా మిత్ర సభ్యుల సహాయంతో ఆ కార్యక్రమాన్ని నిలిపివేసి తల్లిదండ్రులు, బాలికను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కూతురును చక్కగా చదివిస్తామని తల్లిదండ్రులు హామీ ఇవ్వడంతో బాలికను తిరిగి తల్లిదండ్రులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- హాజరుకానున్న 10.26 లక్షల మంది విద్యార్థులు
- 1,423 కేంద్రాల్లో మార్చి 19 వరకు..
- కాపీచేస్తూ పట్టుబడితే నాలుగేళ్లపాటు డిబార్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం (నేడు) నుంచి ప్రారంభం కానున్నాయి. మొత్తం 1,423 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షలకు 10,26,891 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీటిలో 48 కాలేజీల్లో సెల్ఫ్ సెంటర్లను ఏర్పాటుచేశారు. మార్చి 19 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ప్రశ్న పత్రాల సెట్‌ను బుధవారం ఉదయం మంత్రి గంటా శ్రీనివాసరావు విడుదల చేస్తారని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి బి.ఉదయలక్ష్మి చెప్పారు. 28న ఫస్టియర్, 29న సెకండియర్ పరీక్షలు ప్రారంభమవుతాయి. ఫస్టియర్‌కు 5,09,898 మంది, సెకండియర్‌కు 5,16,993 మంది హాజరవుతారు. వీరిలో వొకేషనల్ విద్యార్థులు 63,419 మంది ఉన్నారు. కాగా, అధికారులు సమస్యాత్మక, సున్నితమైన కేంద్రాలను గుర్తించి ఆయాచోట్ల అదనపు భద్రతా చర్యలు చేపట్టడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉ.9 గంటల నుంచి మ.12 గంటల వరకు జరుగుతాయి. పరీక్షల్లో కాపీ చేస్తూ పట్టుబడితే నాలుగేళ్ల వరకు అనుమతించకుండా డిబార్ చేసేలా కొత్త నిబంధన పెట్టారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలను సులువుగా గుర్తించేందుకు 'ఐపీఈ సెంటర్ లొకేటర్' అనే ప్రత్యేక యాప్‌ను కూడా బోర్డు రూపొందించింది. హాల్‌టికెట్ నెంబర్ నమోదుచేస్తే సెంటర్ రూట్‌మ్యాప్ చూపిస్తుంది. ఇదిలాఉంటే.. ఈ ఏడాది నుంచి ర్యాంకుల స్థానంలో గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్న సంగతి తెలిసిందే.

సందేహాలుంటే సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు: పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే 0866–2974130, ఫ్యాక్స్ నెంబర్ 0866–2970056, టోల్ ఫ్రీ నెంబర్ 18002749868కు తెలియజేయాలని కార్యదర్శి పేర్కొన్నారు.

ఆందోళన బాటలో హైకోర్టు న్యాయవాదులు

1, 2 తేదీల్లో విధుల బహిష్కరణ..

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టులో న్యాయమూర్తుల ఖాళీల భర్తీలో జరుగుతున్న జాప్యంపై ఆందోళన బాట పట్టాలని హైకోర్టు న్యాయవాదులు నిర్ణయించారు. హైకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి తక్షణమే చర్యలు తీసుకోవాలని, హైకోర్టుకు పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిని నియమించాలని, హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాన్న డిమాండ్లతో మార్చి 1, 2 తేదీల్లో హైకోర్టు విధులను బహిష్కరించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఉమ్మడి హైకోర్టు న్యాయవాద సంఘాలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. అందరు న్యాయవాదుల అభిప్రాయ సేకరణ తర్వాత ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ఇరు సంఘాల అధ్యక్షులు జె.కనకయ్య, సీహెచ్ ధనంజయ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇద్దరు అధ్యక్షుల నేతత్వంలో మంగళవారం హైకోర్టులో ఇరు సంఘాల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో 5 తీర్మానాలు చేశారు. హైకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి కేంద్రం, సుప్రీంకోర్టు తగిన చర్యలు తీసుకోవాలని, హైకోర్టు పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తి నియామకానికి కేంద్రం, సుప్రీం కోర్టు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీడీపీ దళిత మహిళా నేతపై దాడి

- నియోజకవర్గ ఇన్‌చార్జి ఎదుటే తీవ్ర అవమానం
- కన్నీళ్ల పర్యంతం అయిన బాధితురాలు
- ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు
- దళితతేజం– తెలుగుదేశం కార్యక్రమం బహిష్కరణ





పోలవరపు హరిబాబుపై దళిత సంఘాల నాయకులతో కలిసి ఫిర్యాదు చేస్తున్న వనరాణి. (ఇన్‌సెట్‌లో) మీడియా ముందు విలపిస్తున్న వనరాణి

మంగళగిరిరూరల్: తెలుగుదేశం పార్టీ సమావేశంలో ఆ పార్టీకి చెందిన దళిత మహిళా నాయకురాలికి అవమానం జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి ఎదుటే ఆ పార్టీ నాయకులు కొందరు ఆమెను కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు సదరు టీడీపీ నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దర్శి వనరాణి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ అధినేత రాజకీయ ప్రస్థానం 40 ఏళ్లు అయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి ఇంటి వద్ద ఆయనతో పాటు పార్టీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ మహిళా విభాగం జిల్లా కార్యవర్గ సభ్యురాలు దర్శి వనరాణి సమస్యలను వివరిస్తుంటే ''ఇది చౌదర్ల పార్టీ నువ్వు మాట్లాడడానికి వీల్లేదు.. కూర్చో'' అంటూ పార్టీ నేత పోలవరపు హరిబాబు అడ్డుకున్నాడు. ''పదవులు ఇస్తే మీ స్వార్థానికి ఉపయోగించుకుంటున్నారు. మీకు పదవులు ఇచ్చినందుకు మా కాళ్లు కడిగి నెత్తిన నీళ్లు పోసుకోవాలి. కులం తక్కువవాళ్లను పక్కన పెట్టాలి.'' అంటూ విద్వేషంగా మాట్లాడాడు. దీంతో ఆమె చిన్నబుచ్చుకుని బయటకు వస్తుంటే కులం పేరుతో మరోసారి దూషించి దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆమె భోరుమని విలపించింది. టీడీపీలో మొదటి నుంచి పనిచేస్తున్న తమలాంటి వారిని కుల అహంకారంతో అందరి సమక్షంలోనే హరిబాబు దూషించి, దాడికి పాల్పడినా ఎవరూ మాట్లాడలేదని వాపోయారు. పైగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి తన వాహనంలో హరిబాబును తీసుకుని వెళ్లిపోయారన్నారు. తనను అవమానపరిచిన హరిబాబుని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి దళితుల గౌరవాన్ని కాపాడాలని ఆమె విలేకరుల సమావేశంలో కోరారు. అనంతరం ఈ సంఘటనపై మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో దళిత సంఘాల నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పోలవరపు హరిబాబుపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

దళితతేజం కార్యక్రమాన్ని బహిష్కరిస్తూ తీర్మానం

టీడీపీ అధిష్టానం ఆదేశాల ప్రకారం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న దళితతేజం కార్యక్రమాన్ని బహిష్కరిస్తూ టీడీపీ దళితనేతలు ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళగిరిలో నియోజకవర్గ దళిత నేతల అత్యవసర సమావేశం మంగళవారం నిర్వహించారు. దర్శి వనరాణి పట్ల హరిబాబు దాడిచేసి, కులంపేరుతో అసభ్యంగా మాట్లాడాడని, అతనిపై చర్యలు తీసుకునేవరకు దళితతేజం–తెలుగుదేశం కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నామన్నారు. సమావేశంలో దళిత నాయకులు జ్యోతిబసు, వెలగపాటి విలియం, మరియదాసు, కుక్కమళ్ళ సాంబశివరావు, కొమ్మూ లవకుమార్, కంచర్ల ప్రకాశరావు, రావూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'దివ్యాంగుల సంక్షేమం' దారుణం

- కేంద్రం నిధులిచ్చినా రాష్ట్రం తనవాటా విడుదల చేయలేదు
- దివ్యాంగుల సంక్షేమశాఖకు పూర్తిస్థాయి అధికారే లేరు
- జాతీయ దివ్యాంగుల కమిషన్ చీఫ్ కమిషనర్ ఆవేదన



సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమ పథకాల అమలు దారుణంగా ఉంది. ఈ శాఖను పర్యవేక్షించేందుకు కనీసం పూర్తిస్థాయి అధికారిని కూడా నియమించలేదు. సిబ్బంది కూడా అరకొరగానే ఉన్నారు. దివ్యాంగుల సంక్షేమశాఖకు సొంత వాహనం కూడాలేదు. పథకాల అమలు పర్యవేక్షించేందుకు జాతీయ స్థాయి అధికారులు వస్తే ఉన్నత స్థాయి అధికారులెవరూ రాలేదు. చిన్నపిల్లల్లో వినికిడి సమస్య పరిష్కారానికి కేంద్రం కాక్లియా అమరిక పథకాన్ని ప్రవేశపెడితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కనీసం దీనిపై స్పందించడంలేదు' అంటూ సాక్షాత్తూ జాతీయ దివ్యాంగుల కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ కమలేష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల పథకాల అమలు తీరును పర్యవేక్షించేందుకు ఇక్కడికి వచ్చిన ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలకు రూ.6 కోట్లు మంజూరు చేస్తే, రాష్ట్రం తన వాటా నిధులు విడుదల చేయలేదన్నారు. ఇతర రాష్ట్రాలు ఈ విషయంలో ముందున్నాయని చెప్పారు. వికలాంగులకు ప్రత్యేక గుర్తింపు కార్డు (యుడిఐడి) పథకాన్ని కేంద్రం ప్రవేశపెడితే రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు కోఆర్డినేటర్‌ని నియమించలేదన్నారు. దివ్యాంగుల సంక్షేమశాఖకు ఇంతవరకు పూర్తిస్థాయి అధికారినే నియమించలేదని వాపోయారు. పథకాల అమలును సమీక్షించేందుకు జాతీయ స్థాయి అధికారులు వస్తే ఇక్కడ సెక్షన్ ఆఫీసర్లు, యూడీసీ స్థాయి అధికారులు హాజరయ్యారన్నారు. చిన్నపిల్లల్లో వినికిడి సమస్య పరిష్కారానికి కాక్లియా అమరిక పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందని, ఒక్కో కాక్లియా అమరికకు రూ. 6 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. అనేక రాష్ట్రాల్లో ఈ పథకం అమలవుతుండగా ఆంధ్రప్రదేశ్ దీనిపై ఆసక్తి చూపడంలేదన్నారు. దివ్యాంగులకు సంక్షేమ పథకాలు అమలుచేయడంలో తమిళనాడు మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 8,80,800 మందికి సహాయం, వివిధ ఉపకరణాలు పంపిణీ చేయడం కోసం కేంద్రం రూ.550 కోట్లు ఖర్చు చేసి 5500 క్యాంపులు నిర్వహించినట్లు వివరించారు. ఈ సమావేశంలో జాతీయ డిప్యూటీ చీఫ్ కమిషనర్ రాకేష్ కుమార్ రావు, దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్ కెఆర్ బీహెచ్‌ఎన్ చక్రవర్తి, డిప్యూటీ డైరెక్టర్ ఎంఎ కుమార్ రాజా పాల్గొన్నారు.

ప్రభుత్వం కళ్లుమూసుకుని వ్యవహరిస్తోంది

- బీఈడీ, డీఈడీ కాలేజీలకు అనుమతులపై హైకోర్టు ఆక్షేపణ
- ప్రభుత్వం అండతో ఆ కాలేజీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు బీఈడీ, డీఈడీ కాలేజీల అనుమతుల విషయంలో ప్రభుత్వం కళ్లు మూసుకుని వ్యవహరిస్తోందని హైకోర్టు ఆక్షేపించింది. ఇలాంటి కాలేజీల విషయంలో ప్రభుత్వం ఎంతో కరుణ చూపుతోందని, అందుకే ఆ కాలేజీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని వ్యాఖ్యానించింది. దీనివల్ల అంతిమంగా నష్టపోతున్నది అక్కడ చదువుతున్న విద్యార్థులే అన్నది గుర్తించాలంది. 'కనీస ప్రమాణాలు పాటించని ఇలాంటి కాలేజీల్లో చదివిన వారు రేపు ఉపాధ్యాయులైతే సమాజానికి నష్టం. విద్యా సంస్థల ఏర్పాటే ఇప్పుడు డబ్బు సంపాదనకు దగ్గర దారిగా మారింది' అని ఘాటుగా వ్యాఖ్యానించింది. ప్రకాశం, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని బీఈడీ కాలేజీలైన వివేకానంద కాలేజీ, అలీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, నవ చైతన్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఆజాద్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌తో పాటు ఇవే జిల్లాల్లోని ఎస్ఆర్, జీఎస్ఆర్, సలామ్ అమరావతి, ఎస్ఆర్‌డీ, షారోన్, మహాత్మాగాంధీ డీఈడీ కాలేజీల్లో చదివి ఇటీవల వార్షిక పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాలను వెల్లడించవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి కొంగర విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ప్రకాశం, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పలు బీఈడీ, డీఈడీ కాలేజీల యాజమాన్యాలు తమ కాలేజీల్లో చేరని విద్యార్థులను కూడా చేరినట్లు చూపడంతో పాటు, చేరని విద్యార్థుల జాబితాకు ఆమోదముద్ర వేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయంటూ ప్రకాశం జిల్లాకు చెందిన నవలూరి మాధవరావు హైకోర్టులో రెండు పిల్‌లు దాఖలు చేశారు. వీటిని ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది.

మోసం చేస్తున్నా పట్టించుకోని అధికారులు

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ ఈ మూడు జిల్లాల్లో ఒకే వ్యక్తి దాదాపు 21 బీఈడీ, డీఈడీ కాలేజీలను నిర్వహిస్తున్నారని వివరించారు. అంతేగాక ఒకే భవనంలో కనీస ప్రమాణాలు లేకుండానే నాలుగైదు కాలేజీలు నిర్వహిస్తున్నారని, అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రకాశం, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఎస్ఆర్, జీఎస్ఆర్, సలామ్ అమరావతి, ఎస్ఆర్‌డీ, షారోన్, మహాత్మాగాంధీ డీఈడీ కాలేజీల్లో వాస్తవంగా 163 మంది విద్యార్థులు మాత్రమే చేరారని, అయితే 1,000 మంది చేరినట్లు తప్పుడు జాబితాను తయారు చేశారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం తీవ్ర విస్మయం వ్యక్తం చేసింది. అసలు రాష్ట్రంలో ఏం జరుగుతోందని ప్రశ్నించింది. అనుమతులు, ప్రవేశాల విషయంలో అధికారులు కళ్లుమూసుకుని ఉన్నారని, ఇదే సమయంలో ఆ కాలేజీలపై ఎక్కడ లేని కరుణ చూపిస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. శక్తివంతమైన లాబీయింగ్ ద్వారానే ఇలా చేయగలుతున్నారని వ్యాఖ్యానించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తానని కాలేజీల తరఫు న్యాయవాది ఎస్.రవి పేర్కొనగా అంగీకరించిన ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

ఆన్‌లైన్‌లో డిగ్రీ అడ్మిషన్లు

కళాశాలల అనుమతులకూ అదే విధానం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని డిగ్రీ కోర్సుల ప్రవేశాలను ఆన్‌లైన్లో నిర్వహించేందుకు ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానుంది. దీంతో పాటు కాలేజీలకు గుర్తింపు కూడా ఆన్‌లైన్లోనే మంజూరయ్యేలా ప్రణాళిక రూపొందిస్తోంది. అడ్మిషన్లలో పాదర్శకత లేకపోవడం వల్ల డిగ్రీ కోర్సుల్లో ఎన్నిరకాల మార్పులు చేస్తున్నా ప్రమాణాలు పెరగడంలేదని ఉన్నత విద్యామండలి చేపట్టిన పలు అధ్యయనాల్లో తేలడంతో ఆన్‌లైన్ విధానం వైపు అడుగులేస్తున్నారు. పలు కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులు లేకున్నా ప్రవేశాలు జరిగినట్లు చూపిస్తున్నాయి. అలాగే, నిబంధనల మేరకు సదుపాయాలు కల్పించకుండానే ఉన్నట్లు చూపించి ఏటా అఫ్లియేషన్ పొందుతున్నాయి. వీటి పరిశీలనకు ప్రభుత్వం వద్ద యంత్రాంగం లేకపోవడంతో ఏటా అదే తంతు కొనసాగుతోంది. ఇప్పుడు ఆన్‌లైన్ విధానం ద్వారా వీటికి అడ్డుకట్ట పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

వర్సిటీ కోర్సులకూ ఒకే ప్రవేశపరీక్ష: యూనివర్సిటీల్లోని కోర్సులకూ ఒకే ప్రవేశపరీక్ష నిర్వహించేలా ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది. ఇంతకు ముందు అన్ని వర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసి అన్నిటికీ ఒకే ప్రవేశపరీక్ష పెట్టనున్నారు. మరోవైపు.. పీజీ కోర్సులకూ ఇదే విధానంలో జరపాలని భావించినప్పటికీ అడ్మిషన్లు ఆలస్యమమయ్యే అవకాశమున్నందున వచ్చే విద్యా సంవత్సరానికి పాత పద్ధతిలోనే నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.

దరఖాస్తుకు చివరి తేదీలు

- టీఎస్‌పీఎస్సీ.. 369 ఫార్మసిస్ట్, 238 ఏఎన్‌ఎం/ఎంపీహెచ్‌ఏ, 27 హార్టికల్చర్ ఆఫీసర్, 6 అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులకు: ఫిబ్రవరి 28, 2018. వెబ్‌సైట్: t s p s c
- ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో 1,898 అప్రెంటీస్ పోస్టులకు: ఫిబ్రవరి 28, 2018. వెబ్‌సైట్: w y s w . g . e o c v r . . i
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలిసిస్ (ఐడీఎస్‌ఏ)లో 6 అసోసియేట్ ఫెలో పోస్టులకు: ఫిబ్రవరి 28, 2018. వెబ్‌సైట్: i d s a . i n

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

రైల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలా

ఖాళీలు 195

పంజాబ్‌లోని కపుర్తలాలోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ (ఆర్‌సీఎఫ్).. 195 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టు: అప్రెంటీస్.
- ట్రేడ్ విభాగాల వారీ ఖాళీలు: ఫిట్టర్-55; వెల్డర్ (జీఅండ్ఈ)-50; మెషినిస్ట్-17; పెయింటర్ (జీ)-9; కార్పెంటర్-16; మెకానిక్ (ఎంవీ)-6; ఎలక్ట్రీషియన్-28; ఎలక్ట్రానిక్ మెకానిక్-4; ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిక్-10.
- అర్హతలు: కనీసం 50 శాతం మార్కులతో పదోతరగతి/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే సంబంధిత ట్రేడ్ విభాగంలో ఐటీఐ.
- వయసు: 16-24 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ కేటగిరీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- ఎంపిక: మార్కుల మెరిట్ (పదోతరగతి+ఐటీఐ) ఆధారంగా.
- దరఖాస్తు రుసుం: రూ.100; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- చివరి తేదీ: మార్చి 19, 2018.
- వెబ్‌సైట్: w ws .

రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్

ఖాళీలు 154

ముంబైలోని రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్).. 154 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో రీజనల్ డైరెక్టర్ ఆఫ్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ (ఆర్‌డీఏటీ)లో 87 ట్రేడ్ అప్రెంటీస్, బోర్డ్ ఆఫ్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ (బీవోఏటీ)లో 67 డిప్లొమా ట్రైనీ ఖాళీలు ఉన్నాయి.

- పోస్టు-ఖాళీలు: ట్రేడ్ అప్రెంటీస్-87, డిప్లొమా ట్రైనీ-67.
- శిక్షణ వ్యవధి: డిప్లొమా ట్రైనీకి ఏడాది; ట్రేడ్ అప్రెంటీస్‌కు విభాగాన్ని బట్టి ఏడాది, 15 నెలలు, రెండేళ్లు.
- విభాగాల వారీ ఖాళీలు: ట్రేడ్‌లో వెల్డర్ (జీఅండ్ఈ)-2, మెషినిస్ట్-3, ఎలక్ట్రీషియన్-10, మెయింటెనెన్స్ మెకానికల్ కెమికల్ ప్లాంట్ (ఎంఎంసీపీ)-12, బాయిలర్ అటెండెంట్-4, అటెండెంట్ ఆపరేటర్ కెమికల్ ప్లాంట్ (ఏవోసీపీ)-30, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ కెమికల్ ప్లాంట్ (ఐఎంసీపీ)-10, లేబొరేటరీ అటెండెంట్ కెమికల్ ప్లాంట్ (ఎల్ఏసీపీ)-2, మెడికల్ లేబొరేటరీ టెక్ (పాథాలజీ)-2, మెడికల్ లేబొరేటరీ టెక్ (రేడియాలజీ)-1, లైబ్రరీ అసిస్టెంట్-1, స్టెనోగ్రాఫర్ (ఇంగ్లిష్)-8; డిప్లొమాలో కెమికల్-19, మెకానికల్-18, ఎలక్ట్రికల్-12, ఇన్‌స్ట్రుమెంటేషన్-8, సివిల్-3, మెడికల్ ల్యాబ్ టెక్-5, కంప్యూటర్/ఐటీ-2.
- స్టైపెండ్: డిప్లొమా ట్రైనీకి రూ.5,000; ట్రేడ్ అప్రెంటీస్‌కు విభాగాలను బట్టి రూ.6,381/రూ.7,292/రూ.8,204.
- అర్హతలు: ట్రేడ్ అప్రెంటీస్‌లోని ఏవోసీపీ, ఐఎంసీపీ, ఎల్ఏసీపీ విభాగాల పోస్టులకు కనీసం 50 శాతం మార్కులతో బీఎస్సీ (కెమిస్ట్రీ/ఫిజిక్స్), మిగిలిన వాటికి ఇంటర్మీడియెట్/తత్సమా విద్య; డిప్లొమా ట్రైనీకి కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా/మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ/ఎస్టీ కేటగిరీలకు మార్కుల శాతంలో 5 శాతం తగ్గింపు ఉంటుంది.
- వయసు: 2017, నవంబర్ 1 నాటికి ట్రేడ్ అప్రెంటీస్‌లోని ఏవోసీపీ, ఐఎంసీపీ, ఎల్ఏసీపీ విభాగాలకు, డిప్లొమా ట్రైనీకి 25 ఏళ్లు, ట్రేడ్ అప్రెంటీస్‌లోని మిగిలిన విభాగాలకు 21 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- ఎంపిక: మార్కుల మెరిట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- చివరి తేదీ: మార్చి 8, 2018.
- వెబ్‌సైట్: wn r w a


ఎయిర్ ఇండియా

ఖాళీలు 60

ఎయిర్ ఇండియా... కోల్‌కతాలోని ఈస్ట్రన్ రీజియన్ ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్ఎల్)లో 60 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టు: యుటిలిటీ హ్యాండ్.
- మొత్తం ఖాళీలు: 60 (జనరల్-32+ ఓబీసీ-13+ ఎస్సీ-13+ఎస్టీ-2).
- వేతనం: రూ.15,418.
- అర్హతలు: ఎనిమిదో తరగతి ఉత్తీర్ణతతోపాటు ఏవియేషన్ సెక్టార్‌లో కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి. ఈ అనుభవం ఉన్న ఐటీఐ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
- వయసు: 2017, ఆగస్టు 31 నాటికి 55 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- ఎంపిక: స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ/ట్రేడ్ టెస్ట్.
- దరఖాస్తు రుసుం: రూ.500; ఎస్సీ/ఎస్టీ/మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.
- దరఖాస్తు విధానం: వెబ్‌సైట్‌లో చూపిన దరఖాస్తు నమూనాలో వివరాలు నింపి, దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కోల్‌కతాలోని 'ఆఫీస్ ఆఫ్ ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ కాంప్లెక్స్, హెచ్‌ఆర్ యూనిట్, ఏపీయూ సెంటర్, ఎన్‌టీఏ (న్యూ టెక్నికల్ ఏరియా), ఢం ఢం, కోల్‌కతా-700052' చిరునామాలో మార్చి 12, 2018న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు నేరుగా అందించాలి.
- వెబ్‌సైట్: w w

జాబ్ పాయింట్



నిఫ్ట్

ఖాళీలు 62

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టీ: నిఫ్ట్)... 62 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్.
- మొత్తం ఖాళీలు: 63 (అన్‌రిజర్వ్‌డ్-32+ఎస్సీ-9+ఎస్టీ-5+ఓబీసీ-17).
- వేతనం: రూ.66,000+హెచ్‌ఆర్ఏ.
- విభాగాలు: డిజైన్, కమర్షియల్/విజువల్ ఆర్ట్స్, ఆర్ట్ హిస్టరీ, క్రిటిసిజం/మ్యూజియాలజీ, క్లాతింగ్ అండ్ టెక్స్‌టైల్స్, ఫ్యాబ్రిక్ అండ్ అపెరల్ సైన్స్, కమ్యూనికేషన్ డిజైన్, విజువల్ కమ్యూనికేషన్, మాస్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ డిజైన్, అడ్వర్టైజింగ్ అండ్ బ్రాండింగ్, అడ్వర్టైజ్‌మెంట్ అండ్ జర్నలిజం, స్ట్రేటజిక్ డిజైన్, ఫిల్మ్ డిజైన్, ఫొటోగ్రఫీ, యానిమేషన్ అండ్ మల్టీ మీడియా, గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్, ఇంటరాక్షన్ డిజైన్, స్పేస్/ఎగ్జిబిషన్/ఇంటీరియర్ డిజైన్, మెకానికల్/ఇండస్ట్రియల్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ తదితర విభాగాలు.
- అర్హతలు: సంబంధిత విభాగాలను అనుసరించి పీజీ/ఎంఆర్క్/ఎంఎఫ్ఏ/ఎంఎస్సీ/ఎంటెక్/ఎంఈ/ఎంఎస్/ఎంసీఏ/ఎంసీఎం/ఎంబీఏ.
- వయసు: 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ/ప్రెజెంటేషన్.
- రాతపరీక్ష విధానం: ఇందులో రెండు భాగాలు ఉంటాయి. పార్ట్-1లో జనరల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, అనలిటికల్ ఎబిలిటీ, టెస్ట్ ఆఫ్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్ నుంచి 50 మార్కులకు, పార్ట్-2లో ప్రొఫెషనల్ ఆప్టిట్యూడ్(సంబంధిత విభాగం) నుంచి 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పార్ట్-1ను అర్హత పరీక్షగా పరిగణిస్తారు. ఇందులో క్వాలిఫై అయిన వారికి పార్ట్-2 ఉంటుంది. ఇందులోనూ ఉత్తీర్ణత పొందిన వారి మెరిట్ జాబితా నుంచి ఇంటర్వ్యూ, ప్రెజెంటేషన్/క్లాస్ రూమ్ లెక్చర్/డిమానిస్ట్రేషన్‌కు ఎంపిక చేస్తారు. అనంతరం తుది ఎంపిక ఉంటుంది.
- దరఖాస్తు రుసుం: రూ.1,000; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ/నిఫ్ట్ డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- చివరి తేదీ: మార్చి 21, 2018.
- వెబ్‌సైట్: w w

డీఆర్‌డీవో ఐటీఆర్

ఖాళీలు 60

ఎయిర్ ఇండియా... కోల్‌కతాలోని ఈస్ట్రన్ రీజియన్ ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్ఎల్)లో 60 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టు: యుటిలిటీ హ్యాండ్.
- మొత్తం ఖాళీలు: 60 (జనరల్-32+ ఓబీసీ-13+ ఎస్సీ-13+ఎస్టీ-2).
- వేతనం: రూ.15,418.
- అర్హతలు: ఎనిమిదో తరగతి ఉత్తీర్ణతతోపాటు ఏవియేషన్ సెక్టార్‌లో కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి. ఈ అనుభవం ఉన్న ఐటీఐ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
- వయసు: 2017, ఆగస్టు 31 నాటికి 55 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- ఎంపిక: స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ/ట్రేడ్ టెస్ట్.
- దరఖాస్తు రుసుం: రూ.500; ఎస్సీ/ఎస్టీ/మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.
- దరఖాస్తు విధానం: వెబ్‌సైట్‌లో చూపిన దరఖాస్తు నమూనాలో వివరాలు నింపి, దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కోల్‌కతాలోని 'ఆఫీస్ ఆఫ్ ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ కాంప్లెక్స్, హెచ్‌ఆర్ యూనిట్, ఏపీయూ సెంటర్, ఎన్‌టీఏ (న్యూ టెక్నికల్ ఏరియా), ఢం ఢం, కోల్‌కతా-700052' చిరునామాలో మార్చి 12, 2018న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు నేరుగా అందించాలి.
- వెబ్‌సైట్: w w

లక్నో మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్

ఖాళీలు 386

కేంద్రం, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటుచేసిన లక్నో మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎల్ఎంఆర్‌సీ).. 386 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టు-ఖాళీలు: ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో.. అసిస్టెంట్ మేనేజర్ (ఏఎం)-27 (సివిల్-7+ఎలక్ట్రికల్-6+ ఎస్అండ్‌టీ-3+ఆర్కిటెక్ట్-3+ ఆపరేషన్స్-2+ఐటీ-1+ ఫైనాన్స్-1+హెచ్‌ఆర్-2+పబ్లిక్ రిలేషన్స్-2), అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీ (ఏసీఎస్)-1; నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో స్టేషన్ కంట్రోలర్ కం ట్రైన్ ఆపరేటర్ (ఎస్‌సీటీవో)-101, కస్టమర్ రిలేషన్స్ అసిస్టెంట్ (సీఆర్ఏ)-49, జూనియర్ ఇంజనీర్ (జేఈ)-93 (సివిల్-31+ఎలక్ట్రికల్-35+ ఎస్అండ్‌టీ-27), ఆఫీస్ అసిస్టెంట్ (ఓఏ)-2 (హెచ్‌ఆర్), అకౌంట్స్ అసిస్టెంట్ (ఏఏ)-1, పబ్లిక్ రిలేషన్స్ అసిస్టెంట్ (పీఆర్ఏ)-2, మెయింటైనర్-110 (సివిల్-17+ఎలక్ట్రికల్-65+ఎస్అండ్‌టీ-28).
- వేతనశ్రేణి: ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులకు రూ.20,600-రూ.46,500; నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్‌లోని ఎస్‌సీటీవో, జేఈ పోస్టులకు రూ.13,500-రూ.25,520, మెయింటైనర్‌కు రూ.8,000-రూ.14,140, మిగిలిన పోస్టులకు రూ.10,170-రూ.18,500.
- అర్హతలు: ఎగ్జిక్యూటివ్ కేడర్‌లోని పోస్టులకు సంబంధిత విభాగాలను అనుసరించి బీఈ/బీటెక్/బీఆర్క్/ ఎంసీఏ/ఎంటెక్/ఎంబీఏ/ఐసీఎస్ఐ మెంబర్/మాస్టర్ డిగ్రీ (మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం); నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్‌లోని పోస్టులకు సంబంధిత విభాగాలను బట్టి ఇంజనీరింగ్ డిప్లొమా/ బీకామ్/బ్యాచిలర్ డిగ్రీ (మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం)/ఐటీఐ (ఎన్‌సీవీటీ/ఎస్‌సీవీటీ) ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్/ఓబీసీ అభ్యర్థులకు కనీసం 60 శాతం, ఎస్సీ/ఎస్టీకి కనీసం 50 మార్కులు తప్పనిసరి.
- వయసు: 2018, ఫిబ్రవరి 1 నాటికి 21-28 ఏళ్ల లోపు ఉండాలి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రిజర్వుడ్ కేటగిరీలకు మాత్రమే గరిష్ట వయోపరిమితిలో నిబంధనల మేర సడలింపు ఉంటుంది.
- ఎంపిక: సంబంధిత పోస్టులను బట్టి రాతపరీక్ష+మెడికల్ ఎగ్జామినేషన్/రాతపరీక్ష+ఫిజియో ఆప్టిట్యూడ్ టెస్ట్+ మెడికల్ ఎగ్జామినేషన్.
- రాతపరీక్ష విధానం: దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ ఆధారితంగా నిర్వహిస్తారు. ఇందులో జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, లాజికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌తోపాటు సంబంధిత విభాగం/ట్రేడ్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. మెయింటైనర్ పోస్టులకు పరీక్ష 100 మార్కులకు, మిగిలిన పోస్టులకు 140 మార్కులకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకూ సమాన మార్కులు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికీ 1/3వ వంతు మార్కు కోత విధిస్తారు. పరీక్ష వ్యవధి 2గంటలు.
- దరఖాస్తు రుసుం: జనరల్/ఓబీసీ-రూ.500; ఎస్సీ/ఎస్టీ-రూ.200.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- చివరి తేదీ: మార్చి 27, 2018.
- వెబ్‌సైట్: w w

ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్

ఖాళీలు 300

తమిళనాడులోని కల్పకంలో ఉన్న ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ (ఐజీసీఏఆర్)... 300 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టు: ట్రేడ్ అప్రెంటీస్.
- స్టైపెండ్: కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ (డీజీఈటీ) నిబంధనల ప్రకారం.
- విభాగాలు: ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ (జీఅండ్ఈ), ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, డ్రాట్స్‌మ్యాన్ (మెకానికల్), మెకానిక్ ఆర్ అండ్ ఏసీ, కార్పెంటర్, పాసా (ప్రోగ్రామింగ్ అండ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్:పీఏఎస్ఎస్ఏ), గార్డెనర్, హార్టికల్చర్ అసిస్టెంట్.
- అర్హతలు: పాసాకు కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్‌లో నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ (ఎన్‌సీవీటీ); గార్డెనర్, హార్టికల్చర్ విభాగాలకు పదోతరగతి; మిగిలిన విభాగాలకు పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో రెండేళ్ల ఐటీఐ.
- వయసు: దరఖాస్తు గడువు ముగిసే నాటికి 14-22 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- ఎంపిక: వాకిన్ ఇంటర్వ్యూ.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 15, 2018.
- ఇంటర్వ్యూ తేదీలు: మార్చి 13-15, 2018.
- వెబ్‌సైట్: w w

పీజీసీఐఎల్

ఖాళీలు 44

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) నార్తర్న్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్-3లో 44 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది. పీజీసీఐఎల్... కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని నవరత్న పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్.

- పోస్టు-ఖాళీలు: డిప్లొమా ట్రెయినీ (ఎలక్ట్రికల్)-40; జూనియర్ ఆఫీసర్ ట్రెయినీ (హెచ్‌ఆర్)-4.
- స్టైపెండ్/వేతనశ్రేణి: శిక్షణలో రూ.16,500 స్టైపెండ్; ఉద్యోగంలో నియమితులయ్యాక వేతన శ్రేణి-రూ.16,000-రూ.35,500.
- అర్హతలు: డిప్లొమా ట్రైనీకి ఇంజనీరింగ్ డిప్లొమాలో (ఎలక్ట్రికల్) కనీసం 70 శాతం (ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ కేటగిరీలకు పాస్ శాతం) మార్కులతో ఉత్తీర్ణత; జూనియర్ ఆఫీసర్ ట్రైనీ (హెచ్‌ఆర్)కు.. పీజీ డిప్లొమా (పర్సనల్ మేనేజ్‌మెంట్)/ ఎంఎస్‌డబ్ల్యూ (పర్సనల్ మేనేజ్‌మెంట్ మెయిన్ సబ్జెక్టు)/తత్సమాన విద్యలో కనీసం 55 శాతం (ఎస్టీ/దివ్యాంగ కేటగిరీలకు పాస్ శాతం) మార్కులతో ఉత్తీర్ణత.
- వయసు: 2018, మార్చి 13 నాటికి 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- ఎంపిక: డిప్లొమా ట్రైనీకి రాతపరీక్ష, జూనియర్ ఆఫీసర్ ట్రైనీకి రాతపరీక్ష, కంప్యూటర్ స్కిల్ టెస్ట్.
- రాతపరీక్ష విధానం: దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్-1లో సంబంధిత విభాగం టెక్నికల్/ప్రొఫెషల్ నాలెడ్జ్ 120 ప్రశ్నలు ఉంటాయి. పార్ట్-2లో ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో వొకాబ్యులరీ, వెర్బల్ కాంప్రెహెన్షన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, డేటా సఫిషియెన్సీ అండ్ ఇంటర్‌ప్రెటేషన్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకూ 1 మార్కు చొప్పున మొత్తం 170 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు మార్కు కోత విధిస్తారు. రాతపరీక్షలో ఉత్తీర్ణులైన జూనియర్ ఆఫీసర్ ట్రైనీ అభ్యర్థులకు కంప్యూటర్ స్కిల్ టెస్ట్ ఉంటుంది. దీన్ని అర్హత పరీక్షగా పరిగణిస్తారు.
- రాతపరీక్ష కేంద్రాలు: లక్నో, కాన్పూర్, వారణాశి, ఆగ్రా.
- దరఖాస్తు రుసుం: రూ.300; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మాజీ సైనికోద్యోగ/డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- చివరి తేదీ: మార్చి 13, 2018.
- వెబ్‌సైట్: w o w v o

సాక్షి బిజినెస్

బుధవారం 28-2-2018

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
99 ▼	28 ▼
34,346	10,554

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 10.30కి)

నాస్‌డాక్	7,375	▼	46
డోజోన్స్	25,657	▼	52
ఎఫ్‌టీఎస్ఈ 100	7,282	▼	7
డాక్స్	12,490	▼	36
షాంఘై	3,292	▼	38
నికాయ్	22,390	▲	236

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.05	65.73
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	89.19	92.19
€	యూరో	ఎస్‌బీఐ	78.62	81.34
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.66	61.78
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.96	51.93
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.52	50.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.68	18.59
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.05	18.79
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.27	11.78

పీఎన్‌బీకి మరో షాక్

స్కామ్ ఇంకో రూ.1,322 కోట్లు పెరగొచ్చు ◆ నీరవ్ మోదీ దెబ్బ మొత్తంగా రూ.12,717 కోట్లు

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణంలో తవ్విన కొద్దీ మరిన్ని అక్రమ లావాదేవీలు బయట పడుతున్నాయి. తాజాగా ఈ స్కామ్ పరిమాణం మరో రూ. 1,322 కోట్లు పెరిగి మొత్తం రూ. 12,717 కోట్లకు చేరింది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు పంపిన సమాచారంలో పీఎన్‌బీ ఈ విషయం వెల్లడించింది. 'అనధికారిక లావాదేవీల పరిమాణం మరో 204.25 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,322 కోట్లు) మేర పెరగొచ్చని అంచనా వేస్తున్నాం' అంటూ బ్యాంకు పేర్కొంది. వజ్రాభరణాల వ్యాపారస్తులు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు చెందిన సంస్థలు తెరతీసిన ఈ స్కామ్ విలువ సుమారు రూ.11,400 కోట్లు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే, విచారణలో మరిన్ని లావాదేవీలు బయటపడుతున్నాయి. దీంతో స్కామ్ మొత్తం మరింతగా పెరుగుతోంది. పీఎన్‌బీ అధికారులతో కుమ్మక్కై మోసపూరితంగా బ్యాంకు గ్యారంటీలు తీసుకున్న మోదీ, చోక్సీలకు చెందిన సంస్థలు... వాటి ఆధారంగా అలహాబాద్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ తదితర బ్యాంకుల విదేశీ శాఖల నుంచి భారీగా రుణాలు పొందాయి. తద్వారా భారీ స్కామ్‌కి తెర తీశాయి. జనవరి 25న దీన్ని గుర్తించిన బ్యాంకు.. జనవరి 29న ఆర్‌బీఐకి, సీబీఐకి ఫిర్యాదు చేసింది. ఫిబ్రవరి 5న స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ఆ తర్వాత ఫిబ్రవరి 7న ఆర్‌బీఐకి మరో నివేదికనిచ్చిన పీఎన్‌బీ.. నీరవ్ మోదీ గ్రూప్, గీతాంజలి గ్రూప్ మొదలైన వాటిపై అటు సీబీఐకి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కి మరో ఫిర్యాదు కూడా చేసింది. ఈ కేసులో పది మంది పైగా ఉద్యోగులను బ్యాంకు సస్పెండ్ చేసింది.

మరోవైపు, ఈ మోసం కారణంగా నష్టపోయిన ఇతర బ్యాంకులకు పరిహారం చెల్లించాలంటూ ప్రభుత్వం నుంచి తమకు ఆదేశాలేమీ రాలేదని పీఎన్‌బీ స్పష్టం చేసింది. ఒకవేళ చట్ట ప్రకారం చెల్లించాల్సి వస్తే తమ దగ్గర తగినన్ని ఆస్తులు ఉన్నాయని పేర్కొంది.



నీరవ్ మోదీ ఫైర్‌స్టార్ డైమండ్ దివాలా..

నీరవ్ మోదీకి చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ దివాలా ప్రకటించింది. ఇందుకు సంబంధించి దివాలా రక్షణ చట్టం చాప్టర్ 11 కింద న్యూయార్క్ సదరన్ దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రుణదాతల సంఖ్య 50 నుంచి 99 దాకా ఉంటుందని పేర్కొంది. రుణాలు తిరిగి చెల్లించడంలో.. నిధుల కొరత, సరఫరాపరమైన సమస్యలు ప్రధాన సవాళ్లుగా మారినట్లు ఫైర్‌స్టార్ డైమండ్ వివరించింది. 100 మిలియన్ డాలర్ల మేర ఆస్తులు, అప్పులు పిటిషన్లో చూపింది. కంపెనీకి భారత్‌తో పాటు అమెరికా, యూరప్, మధ్యప్రాచ్య దేశాల్లో కార్యకలాపాలున్నాయి. ఫైర్‌స్టార్ డైమండ్ వెబ్‌సైట్ ప్రకారం.. 1999లో విడి వజ్రాల సరఫరాదారుగా సంస్థ కార్యకలాపాలు ప్రారంభించింది. ఆ తర్వాత 2001లో ఆభరణాల తయారీ మొదలుపెట్టింది. ప్రైవేట్ లేబుల్ ఉత్పత్తుల కోసం ఫ్రెడరిక్ గోల్డ్‌మన్ డైమండ్ జ్యుయలరీ సంస్థను కొనుగోలు చేయడంతో పాటు అమెరికా రిటైల్ మార్కెట్లోకి ప్రవేశించింది. అటుపైన అమెరికాలో వ్యాపార కార్యకలాపాలు విస్తరించింది. 2009లో బెల్జియంలో యూనిట్ ప్రారంభించింది. 2010లో నీరవ్ మోదీ అల్ట్రా లగ్జరీ డైమండ్ జ్యుయలరీ బ్రాండ్‌ను మొదలుపెట్టింది.

రూ.50 కోట్ల పైబడ్డ ఎన్‌పీఏలపై విచారణ

మోసాలకు ఆస్కారమున్న రూ.50 కోట్ల పైబడ్డ మొండిపద్దులన్నింటిపైనా (ఎన్‌పీఏ) విచారణ జరపాలని ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆర్థిక శాఖ ఆదేశించింది. అలాంటి కేసులేమైనా ఉంటే తక్షణం సీబీఐకి ఫిర్యాదు చేయాలని సూచించింది. 'రూ.50 కోట్ల పైబడిన మొండి బాకీల విషయంలో మోసాలకు ఆస్కారమేదైనా ఉందేమో పరిశీలించాలని ప్రభుత్వ రంగ బ్యాంకు ఎండీలకు సూచించాం. అలాంటి మోసాలు, ఉద్దేశపూర్వక ఎగవేతలను సత్వరం గుర్తించాలని, సీబీఐకి ఫిర్యాదు చేయాలని ఆదేశించాం' అని రాజీవ్ కుమార్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఎగుమతి, దిగుమతి నిబంధనలు.. విదేశీ మారక నిర్వహణ చట్టం ఉల్లంఘనలు మొదలైనవి బయటపడిన పక్షంలో అవసరమైతే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్‌కి కూడా ఫిర్యాదు చేయాలని పీఎస్‌బీలకు కేంద్రం సూచించింది. సదరు బ్యాంకుల చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్లు.. రూ. 50 కోట్ల పైబడిన మోసాలపై సీబీఐకి ఫిర్యాదు చేయాలని, విచారణ విషయంలో దర్యాప్తు సంస్థతో కలిసి పనిచేయాలని పేర్కొంది. అటు మొండిబాకీగా మారిన ఖాతాదారు పరిస్థితిపై సెంట్రల్ ఎకనమిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో (సీఈఐబీ) నుంచి కూడా బ్యాంకులు నివేదిక కోరవచ్చని, వారం రోజుల వ్యవధిలో సీఈఐబీ స్పందించాల్సి ఉంటుందని తెలిపింది.



కంపెనీ నుంచి కస్టమర్‌కు 'బ్యాచ్‌ట్యాగ్'

80 శాతం వరకూ ధర తగ్గే అవకాశం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్‌కు చెందిన ఫార్మా రిటైల్ చెయిన్ మెడ్‌ప్లస్ ఫౌండర్ మధుకర్ గంగాడి.. బ్యాచ్‌ట్యాగ్ పేరిట మరో కంపెనీని ఆరంభించారు. ''కంపెనీల్లో తయారైన ఉత్పత్తులు కస్టమర్ల కంటే ముందు డిస్ట్రిబ్యూటర్లు, రిటైలర్లకు చేరుతాయి. వాళ్ల మార్జిన్లు కూడా కలపడంతో అంతిమంగా కస్టమర్‌ను చేరే సరికి వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. దీనికి పరిష్కారం చూపించేదే బ్యాచ్‌ట్యాగ్'' అని మంగళవారం విలేకరులతో చెప్పారు. కస్టమర్ తనకు కావాల్సిన వస్తువులను నేరుగా తయారీ సంస్థల నుంచే కొనుగోలు చేసే వీలుంటుందన్నారు. దీనివల్ల ధరలు మార్కెట్ కన్నా 40–80 శాతం వరకు తక్కువగా ఉంటాయన్నారు. ప్రస్తుతం ఫర్నిచర్, డెకరేషన్, హోమ్ అప్లియెన్సెస్, నిర్మాణ సామగ్రి వంటి నాలుగైదు విభాగాల్లో ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులతో (ఓఈఎం) ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. గుజరాత్, కాన్పూర్, కోల్‌కతా వంటి నగరాల్లోని 25కి పైగా ఓఈఎంలు, ఒక్కో కేటగిరీ నుంచి 3–4 ఓఈఎంలతో ఒప్పందం ఉంటుందని తెలిపారు. త్వరలోనే ఏసీ, టీవీ, ఫ్రిజ్ వంటి హోమ్ ఎలక్ట్రానిక్స్ ఓఈఎంలతో ఒప్పందం చేసుకోనున్నామని తెలిపారు.

2025 నాటికి లక్ష స్టార్టప్‌లు: పాయ్



న్యూఢిల్లీ: భారత్‌లో 2025 నాటికి లక్ష స్టార్టప్‌లు ఉంటాయని మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ చైర్మన్ టీవీ మోహన్‌దాస్ పాయ్ చెప్పారు. 2030 నాటికి స్టార్టప్ వ్యవస్థ దేశంలో 10 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీని సృష్టించే అవకాశం ఉందన్నారు. ''ప్రస్తుతం మన దేశంలో 32,000 స్టార్టప్‌లు ఉన్నాయి. ఏటా 7,000 స్టార్టప్‌లు ఆరంభమవుతున్నాయి. 2025 నాటికి ఈ స్టార్టప్‌ల సంఖ్య లక్షకు చేరుతుంది. 32.5 లక్షల మందికి ఉద్యోగాలను కల్పించగలదు'' అని స్టార్టప్‌లపై ఎన్ఎస్ఈ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాయ్ చెప్పారు. మోహన్‌దాస్ పాయ్ ఏంజెల్ ఇన్వెస్టర్‌గా పలు స్టార్టప్ సంస్థల్లో ఇన్వెస్ట్ కూడా చేశారు. కొత్త తరహా టెక్నాలజీలతో వచ్చే స్టార్టప్‌లు పబ్లిక్ ఇష్యూలకు వెళ్లడం ద్వారా బ్రాండ్ విలువను సృష్టించుకోవాలని ఆయన సూచించారు. అమెరికా, చైనా తర్వాత స్టార్టప్‌లకు భారత్ అతిపెద్ద దేశమన్నారు. స్టార్టప్‌లు ఓ స్థాయికి చేరుకోగానే పబ్లిక్ ఇష్యూలకు వెళ్లాలని ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఈ చైర్మన్ విక్రం లిమాయే కూడా సూచించారు. స్టార్టప్‌లు ఎదిగేందుకు, సమర్థవంతంగా కొనసాగేందుకు తగిన వ్యవస్థ ఏర్పాటు చేయడానికి ఎన్ఎస్ఈ కట్టుబడి ఉందన్నారు.

గూగుల్‌తో ఎయిర్‌టెల్ జట్టు

భారత్‌లోకి చౌక ఆండ్రాయిడ్ ఫోన్లు



న్యూఢిల్లీ: చౌక ఆండ్రాయిడ్ ఓరియో (గో ఎడిషన్) స్మార్ట్‌ఫోన్లను భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టే దిశగా టెక్ దిగ్గజం గూగుల్‌తో టెలికం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ చేతులు కలిపింది. 'మేరా పెహలా స్మార్ట్‌ఫోన్ (నా తొలి స్మార్ట్‌ఫోన్)' కార్యక్రమం కింద మార్చి నుంచి ఆండ్రాయిడ్ ఓరియో (గో) ఆపరేటింగ్ సిస్టంతో పనిచేసే చౌక 4జీ స్మార్ట్‌ఫోన్లు ఎయిర్‌టెల్ విక్రయించనుంది. వీటిలో మై ఎయిర్‌టెల్ యాప్‌తో పాటు ఎయిర్‌టెల్ టీవీ, వింక్ మ్యూజిక్ మొదలైన యాప్స్ ఉంటాయి. ఈ ఫోన్లలో ర్యామ్ 1 జీబీ లేదా అంతకన్నా తక్కువ ఉంటుంది. కోట్ల కొద్దీ ఫీచర్ ఫోన్ యూజర్లను స్మార్ట్‌ఫోన్ల వైపు మళ్లించేందుకు, వారికి ఇంటర్నెట్‌ను చేరువ చేసేందుకు చౌక ఆండ్రాయిడ్ గో ఫోన్స్ ఉపయోగపడతాయని భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ వాణీ వెంకటేష్ తెలిపారు. తక్కువ డేటా వినియోగంతో.. మరింత వేగంగా పనిచేసేలా తీర్చిదిద్దిన పలు యాప్స్ ఈ ఫోన్‌లో ఉంటాయి. ఓరియో గో ఓఎస్‌తో నడిచే చౌక స్మార్ట్‌ఫోన్స్‌ని గూగుల్ గతేడాది డిసెంబర్‌లో ఆవిష్కరించగా... లావా, మైక్రోమ్యాక్స్ వంటి హ్యాండ్‌సెట్ తయారీ సంస్థలు వీటిని తయారు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి. జెడ్50 పేరిట ఆండ్రాయిడ్ ఓరియో గో ఎడిషన్ స్మార్ట్‌ఫోన్‌ని లావా మంగళవారం ప్రకటించింది. మార్చి మధ్య నాటికల్లా లక్షకు పైగా రిటైల్ స్టోర్స్‌లో ఇవి అందుబాటులోకి వస్తాయని తెలిపింది. ధర మాత్రం వెల్లడించలేదు. జెడ్50లో 4.5 అంగుళాల డిస్‌ప్లే, 1.1 గిగాహెర్ట్జ్ క్వాడ్ కోర్ ప్రాసెసర్, 1 జీబీ ర్యామ్, 8 జీబీ ఇంటర్నల్ మెమరీ, 5 ఎంపీ కెమెరా, మొదలైన ఫీచర్స్ ఉంటాయి.

రిస్కుల్ని ఎలా ఎదుర్కొంటారు?

- ముందే గుర్తించేందుకు చర్యలేం తీసుకుంటున్నారు?
- 15 రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళికనివ్వండి
- ప్రభుత్వ బ్యాంకులకు కేంద్రం ఆదేశం



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు భారీ కుంభకోణం నేపథ్యంలో.. రిస్కులను ఎదుర్కొనడంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) సత్తాను సమీక్షించడానికి ప్రభుత్వం కసరత్తు మొదలెట్టింది. ఇందులో భాగంగా.. నిర్వహణపరమైన, సాంకేతిక రిస్కులను ముందస్తుగానే గుర్తించేందుకు, సమర్థంగా ఎదుర్కొనేందుకు అవి ఎంత మేర సిద్ధంగా ఉన్నాయో పరిశీలించనుంది. పెరుగుతున్న రిస్కులను ఎదుర్కొనడానికి అవి ఎంత సిద్ధంగా ఉన్నాయో... ఆ సన్నద్ధతను మెరుగుపరచుకోవటానికి ఏం చర్యలు తీసుకుంటున్నాయో తెలియజేయాలని బ్యాంకుల్ని ఆదేశించింది. ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలంటూ పీఎస్‌బీల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీ), చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ల(సీటీవో)ను కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశించింది. ఇందుకు 15 రోజుల గడువు విధించింది. కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి రాజీవ్ కుమార్.. మైక్రోబ్లాగింగ్ సైట్ ట్వీటర్‌లో ఈ విషయాలను ట్వీట్ చేశారు.

ఈడీ, సీటీవోలతో కమిటీ...

కేంద్ర ఆర్థిక శాఖ సూచనల ప్రకారం.. ప్రతీ పీఎస్‌బీ.. తమ తమ ఈడీ, సీటీవోలతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. బ్యాంకింగ్ రంగంలో ఉత్తమ విధానాల గురించి తెలుసుకోవడంతో పాటు.. ప్రస్తుత వ్యవస్థలో ఉన్న బలహీనతలు, లోపాలను ఈ కమిటీ గుర్తించాలి. ఆ తర్వాత నిర్వహణపరమైన రిస్కులను ఎదుర్కొనటంలో బ్యాంకింగ్ రంగంలోని ఉత్తమ విధానాలు.. తమ బ్యాంకు పాటిస్తున్న విధానాలను పోల్చి చూడాలి. ఏయే అంశాల్లో తాము వెనుకబడి ఉన్నామో, మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందో పరిశీలించాలి. మొత్తం మీద ఉత్తమ బ్యాంకింగ్ విధానాలు, కనీస ఆమోదయోగ్య ప్రమాణాలతో ఈడీలు, సీటీవోలు నివేదికలు తయారు చేయాలి. సాంకేతిక పరిష్కార మార్గాలతో సహా కార్యాచరణ ప్రణాళికను వాటిలో పొందుపర్చాలి.

అలహాబాద్ బ్యాంక్ సీఈవోను ప్రశ్నించిన సీబీఐ



పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించి అలహాబాద్ బ్యాంక్ సీఈవో, ఎండీ ఉషా అనంతసుబ్రమణియన్‌ను సీబీఐ మంగళవారం ప్రశ్నించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇటీవలే ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)కి చీఫ్‌గా ఎన్నికైన ఉష.. గతంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో సీనియర్ స్థానాల్లో కూడా పనిచేశారు. 2015 ఆగస్టు 14 దాకా ఆమె పీఎన్‌బీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవోగా వ్యవహరించారు. ఆ తర్వాత 2017 మే 6న అలహాబాద్ బ్యాంక్ సీఈవోగా నియమితులయ్యారు. తాజా కేసులో ఆమెను నిందితురాలిగా ప్రశ్నించడం లేదని సీబీఐ వర్గాలు తెలిపాయి. బ్యాంకు పర్యవేక్షణ వ్యవస్థ కన్నుగప్పి.. ఇంత భారీ లావాదేవీలు ఎలా చోటుచేసుకున్నాయి, ఇలాంటి వాటి గురించి ఆడిటర్లు ఎప్పుడైనా తమ నివేదికల్లో హెచ్చరికల్లాంటివేమైనా చేశారా లేదా అనే అంశాలపై స్పష్టత కోసం ఉషను ప్రశ్నిస్తున్నట్లు వివరించాయి.

గీతాంజలి జెమ్స్ ఖాతాల ఫోరెన్సిక్ ఆడిట్..

గీతాంజలి జెమ్స్ మోసానికి పాల్పడిందా లేదా అన్నది నిర్ధారించుకునేందుకు సంస్థ ఖాతాల ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని బ్యాంకులు నిర్ణయించాయి. ఇందుకోసం టీఆర్ చద్దా అండ్ కంపెనీని నియమించుకున్నాయి. ఆడిట్ ఫలితాలను బట్టి ఈ ఖాతాను ప్రామాణికమైనదిగానో లేదా మొండిపద్దుగానో పరిగణించడంపై బ్యాంకులు నిర్ణయం తీసుకోనున్నాయి.

పెరగనున్న సిమెంట్ డిమాండ్!

2018-19లో 4.5% వృద్ధి: ఇక్రా



న్యూఢిల్లీ: భారత్‌లో సిమెంట్ డిమాండ్‌కు సంబంధించిన వృద్ధి 2018–19లో 4.5 శాతంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా మంగళవారం వెలువరించిన తన నివేదికలో పేర్కొంది. గృహ నిర్మాణ రంగం పుంజుకోవడం, మౌలిక రంగంలో పెట్టుబడుల వృద్ధి దీనికి కారణంగా అంచనావేసింది. ''2017–18 ఏప్రిల్–డిసెంబర్ మధ్య దేశీయ సిమెంట్ ఉత్పత్తి 216.5 మిలియన్ మెట్రిక్ టన్నులు (ఎంఎంటీ), 2016–17 ఇదే కాలంతో పోల్చిచూస్తే (210.8 ఎంఎంటీ) ఇది 2.7 శాతం అధికం. ప్రస్తుత ధోరణి చూస్తుంటే, నడుస్తున్న ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 3 శాతం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి నెలవారీగా చూస్తే, 2017 డిసెంబర్‌లో సిమెంట్ ఉత్పత్తి వృద్ధి 8.4 శాతం పెరిగి 26.3 ఎంఎంటీలుగా నమోదయ్యింది'' అని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్రూప్ హెడ్ సవ్యసాచి మజుందార్ తాజా నివేదికలో వివరించారు. గ్రామీణ ఆదాయాల్లో మెరుగుదల, రుణ వృద్ధి పెరగడం, గ్రామీణ గృహ నిర్మాణ రంగంలో డిమాండ్ పెరుగుదలకు దోహదపడతాయని ఆయన విశ్లేషించారు.

అక్టోబర్ నుంచీ పుంజుకుంది.

ఏప్రిల్–జూన్ మధ్య కాలంలో ఉత్పత్తి తగ్గడాన్ని కూడా నివేదికలో ఇక్రా ప్రస్తావించింది. ఇసుక కొరత, రియల్టీ రెగ్యులేటరీ అథారిటీ (ఆర్ఈఆర్ఏ) అమలు, కరువు వంటి అంశాలను ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఇక రెండవ త్రైమాసికంలో జీఎస్‌టీ సంబంధిత అంశాలు, సగటుకన్నా తక్కువ వర్షపాతం, ఇసుక లభ్యతలో ఇబ్బందులు కొనసాగడం వంటి అంశాలు ఉత్పత్తి తగ్గడానికి కారణాలని పేర్కొంది. అయితే డిసెంబర్ త్రైమాసికంలో(అక్టోబర్–డిసెంబర్) ఉత్పత్తి 11.6 శాతం పెరిగి 75.6 ఎంఎంటీకి చేరిందని ఇక్రా పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తూర్పు రాష్ట్రాలు (బిహార్ మినహా), పశ్చిమ మార్కెట్లు మెరుగుపడటం ఉత్పత్తి పెరగడానికి కారణాలుగా వివరించింది.

దీపావళికి 99 శాతం ప్రజల్ని చేరుకుంటాం

రిలయన్స్ జియో లక్ష్యం



బార్సెలోనా: రిలయన్స్ జియో వచ్చే దీపావళి నాటికి దేశంలోని 99 శాతం ప్రజలకు సేవలు అందించే స్థితికి చేరుకోవాలన్న లక్ష్యంతో ఉంది. ఈ విషయాన్ని జియో ఇన్ఫోకామ్ ప్రెసిడెంట్ జ్యోతింద్ర థాకర్ తెలిపారు. విస్తరణ ప్రణాళికల్లో భాగంగా శామ్‌సంగ్ భాగస్వామ్యంతో కలసి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) సేవలను అందించాలనుకుంటున్నట్టు, ఇది కస్టమర్లు, వ్యాపారులకు సాయంగా ఉంటుందన్నారు. ప్రతీ నెలా 8,000 నుంచి 10,000 వరకు టవర్లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వచ్చే సెప్టెంబర్ లేదా అక్టోబర్ నాటికి దేశంలో 99 శాతం ప్రాంతాలను కవర్ చేయగలమన్నారు. ప్రస్తుతం జియోకి 16 కోట్ల టెలికం చందాదారులు ఉన్నారు.

రేట్ల పెంపు కొనసాగుతుంది: అమెరికా



వాషింగ్టన్: అమెరికా ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు బలంగానే ఉందని ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జీరోమ్ పావెల్ స్పష్టం చేశారు. స్టాక్ మార్కెట్లలో ఆటుపోట్ల ప్రభావం అమెరికా ఆర్థిక వ్యవస్థపై పెద్దగా ఉండబోదన్నారు. వృద్ధి, ఉపాధికి సంబంధించిన మెరుగైన అంచనాల బలంతో ఫెడ్ పాలసీ రేట్లను క్రమంగా పెంచుతుందని తెలియజేశారు. ఫెడ్ గతేడాది మూడు పర్యాయాలు రేట్లను పెంచడమే కాకుండా 2018లోనూ మూడు సార్లు పెంచుతామని సంకేతమిచ్చిన విషయం గుర్తుండే ఉంటుంది. జానెట్ యెలెన్ తర్వాత అమెరికా ఫెడ్ చైర్మన్‌గా ఈ నెల 5న బాధ్యతలు చేపట్టిన పావెల్ కూడా రేట్ల పెంపుపట్ల స్పష్టతతో ఉన్నట్టు తాజా వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి.ఈ నెల మొదట్లో స్టాక్ మార్కెట్లలో భారీ కరెక్షన్‌లను ప్రస్తావిస్తూ ఈ పరిణామాలు ఆర్థిక రంగ భవిష్యత్తుపై, లేబర్ మార్కెట్, ద్రవ్యోల్బణంపై పెద్దగా ప్రభావం చూపిస్తాయని ఫెడ్ భావించడం లేదన్నారు

హ్యుందాయ్ ఎలక్ట్రిక్ వస్తోంది!!

భారత కొరియా సదస్సులో ప్రదర్శన



ముంబై: హ్యుందాయ్ కంపెనీ మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన వ్యాపార సదస్సులో రెండు ఎలక్ట్రిక్ వాహనాలను ఆవిష్కరించింది. ఇక్కడ జరుగుతున్న భారత కొరియా వ్యాపార సదస్సులో ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో ఎస్‌యూవీ నెక్సోను, గ్లోబల్ మోడల్ లోనిక్‌ను ప్రదర్శనకు ఉంచినట్లు హ్యుందాయ్ నమ్‌యాంగ్ ఆర్ అండ్ డీ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.హెచ్. కిమ్ చెప్పారు. భారత్‌లో తయారీకి గత 20 ఏళ్లుగా తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తున్నామని చెప్పారాయన. సమర్థమైన పర్యావరణ అనుకూల వాహనాలను అందించడంలో ఈ ఎలక్ట్రిక్ వాహనాల ఆవిష్కరణను మైలురాయిగా వర్ణించారు.

ఎన్ఐఐఎఫ్‌లో ఏఐఐబీ 20 కోట్ల డాలర్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: భారత తొలి సావరిన్ వెల్త్ ఫండ్ ఎన్ఐఐఎఫ్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్)లో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) 20 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టనున్నది. బీజింగ్ కేంద్రంగా 2016 నుంచి ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. భారత్‌లో ఐదు మౌలిక రంగ ప్రాజెక్ట్‌లకు వంద కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టటానికి ఇప్పటికే అంగీకారం తెలిపామని ఏఐఐబీ ప్రెసిడెంట్ జిన్ లిక్యూన్ పేర్కొన్నారు. మరో ఏడు ప్రాజెక్టుల్లో 250 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

భారత్.. స్వేచ్ఛా విపణి



- పెట్టుబడులకు పూర్తి భద్రత
- ఇన్వెస్ట్ చేయాలంటూ కొరియా సంస్థలకు ప్రధాని ఆహ్వానం

న్యూఢిల్లీ: అధిక వృద్ధి బాటలో ముందుకెళుతున్న భారత్ వంటి స్వేచ్ఛా విపణి ప్రపంచంలో మరెక్కడా లేదని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వ్యాపార సంస్థలకు భారత్ గమ్యస్థానంగా మారిందన్నారు. పరిశ్రమల సమాఖ్య సీఐఐ, పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం (డీఐపీపీ) సంయుక్తంగా నిర్వహించిన భారత్–కొరియా బిజినెస్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ప్రధాని ఈ విషయాలు చెప్పారు. భారత్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు ముందుకు రావాలని, ఇక్కడ పెట్టుబడులకు పూర్తి భద్రతనిస్తున్నామని మోదీ తెలిపారు. వ్యాపారాలకు అనువైన పరిస్థితులు కల్పించే దిశగా.. అనేక అవరోధాలు తొలగించామని ఆయన చెప్పారు. ప్రభుత్వ జోక్యం అవసరం లేకుండా వివిధ రంగాల్లో ఆటోమేటిక్ పద్ధతిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) రాకకు వెసులుబాటు కల్పిస్తూ నిబంధనలు సడలించినట్లు ప్రధాని వివరించారు. కార్పొరేట్లపై పన్ను భారం తగ్గే విధానాలు అమలు చేస్తున్నామన్నారు.

'కొనుగోలు శక్తి పరంగా భారత్ ఇప్పటికే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. నామినల్ జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి)పరంగా త్వరలో ప్రపంచంలోనే అయిదో అతి పెద్ద దేశంగా అవతరించబోతోంది. ప్రజాస్వామ్యం, డిమాండు, జనాభాపరమైన ప్రయోజనాలు అత్యధికంగా ఉన్న అతి కొద్ది దేశాల్లో భారత్ ఒకటి. కాబట్టి పెట్టుబడులకు అనువైన పరిస్థితులు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రధానంగా తయారీ రంగాన్ని భారీ ఎత్తున ప్రోత్సహిస్తున్నాం' అని నరేంద్ర మోదీ చెప్పారు. దేశీయంగా సాఫ్ట్‌వేర్ .. ఐటీ పరిశ్రమ, ఆటోమొబైల్స్, ఉక్కు, నౌకా నిర్మాణం, నౌకాశ్రయాలు మొదలైన రంగాల్లో కొరియా సంస్థలకు అపార వ్యాపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఒకటే జీఎస్టీ శ్లాబు సాధ్యం కాదు: జైట్లీ



ఎన్నో వ్యత్యాసాలతో ఉన్న మన దేశంలో ప్రస్తుతానికి జీఎస్టీలో ఒకటే పన్ను శ్లాబు సాధ్యపడదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. దేశంలో పన్ను నిబంధనలను పాటించడం మెరుగుపడితే అప్పుడు తదుపరి సంస్కరణలు చేపడతామని ఇన్వెస్టర్లకు హామీ ఇచ్చారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన భారత్–కొరియా వ్యాపార సదస్సులో పాల్గొన్న జైట్లీ ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. కాగా, 7– 8 శాతం కంటే ఎక్కువ వృద్ధి సాధించే సామర్థ్యం భారత్‌కు ఉందని జైట్లీ పేర్కొన్నారు. వచ్చే 10–20 ఏళ్లలో భారత్ ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా ఉంటుందన్నారు. ''అంతర్జాతీయ వాతావరణం సమస్యల్లో ఉన్నప్పటికీ భారత్ గత కొన్ని సంవత్సరాలలో తానేంటో నిరూపించుకుంది. అవసరమైతే తనను తాను సరిదిద్దుకోగలదు. అవసరమైతే అధిక వృద్ధి రేటు కొనసాగించేందుకు కఠిన నిర్ణయాలు తీసుకుంటాం'' అని చెప్పారు.

రెట్రోస్పెక్టివ్ పన్ను

రెట్రోస్పెక్టివ్ పన్నుపై (చట్టరూపం దాల్చక ముందు నుంచి అమలు చేయడం) మాట్లాడుతూ... ''ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, ప్రత్యక్ష పన్ను వసూళ్ల విధానంపై ఉన్న అపనమ్మకాలు అన్నింటినీ తొలగించాం. పన్నుల పరంగా మరింత స్పష్టతను, స్థిరత్వాన్ని తీసుకొచ్చాం'' అని జైట్లీ చెప్పారు.

మోదీ హయాంలో మార్కెట్ 13 % వృద్ధి

పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభు



నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ప్పటి నుంచి గత నాలుగేళ్లలో మన స్టాక్ మార్కెట్ 13 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందిందని వాణిజ్యం, పరిశ్రమల మంత్రి సురేశ్ ప్రభు చెప్పారు. ఇక్కడ సీఐఐ నిర్వహించిన భారత్–కొరియా వాణిజ్య సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కొరియాతో ద్వైపాక్షిక ఆర్థిక సహకారాన్ని మరింతగా పెంచుకోవలసి ఉందన్నారు. విదేశాల నుంచి ముఖ్యంగా కొరియా నుంచి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించాలన్న ప్రధాని మోదీ స్వప్నం సాకారం కావడానికి ప్రయత్నిస్తామని చెప్పారు.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- ఈ మూడు షేర్లు రేసు గుర్రాలు...
- మార్కెట్లో ఒడిదుడుకులు కొనసాగుతాయ్!
- లాంగ్‌లో ఉండండి.. స్టాప్‌లాస్ 10,450: హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్
- వ్యవసాయ, ఇన్‌ఫ్రాలు బెస్ట్: నీలేశ్ షా
- ఫెడ్ రేట్ల పెంపు రిస్క్ ఇండియాకే ఎక్కువ !

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం..

WWW.SAKSHIBUSINESS.COM

SAKSHIBUSINESS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

Google Play | App Store

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)



పత్తి (వరంగల్, (వ్యాపారస్తులు)	--	--
మిర్చి (వరంగల్, తేజ)	--	--
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	--	--
ఉల్లి (కర్నూలు)	--	--
చక్కెర (చెన్నై)	రూ.3,600	
బియ్యం (కరీంనగర్)	రూ. 3,800 (హెచ్‌ఎంటీ)	
కందిపప్పు (చెన్నై)	రూ.7,200	
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)	
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--	

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,695	▼	55
బంగారం (99.5, 10గ్రా)	30,545	▼	55
వెండి (కిలో)	38,495	▼	115
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	29,240	▼	30
వెండి (కిలో)	--		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,690		
బంగారం (22 క్యారెట్లు)	29,230		
వెండి (కిలో)	41,700		
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,500		0
బంగారం (22 క్యారెట్లు)	29,150		0
వెండి (కిలో)	39,900		0
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,854	▼	33
బంగారం (22 క్యారెట్లు)	29,200	▼	30
వెండి (కిలో)	41,000	▼	0
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,600		
బంగారం (22 క్యారెట్లు)	29,300		
వెండి(కిలో)	39,800		
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,610	▼	40
బంగారం (22 క్యారెట్లు)	29,240	▼	30
వెండి (కిలో)	39,700	▼	0

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 28-2-2018

విశాఖ	350–00
చిత్తూరు	388–00
వరంగల్	357–00
ముంబై	390–00
చెన్నై	395–00
విజయవాడ	348–00
గోదావరి	348–00
నమక్కల్	380–00
27-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	355–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15

రెండు రోజుల లాభాలకు బ్రేక్

బలహీనంగా అంతర్జాతీయ సంకేతాలు

- 99 పాయింట్లు పతనమై 34,346కు సెన్సెక్స్
- 28 పాయింట్ల నష్టంతో 10,554కు నిఫ్టీ



రెండు వరుస ట్రేడింగ్ సెషన్ల లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) రుణ కుంభకోణం రూ.11,400 కోట్లు కాదని రూ.12,700 కోట్లని పీఎన్‌బీ వెల్లడించడంతో బ్యాంక్ షేర్లు కుదేలయ్యాయి. నేడు(బుధవారం) క్యూ3 జీడీపీ గణాంకాలు వెల్లడి కానుండటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ చీఫ్ జెరోమీ పావెల్ అమెరికా సెనేట్‌లో తొలిసారిగా ప్రసంగించనుండడం(భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి)తో స్టాక్ సూచీలు ఒడిదుడుకులకు గురయ్యాయి. అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా ఉండడం కూడా ప్రతికూల ప్రభావం చూపించింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 99 పాయింట్లు నష్టపోయి 34,346 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 28 పాయింట్లు నష్టపోయి 10,554 పాయింట్ల వద్ద ముగిశాయి.

296 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్

సెన్సెక్స్ 34,559 పాయింట్ల వద్ద లాభాల్లోనే ఆరంభమైంది. ఆరంభంలోనే 165 పాయింట్ల లాభంతో 34,611 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. లాభాల స్వీకరణ కారణంగా 131 పాయింట్ల నష్టంతో 34,315 పాయింట్ల వద్ద కనిష్ట స్థాయిని తాకింది. మొత్తం మీద రోజంతా 296 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. గత రెండు రోజుల్లో సెన్సెక్స్ 626 పాయింట్లు లాభపడింది. పీఎన్‌బీ ప్రకంపనలు ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లపై ప్రభావం చూపించడం కొనసాగుతోందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. భారత 10 ఏళ్ల బాండ్ల రాబడులు పెరగడం, డాలర్ పుంజుకోవడం ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఇక ఈ క్యూ3లో జీడీపీ 7 శాతంగా నమోదవ్వగలదన్న అంచనాలున్నాయని పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	3,234
ఎన్‌ఎస్‌ఈ (ఈక్విటీ)	28,194
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	5,55,471
ఎఫ్ఐఐ	-907
డీఐఐ	1,047

5 సెకన్లకు ఒక వాహన విక్రయం: హోండా



ముంబై: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్‌ఎమ్‌ఎస్‌ఐ) దేశీయంగా ఇప్పటిదాకా మూడున్నర కోట్ల వాహనాలను ఉత్పత్తి చేసి రికార్డు సృష్టించింది. సొంతంగా కార్యకలాపాలు ప్రారంభించిన 17 ఏళ్ల తర్వాత ఈ రికార్డు సాధించామని, టూ వీలర్ పరిశ్రమలో ఈ ఘనత సాధించిన తొలి కంపెనీ తమదేనని హెచ్‌ఎమ్‌ఎస్‌ఐ తెలిపింది. ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడయ్యే టూ వీలర్ బ్రాండ్.. ఆక్టివా ఈ కంపెనీదే. యూనికార్న్, షైన్ తదితర మోటార్ బైక్‌లను కూడా ఈ కంపెనీ విక్రయిస్తోంది. హీరో మోటొకార్ప్‌తో దీర్ఘకాలంగా ఉన్న భాగస్వామ్యానికి వీడ్కోలు పలికి, హోండా మోటార్ కంపెనీకి (జపాన్) వంద శాతం అనుబంధ కంపెనీగా 2001లో ఈ సంస్థ కార్యకలాపాలు ప్రారంభించింది. చక్కటి పురోగమనంతో ఇప్పుడు 'మూడున్నర కోట్ల' యూనిట్ ఉత్పత్తి స్థితికి చేరింది. ఈ ఘనత రాజస్తాన్‌లోని తపుకర ప్లాంట్‌లో తయారైన యాక్టివ 4జీ మోడల్‌కు దక్కింది. ప్రతి 5 సెకన్లకొక కొత్త వినియోగదారుడు హోండా కుటుంబ సభ్యులవుతున్నారని హెచ్‌ఎమ్‌ఎస్‌ఐ ప్రెసిడెంట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ మినొరుకతో ఈ సందర్భంగా చెప్పారు.

జీపీఓఎన్ సెట్‌టాప్ బాక్స్‌ల తయారీ

- డాసన్ నెట్‌వర్క్స్‌తో చేయి కలిపిన సెల్‌కాన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొబైల్, వైర్‌లెస్ సొల్యూషన్స్ సంస్థ సెల్‌కాన్ ఇంపెక్స్, నెట్‌వర్క్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ డాసన్ నెట్‌వర్క్స్‌తో చేతులు కలిపింది. ఈ మేరకు విశాఖపట్నంలో జరిగిన 24వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సెల్‌కాన్ ఇంపెక్స్ ప్రతినిధులు తెలియజేశారు. దీంతో సెల్‌కాన్ ఇంపెక్స్ సొంత పెట్టుబడితో తిరుపతిలోని యూనిట్‌లో డాసన్ భాగస్వామ్యంతో జీపీఓఎన్ టెక్నాలజీ ఆధారిత సెట్‌టాప్ బాక్స్‌లను అభివృద్ధి చేస్తామని తెలియజేసింది. ఫైబర్ ఇన్‌పుట్‌తో నడిచే ఈ సెట్‌టాప్ బాక్స్‌లతో గృహాలకు మెరుగైన సాంకేతికతను అందించే వీలుంటుందని తెలిపింది. దీంతో ఏపీలో 200 మందికి ఉపాధి అవకాశాలొస్తాయని.. భూమి, ఇతరత్రా మౌలిక వసతులను కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని పేర్కొంది.

హైదరాబాద్‌లో యాప్ట్రానిక్స్ సర్వీస్ సెంటర్



సర్వీస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సుతీందర్ సింగ్, మేఘన

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యాపిల్ అధికారిక రిటైల్ మరియు సర్వీస్ సెంటర్ అయిన యాప్ట్రానిక్స్ హైదరాబాద్‌లో అతిపెద్ద సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించింది. మంగళవారమిక్కడ యాప్ట్రానిక్స్ ఫౌండర్ అండ్ ఎండీ సుతీందర్‌సింగ్, సీఈఓ మేఘనసింగ్ ఈ అంతర్జాతీయ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుతీందర్ సింగ్ మాట్లాడుతూ.. ఈ సెంటర్‌లో దేశంలోనే తొలిసారిగా స్క్రీన్ డిస్‌ప్లే రీప్లేస్‌మెంట్ మిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ''ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, ముంబై, కరీంనగర్, విశాఖ, కాకినాడ, విజయవాడల్లో 26 రిటైల్ స్టోర్లు, 8 సర్వీస్ సెంటర్లున్నాయి. ఈ ఏడాది ముగిసే నాటికి 50 స్టోర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యించాం'' అన్నారు. ఈ సెంటర్‌లో యాపిల్ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు లైవ్ జోన్, గేమింగ్ జోన్ వంటివి ఏర్పాటు చేశామని మేఘనసింగ్ తెలిపారు.

జనవరిలో తగ్గిన జీఎస్‌టీ వసూళ్లు

రూ.86,318 కోట్లుగా వెల్లడి

న్యూఢిల్లీ

వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు జనవరిలో స్వల్పంగా తగ్గాయి. రూ.86,318 కోట్లుగా నమోదయ్యాయి. డిసెంబర్‌లో ఈ వసూళ్ల పరిమాణం రూ.86,703 కోట్లు. ఆర్థికశాఖ ఈ మేరకు తాజా గణాంకాలను విడుదల చేసింది. దాదాపు 200 వస్తువులపై జీఎస్‌టీ మండలి పన్ను కోతల నేపథ్యంలో వరుసగా రెండు నెలలు– నవంబర్, అక్టోబర్‌లో తగ్గిన వసూళ్లు డిసెంబర్ 2017లో కొంత పెరిగాయి. ఫిబ్రవరి 25 వరకూ 1.03 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులు జీఎస్‌టీ కింద నమోదయినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. వసూలయిన రూ.86,318 కోట్లలో సీజీఎస్‌టీ ద్వారా రూ.14,233 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ ద్వారా రూ.19,961 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ ద్వారా రూ. 43,794 కోట్లు, ఐజీఎస్‌టీ ద్వారా 8,331 కోట్లు వసూలయ్యాయి.

బ్యాంకుల రుణాల్లో రెండంకెల వృద్ధి

వరుసగా ఐదు త్రైమాసికాల పాటు బ్యాంకుల రుణ వృద్ధి నత్తనడకన కొనసాగగా, డిసెంబర్ త్రైమాసికంలో మాత్రం రెండంకెల స్థాయిలో 10.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ వృద్ధిలో ప్రైవేటు రంగ బ్యాంకులు ముందున్నాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో రుణాల వృద్ధి 6.5 శాతంగా ఉంది. అంతకుముందు జూన్‌లో క్వార్టర్‌లో ఇది 8 శాతం. ''అన్ని వర్గాల ప్రజల్లో రుణ వృద్ధి పుంజుకుంది. ఐదు క్వార్టర్ల తర్వాత రెండంకెలకు చేరుకుంది. ఈ వృద్ధిలో ప్రైవేటు రంగ బ్యాంకులు ముందుండగా, ప్రభుత్వరంగ బ్యాంకులు తమ వంతు పాత్ర పోషించాయి'' అని ఆర్‌బీఐ మంగళవారం విడుదల చేసిన త్రైమాసిక గణాంకాల్లో పేర్కొంది. డిపాజిట్ల సమీకరణ ప్రభుత్వరంగ బ్యాంకుల్లో నామమాత్రంగా ఉండగా, ప్రైవేటు రంగ బ్యాంకులు రెండంకెల వృద్ధిని నమోదు చేశాయి. డిసెంబర్ క్వార్టర్లో మెట్రోపాలిటన్ సిటీల్లోని శాఖల వ్యాపారం 57 శాతానికి చేరుకుంది.

10 లక్షలు దాటితే ఆన్‌లైన్‌లోనే..

పీఎఫ్ విత్‌డ్రాయల్స్‌కి ఈపీఎఫ్‌వో నిబంధన

న్యూఢిల్లీ: ప్రావిడెంట్ ఫండ్ క్లెయిమ్ రూ. 10 లక్షలకు మించితే తప్పనిసరిగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునేలా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) నిర్ణయం తీసుకుంది. అలాగే, ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ 1995 కింద విత్‌డ్రా చేసుకునే మొత్తం రూ. 5 లక్షలు మించినా.. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి కానుంది. ఈ పింఛను పథకం కింద.. పాక్షికంగా కూడా పెన్షన్‌ను విత్‌డ్రా చేసుకునే వీలుంది. ఇందు కోసం ప్రస్తుత నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌తో పాటు మ్యాన్యువల్‌గా కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది.

ఉమంగ్ యాప్ నుంచే పీఎఫ్‌కు ఆధార్ లింక్

ఈపీఎఫ్‌వో సభ్యులు తమ పీఎఫ్ ఖాతాను (యూనివర్సల్ అకౌంట్) ఆధార్‌తో అనుసంధానించుకోవడం మరింత సులభతరం అయింది. ఉమంగ్ యాప్ నుంచి అనుసంధానించుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. సభ్యుల సౌకర్యం కోసం యూఏఎన్–ఆధార్ లింకింగ్ సదుపాయాన్ని ఉమంగ్ యాప్‌లో కల్పించినట్టు ఈపీఎఫ్‌వో తెలిపింది. పలు రకాల ప్రభుత్వ సేవలను ఒకే చోట అందించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఉమంగ్ యాప్‌ను తీసుకువచ్చింది.

ఆ శంకుస్థాపన ఖర్చును పంచుకోండి!

- నవీముంబై ఎయిర్‌పోర్ట్‌పై జీవీకే అభ్యర్థన
- సిడ్కో, జేఎన్‌పీటీలను కోరిన సంస్థ



ముంబై: ఇదివరకెప్పుడూ ఇలాంటి డిమాండ్లు వచ్చి ఉండకపోవచ్చు. కానీ.. నవీ ముంబై విమానాశ్రయ శంకుస్థాపన కార్యక్రమానికైన ఖర్చును తానొక్కదాన్నే భరించలేనని జీవీకే గ్రూపు స్పష్టంచేసింది. ఈ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్న జీవీకే... శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ వచ్చారు కనక... ఆ సందర్భంగా అయిన ఖర్చులో భాగాన్ని పంచుకోవాలంటూ ప్రభుత్వ సంస్థలయిన సిడ్కో, జేఎన్‌పీటీలను కోరింది. శాటిలైట్ సిటీలో జరిగిన భారీ ప్రారంభోత్సవానికి మొత్తం రూ.10.34 కోట్లు ఖర్చు చేసినట్టు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో భాగంగానే ప్రధాని మోదీ జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్‌కు (జేఎన్‌పీటీ) చెందిన నాలుగో టెర్మినల్‌ను కూడా లాంఛనంగా ఆరంభించారు. నవీ ముంబై విమానాశ్రయ ప్రాజెక్టులో జీవీకే గ్రూపు 74 శాతం వాటా కలిగి ఉండగా, మిగిలిన వాటా సిడ్కోకు ఉంది. ముంబై విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీవీకే గ్రూపు రూ.16,000 కోట్లతో కూడిన నవీ ముంబై విమానాశ్రయ అభివృద్ధి కాంట్రాక్టును కూడా దక్కించుకున్న విషయం తెలిసిందే.

వెలిగొండ పనుల్లో టీడీపీ దోపిడీ

- విచారణకు ఆదేశించాలని డిమాండ్
- ఆధారాలు సహా నిరూపిస్తామని ఎమ్మెల్యే గడికోట సవాల్



సాక్షి, హైదరాబాద్: వెలిగొండ ప్రాజెక్టు పనుల్లో భారీగా చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై వెంటనే విచారణకు ఆదేశించాలని వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పనుల్లోని ఒక సబ్‌వర్క్, ఎర్త్‌వర్క్ పనిని అత్యధిక అంచనా వ్యయంతో టీడీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్.కె ఇన్‌ఫ్రా కంపెనీకి సింగిల్ టెండరుగా ప్రభుత్వం కట్టబెట్టిందన్నారు. రూ 5 కోట్లు వ్యయం కాగల ఈ నిర్మాణ అంచనాలను రూ.91 కోట్లకు పెంచి దానిపై మళ్లీ 5 శాతం అధిక (ఎక్సెస్) వ్యయానికి పెంచి మరీ ఇవ్వడమంటే ప్రజా ధనాన్ని దోచిపెట్టడమేనన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో ఆ సంస్థ టీడీపీ విజయం కోసం డబ్బులు కుమ్మరించిందని, అందుకు ప్రతిఫలంగా ఆయనకు ఈ దోపిడీకి టీడీపీ ప్రభుత్వం తెరతీసిందన్నారు. సాగునీటి శాఖ అధికారులే ఇందులో భారీ అవినీతి జరిగిందని లేఖ రాశార న్నారు. గత ఏడాది పని ఇవ్వగా ఆ కంపెనీ వెంటనే 1.90 వేల క్యూబిక్ మీటర్ల హార్డ్‌రాక్‌ను తొలగించినట్లు, బ్లాస్ట్ చేసినట్లు రాసుకుని రూ.14 కోట్లకు బిల్లు చేసుకుందన్నారు. రికార్డు పరంగా ఎంబుక్‌లలో కూడా నమోదు చేయలేదని శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. అంతేగాక మరో 31 వేల క్యూబిక్‌మీటర్లు అదనంగా కూడా చేసినట్లు బిల్లులు పెట్టుకున్నారన్నారు. సాక్షిలో ఈ విషయం వెలుగులోకి వచ్చిన తరువాత సీఎస్ విస్మయం వ్యక్తం చేసి దర్యాప్తుకు ఆదేశించారన్నారు. కానీ మంత్రి మాత్రం తొక్కి పెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులోని ఎస్.ఇ సహకారంతో ఈ బిల్లులను చేశారన్నారు. ఇలా బిల్లులు ఎందుకు చేయాల్సి వచ్చిందని సీఈ, ఎస్ఈకి ఒక మెమో ఇచ్చినా సమాధానం లేదన్నారు. మాట్లాడితే నీతులు చెప్పే మంత్రి దేవినేనికి దమ్మూ ధైర్యం ఉంటే దీనిపై విచారణకు ఆదేశించాలని గడికోట డిమాండ్ చేశారు. విచారణ జరిగితే కాంట్రాక్టరు, ఎస్.ఇ ఇద్దరూ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు.

హోదా కోసం నినదించిన విద్యార్థులు



ప్రత్యేక హోదా కోరుతూ విజయనగరంలో పాదయాత్ర చేస్తున్న విద్యార్థులు



ఏఎన్‌యూలో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులు



కైకలూరు యువభేరిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత కోటగిరి శ్రీధర్

సాక్షి, అమరావతి/ఏఎన్‌యూ/విజయనగరం మున్సిపాలిటీ/కైకలూరు: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా విద్యార్థి లోకం కదం తొక్కుతోంది. మార్చి 5న నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి మద్దతుగా మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో, యూనివర్సిటీల్లో విద్యార్థులు పాదయాత్ర నిర్వహించారు. శ్రీకాకుళం, కర్నూలు మినహా అన్ని జిల్లాల్లో ఈ పాదయాత్రలు జరిగాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సలాంబాబు పేర్కొన్నారు.

నినాదాలతో మార్మోగిన ఏఎన్‌యూ

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిరసన కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సలాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాలల్లో తరగతులు రద్దు చేయించారు. విద్యార్థులతో కలిసి ఇంజినీరింగ్ కళాశాల నుంచి మహాత్మాగాంధీ విగ్రహం మీదుగా వర్సిటీ ప్రధాన ద్వారం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టుకుని ప్రత్యేక హోదా కోరుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మేరుగ కిరణ్ నాగ్, కొలకలూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో భారీ పాదయాత్ర..

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ నాలుగేళ్లుగా చేస్తున్న పోరాటానికి విజయనగరం విద్యార్థులు, యువత మద్దతుగా నిలిచారు. 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి వేలాది మంది విద్యార్థులు, యువత, మేధావులు తరలి రావాలని పిలుపునిస్తూ భారీ పాదయాత్ర నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి అవనాపు విజయ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ నుంచి ప్రారంభమైన ర్యాలీని వైఎస్సార్‌సీపీ నేత మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు.

కైకలూరులో యువభేరి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా కైకలూరులో మంగళవారం యువభేరి జరిగింది. ముఖ్య అతిథిగా ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త కోటగిరి శ్రీధర్ హాజరయ్యారు. కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోటగిరి మాట్లాడుతూ యువకులకు అన్ని రంగాల్లో అవకాశం రావాలంటే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. డీఎన్నార్ మాట్లాడుతూ యువశక్తి పిడికిలి బిగిస్తే సాధించలేనిదంటూ లేదన్నారు.

2016 గ్రూప్2 ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 2016 గ్రూప్2 నోటిఫికేషన్‌కు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం విడుదల చేసింది. వివిధ కేటగిరీలకు చెందిన మొత్తం 441 పోస్టులకు ఎంపికన అభ్యర్థుల సమాచారాన్ని జోన్ల వారీగా కమిషన్ కార్యదర్శి వైవీఎస్‌టీ సాయి ప్రకటించారు. ఈ సమాచారాన్ని కమిషన్ తన వెబ్‌సైట్లో పొందుపరిచింది. ఏపీపీఎస్సీ ఈ గ్రూప్2–2016 నోటిఫికేషన్లో 982 పోస్టులను ప్రకటించింది. దీని ప్రకారం గత ఏడాది జులైలో 15, 16 తేదీల్లో కమిషన్ ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించింది. ఇందులో అర్హత సాధించిన వారి ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీని పూర్తిచేయగా మిగతా నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల ఫలితాలను త్వరలోనే విడుదల చేయనున్నామని కమిషన్ ప్రకటించింది. అయితే ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి న్యాయస్థానాల్లో కొన్ని వ్యాజ్యాలు నడుస్తున్న నేపథ్యంలో వాటి తుదితీర్పులను అనుసరించి ఈ ఎంపికలపై తుది నిర్ణయం ఉంటుందని కమిషన్ స్పష్టం చేసింది. దీంతో పాటు దివ్యాంగులకు సంబంధించిన ధ్రువీకరణలు, ఇతర అంశాలకు సంబంధించి కూడా కొన్ని షరతులతో ఈ ఎంపిక జాబితాను ప్రకటిస్తున్నట్లు కమిషన్ పేర్కొంది. అభ్యర్థులు అందించిన సమాచారం సరైనది కానిపక్షంలో చట్టపరమైన చర్యలు చేపట్టే అధికారం కమిషన్‌కు ఉంటుందని వివరించింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను వారి రిజిస్టర్ నంబర్లతోసహ కమిషన్ తన వెబ్‌సైట్లో పొందుపరిచింది. ఇందులో ఎంపికైన కొందరు అభ్యర్థులకు సంబంధించిన కొన్ని అంశాలపై కమిషన్‌కు సమాచారం అందాల్సి ఉందని, ఆ సమాచారం ప్రకారం వారి ఎంపికలపై తుది నిర్ణయం ఉంటుందని కమిషన్ పేర్కొంది. ఈ పోస్టుల్లో కంప్యూటర్ నైపుణ్య పరీక్ష అవసరమైన పోస్టులకు ఎంపికైన వారికి సంబంధిత టెస్టు ఏప్రిల్ 2నుంచి ప్రారంభం అవుతుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేయనున్నారు.

సర్వే చేయకపోతే తహసీల్దార్లు, ఆర్డీవోలే బాధ్యులు

- డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి
- సర్వే శాఖ ఏడీ, డీడీల తప్పులతో ప్రభుత్వానికి చెడ్డపేరు



సాక్షి, అమరావతి: సర్వే శాఖలో పని చేస్తున్న కొంతమంది ఏడీ, డీడీలు అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, రెవిన్యూ శాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ భూములుగా మార్చిన సంఘటనలు ఉన్నాయన్నారు. కాకినాడ, అడవివరంలో సర్వే రికార్డులను మార్పు చేయడం వల్ల ప్రభుత్వం అప్రతిష్టపాలు కావాల్సిన పరిస్థితి ఎదురైందన్నారు. మంగళవారం విజయవాడలోని ఇరిగేషన్ శాఖ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్న సర్వే శాఖ రెండు రోజుల సమీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (హెచ్‌ఆర్ఎంఎస్) వెబ్‌సైట్‌ను కేఈ ఆవిష్కరించారు. హెచ్‌ఆర్ఎంఎస్‌లో 43,292 ఉద్యోగులకు సంబంధించి పూర్తి డేటాను అందులో పొందుపరుస్తామన్నారు. సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న వారి పనిని 30 రోజుల్లో పూర్తి చేయని పక్షంలో తహసీల్దార్లు, ఆర్డీవోలే బాధ్యులని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మన్మోహన్ సింగ్ మాట్లాడారు.

భగ్గుమన్న సర్వే ఉద్యోగులు: కేఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.చిరంజీవిరావులు, రౌతు రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వే శాఖలో అవినీతి గురించి, ఉద్యోగులు త్వరితగతిన అర్జీలు పరిష్కరించడం లేదన్న వ్యాఖ్యలు సర్వే ఉద్యోగులను తీవ్ర మనోవ్యధకు గురి చేశాయన్నారు. రాష్ట్రంలో 3,500 సర్వేయర్లకు గాను ప్రస్తుతం 600 మంది మాత్రమే ఉన్నారని, ఇంత వ్యత్యాసం ఉంటే పని వేగవంతం ఎలా అవుతుందని ప్రశ్నించారు.

ఏపీఎస్‌ఆర్టీసీకి రెండు జాతీయ అవార్డులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) రెండు జాతీయ అవార్డులను కైవసం చేసుకుంది. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ 62వ వార్షికోత్సవం సందర్భంగా ఈ అవార్డులను ప్రకటించారు. 2016–17 సంవత్సరానికి సంబంధించి పట్టణ సేవల్లో అత్యధిక వాహన ఉత్పాదకత సాధించినందుకు, నగర రవాణాలో అత్యధిక కేఎంపీఎల్ సాధించినందుకు ఈ అవార్డులు లభించాయి. విజయవాడ సిటీ పరిధిలో రోజుకు ఒక్కో వాహనం 335.95 కి.మీ తిరిగినందుకు, అలాగే 3,000 వాహనాలు కలిగిన విభాగంలో విజయవాడ సిటీ ఆపరేషన్స్ అత్యధికంగా 5.23 కేఎంపీఎల్ సాధించినందుకుగాను ఈ అవార్డులు లభించాయి. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఉపరితల రవాణాశాఖ కార్యదర్శి యుధ్‌వీర్ సింగ్ మల్లిక్, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ డా.ఎం.మాలకొండయ్య చేతుల మీదుగా ఏపీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.కోటేశ్వరరావు, కృష్ణా రీజనల్ మేనేజర్ పీవీ రామారావు అవార్డులు అందుకున్నారు.

ఖజానాకు పూడ్చలేని 'లోటు'!

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేయటం తెలిసిందే. ఉద్యోగుల పీఆర్సీ పాత పథకం కిందకే వస్తుంది. ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.5,325 కోట్ల పీఆర్సీ బకాయిలను అందచేసి ఉంటే కేంద్ర ప్రభుత్వం రెవెన్యూ లోటుగా పరిగణనలోకి తీసుకుని ఆ మేరకు భర్తీ చేసేదని అధికార యంత్రాంగం చెబుతోంది.

వ్యయం చేయకుండా లోటు అంటే ఎలా?

ఉద్యోగులకు పీఆర్సీ బకాయిలను రెవెన్యూ లోటుగా పరిగణించాలని ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కోరినా కేంద్ర ఆర్థికశాఖ తిరస్కరించింది. 2014–15లో పది నెలల వ్యవధి రెవెన్యూ లోటునే మాత్రమే భర్తీ చేయనున్నట్లు చెప్పామని, పీఆర్సీ బకాయిలు చెల్లించనందున రెవెన్యూ లోటుగా ఎలా భర్తీ చేస్తామని కేంద్రం ప్రశ్నించినట్లు ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. వ్యయం చేస్తేనే దాన్ని రెవెన్యూ లోటుగా పరిగణిస్తారని, బకాయిల కింద చూపిస్తూ రెవెన్యూ లోటుగా పరిగణించటం కుదరదని అధికార యంత్రాంగం తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పీఆర్సీ బకాయిలు చెల్లించేసి ఉంటే రాష్ట్రానికి రూ.5,325 కోట్లు రెవెన్యూ లోటు భర్తీ రూపంలో ప్రయోజనం చేకూరేదని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

ఇక ఇచ్చేది రూ. 138.39 కోట్లే

విభజన అనంతరం రాష్ట్రపతి పాలన సమయంలో రెవెన్యూ లోటును గవర్నర్ రూ.16,078.76 కోట్లుగా లెక్క కట్టారు. అయితే పది నెలల కాలంలో ఏర్పడిన రెవెన్యూ లోటునే పరిగణనలోకి తీసుకుంటామని కేంద్రం స్పష్టం చేయడంతో రెవెన్యూ లోటు రూ.15,691 కోట్లుగా పేర్కొన్నారు. అకౌంటెంట్ జనరల్ కార్యాలయం రెవెన్యూ లోటు రూ.13,775.76 కోట్లు అని తెలిపింది. అయితే కేంద్రం ఇప్పటి వరకు రెవెన్యూ లోటు కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ. 3,979.50 కోట్లు ఇచ్చింది. రుణమాఫీ, పింఛన్లు, డిస్కమ్స్ పునర్‌వ్యవస్థీకరణకు సంబంధించిన వ్యయాన్ని రెవెన్యూ లోటుగా పరిగణించబోమని తెలిపింది. 2014–15లో పది నెలల సమయానికి రూ.4,117.89 కోట్ల మేర మాత్రమే రెవెన్యూ లోటు ఏర్పడిందని కేంద్ర ఆర్థికశాఖ తేల్చింది. ఇందులో ఇప్పటికే రూ.3979.50 కోట్లు విడుదల చేసినందున ఇక లోటు భర్తీ కింద కేవలం రూ. 138.39 కోట్లు మాత్రమే వస్తాయని, వీటిని త్వరలోనే విడుదల చేస్తామని అరుణ్‌జైట్లీ లేఖ ద్వారా తెలియజేశారు.

ఒకే ఇంటి నుంచి ముగ్గురు డీటీలు



విజయకుమార్‌రెడ్డి



గీతారెడ్డి



అశోక్‌రెడ్డి



వెంకటేశ్వర్లు నాయక్

మార్కాపురం/త్రిపురాంతకం: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) తాజాగా ప్రకటించిన గ్రూప్–2 ఫలితాల్లో ప్రకాశం జిల్లాకు చెందిన ఒకే ఇంటి నుంచి ముగ్గురు డిప్యూటీ తహశీల్దార్లు (డీటీ)గా ఎంపికయ్యారు. ఒకే కుటుంబం నుంచి ముగ్గురు ఎంపిక కావడం విశేషం. మార్కాపురానికి చెందిన వీరిలో చింతలపూడి విజయకుమార్‌రెడ్డి 357.35 మార్కులతో జనరల్ కేటగిరీలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి డిప్యూటీ తహశీల్దార్‌గా ఎంపికయ్యారు. విజయకుమార్‌రెడ్డి భార్య గీతాకుమారి 310 మార్కులతో జోన్–4లో డిప్యూటీ తహశీల్దార్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె అనంతపురం జిల్లా మడకశిర ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్నారు. విజయకుమార్‌రెడ్డి సోదరుడు అశోక్‌కుమార్‌రెడ్డి జోన్–3లో 334 మార్కులు సాధించి డిప్యూటీ తహశీల్దార్‌గా ఎంపికయ్యారు. మార్కాపురంలో ఉంటున్న విజయకుమార్‌రెడ్డి గతంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా ఎంపికై ప్రస్తుతం విశాఖలో పనిచేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో తాము విజయాలను సాధించామన్నారు. గ్రూప్–1 ద్వారా ఆర్డీఓ పోస్టు సాధించటమే లక్ష్యమన్నారు. కాగా, ఎస్టీ క్యాటగిరీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌ను ఇదే జిల్లా త్రిపురాంతకం మండలంలోని చెరువుకొమ్ము తండాకు చెందిన రామావత్ వెంకటేశ్వర్లు నాయక్ సాధించారు. ఆర్ అండ్ బీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

భాగస్వామ్య సదస్సుపై శ్వేతపత్రమివ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్




సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో జరిగిన భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు, పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోందని సీఎం చంద్రబాబు ఊదరగొట్టడం వాస్తవానికి దూరంగా ఉందన్నారు. గతంలో రెండు దఫాలు జరిగిన సదస్సుల్లో రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని చెప్పారని, అయితే వాటి పరిస్థితి ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క అనంతపురంలో కియా కార్ల ఫ్యాక్టరీ ఒక్కటే ఉదాహరణగా చూపిస్తున్నారుగాని, అందులో ఇంకా ఉత్పత్తి కూడా మొదలుకాలేదని గుర్తు చేశారు. కాగా, సీపీఐ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీ ప్రబోద్ పాండా మరణం పట్ల కె.రామకృష్ణ సంతాపం తెలిపారు.

మత్స్యశాఖకు 41.57 కోట్ల నాబార్డు రుణం

సాక్షి, అమరావతి: మత్స్యశాఖకు నాబార్డు రూ.41.57 కోట్ల రుణం మంజూరు చేసిందని ఆ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ కె.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రూ.36.76 కోట్లను కృష్ణా జిల్లాలోని పెనమలూరు ఏర్పాటు చేసే మత్స్యకారుల శిక్షణా కేంద్రానికి, రూ.1.42 కోట్లను చిత్తూరు శిక్షణా కేంద్రం నిర్మాణానికి మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే తీర ప్రాంతాల గ్రామాలను కలిపేందుకు నాలుగు రోడ్ల నిర్మాణానికి రూ.3.38 కోట్లు మంజూరు చేసినట్టు వెల్లడించారు.

పోలవరాన్ని పరిశీలించిన అంచనాల కమిటీ



పనుల వివరాలను అంచనాల కమిటీకి వివరిస్తున్న ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు

పోలవరం: పోలవరం ప్రాజెక్టు అంచనాలపై పూర్తిగా అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను పంపుతామని ఏపీ అంచనాల కమిటీ చైర్మన్ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. అంచనాల కమిటీ సభ్యులు సోము వీర్రాజు, చిక్కాల రామచంద్రరావులతో కలసి మంగళవారం ఆయన పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. వ్యూపాయింట్ వద్ద మ్యాప్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. పనులు జరుగుతున్న తీరును ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ఎస్ఈ వీఎస్ రమేష్‌బాబు వారికి వివరించారు. వేణుగోపాల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. పోలవరం పనుల అంచనాలు సరిగ్గా ఉన్నాయా అనే అంశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఇంకా ఎన్ని నిధులు అవసరం, వచ్చే బడ్జెట్‌లో కేంద్రం ఎంత కేటాయించాలి అనేది అంచనా వేస్తున్నామన్నారు. ముందుగా కమిటీ సభ్యులు పట్టిసీమ పథకాన్ని పరిశీలించారు.

డేటా అనలిటిక్స్‌లో అపార అవకాశాలు

బెల్లాదాటి కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఫిలిప్ లియాంగ్

సాక్షి, అమరావతి: రాబోయే ఇరవై సంవత్సరాల్లో డేటా అనలిటిక్స్‌లో అపార ఉద్యోగ అవకాశాలు ఉండబోతున్నాయని, దీనిపై దృష్టి పెడితే ప్రపంచంలో ఎక్కడైనా పనిచేయవచ్చని సింగపూర్‌కు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ బెల్లాదాటి కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఫిలిప్ లియాంగ్ అన్నారు. మంగళవారం ఆయన అమరావతిలోని వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ)లో విద్యార్థులకు డేటా అనలిటిక్స్‌పై అవగాహన కల్పించారు. ఐఓటీ, డేటా అనలిటిక్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వ్యవసాయం, పర్యాటకం, ఆరోగ్య రంగాల్లో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు.

● తెలంగాణ

కేసీఆర్‌కు తప్పిన హెలికాప్టర్ ప్రమాదం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం కరీంనగర్‌లోని ఉత్తర తెలంగాణ భవన్ నుంచి పెద్దపల్లి పర్యటనకు బయల్దేరే సమయంలో సీఎం హెలికాప్టర్‌లోని ఓ బ్యాగ్ నుంచి వెలువడిన పొగలు కలకలం సృష్టించాయి. ఆ సమయంలో కేసీఆర్ హెలికాప్టర్‌లోనే ఉన్నారు. టేకాఫ్‌కు కొద్ది సమయం ముందు సీఎంవో, సీఎస్‌వో అధికారులు ఈ పొగలను గుర్తించారు. సీఎం సీఎస్‌వో ఎం.కె.సింగ్ ఆ బ్యాగును వెంటనే హెలికాప్టర్ నుంచి బయటకు లాగేశారు. హెలికాప్టర్ సమీపంలో బందోబస్తు నిర్వహిస్తున్న కరీంనగర్ పోలీసు సిబ్బంది ఆ బ్యాగును వేగంగా తీసుకెళ్లి హెలిప్యాడ్‌కు దూరంగా విసిరేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బ్యాగ్‌లోని వైర్‌లెస్ సెట్ ద్వారా పొగలు వచ్చినట్టు తెలుస్తోంది. వైర్‌లెస్ సెట్ బ్యాటరీ వైర్లు కలవడం వల్ల ఓవర్‌హీట్ అయి అకస్మాత్తుగా పొగలు వెలువడినట్లు సమాచారం. హెలికాప్టర్ గాల్లోకి లేవకముందే బ్యాగ్‌ను గుర్తించి కింద పడేయడంతో ప్రమాదం తప్పినట్లయింది. తర్వాత సీఎం షెడ్యూల్ ప్రకారం హెలికాప్టర్‌లో పెద్దపల్లికి చేరుకున్నారు. ఈ ఘటనపై అధికారులు నోరు విప్పడం లేదు. తాజా ఘటనపై పోలీసు, ఇంటెలిజెన్స్ వర్గాలు విచారణ చేపట్టాయి. కాగా, హెలికాప్టర్‌లో పొగలు రావడంపై మంత్రి కేటీఆర్, ఎంపీ కవిత ట్విటర్‌లో స్పందించారు. సీఎం కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరిపామని, కేసీఆర్ క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు.

'దుగరాజపట్నం' పనులు ప్రారంభించండి

కేంద్రానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ వరప్రసాదరావు వినతి



సాక్షి, న్యూఢిల్లీ: నెల్లూరు జిల్లా దుగరాజపట్నం పోర్టు పనులను తక్షణం చేపట్టాలని వైఎస్సార్ సీపీ ఎంపీ వి.వరప్రసాదరావు కేంద్రాన్ని కోరారు. విభజన చట్టం ప్రకారం 2018 చివరినాటికి పోర్టు తొలిదశ పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు పనులు ప్రారంభం కాకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కు వినతిపత్రం సమర్పించారు. పార్లమెంట్‌లో తాను ఈ విషయాన్ని అనేక పర్యాయాలు లేవనెత్తినప్పటికీ కేంద్ర రహదారులు, నౌకాయాన మంత్రి నితిన్ గడ్కారీ సంతృప్తికర సమాధానం ఇవ్వలేదన్నారు. కానీ పోర్టు ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సమాచారం కోసం వేచి చూస్తున్నామని, త్వరలో ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని చెప్పారన్నారు.

మంత్రి పితాని నివాసం వద్ద విద్యుత్ కార్మికుల వంటా వార్పు

డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నందుకు నిరసన



కొమ్ముచిక్కాలలో విద్యుత్ కార్మికుల వంటా వార్పు

పోడూరు: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా కొమ్ముచిక్కాలలో రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖ మంత్రి పితాని సత్యనారాయణ నివాసం వద్ద ధర్నా, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నందుకు నిరసనగా ఈ వంటావార్పు కార్యక్రమం చేపట్టామని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ అధ్యక్షుడు హరికృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 20 ఏళ్లుగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఎన్నో కష్టనష్టాల కోర్చి విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు పార్టీ మ్యానిఫెస్టోలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిందనీ.. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని విస్మరించిందని ధ్వజమెత్తారు. పితాని ఏలూరు నుంచి తన నివాసానికి చేరుకున్న తరువాత విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక నాయకులు మంత్రిని కలసి తమ గోడు వినిపించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా కృషి చేస్తానని మంత్రి పితాని వారికి హామీ ఇచ్చారు.

హోదాతో ఏమొస్తాయి?

▶ మొదటి పేజీ తరువాయి

ఏ జీఓలో ఉందో చూపించమంటే చూపలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. మంగళవారం రాత్రి ఉండవల్లిలోని ప్రజాదర్బార్ హాలులో ఆయన మీడియా సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. హోదా వస్తే పరిశ్రమలకు రాయితీలు వచ్చేస్తాయని కొందరు మభ్య పెడుతున్నారని విమర్శించారు. హోదా వల్ల రాయితీలు వస్తాయని ఏ ఒక్కరూ ఏ జీఓ కూడా చూపించలేకపోతున్నారన్నారు. కానీ ఇతర రాష్ట్రాలకు హోదా కొనసాగిస్తున్నప్పుడు తమకూ దాన్ని ఇవ్వాలని అడుగుతున్నామని చెప్పారు. విభజన చట్టంలో పెట్టిన వాటిని, పార్లమెంటులో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ఇప్పుడు కేంద్రంలో బీజేపీకి పూర్తి మెజారిటీ ఉందని, సంకీర్ణ ప్రభుత్వం ఉండి ఉంటే కొంత ఒత్తిడి చేయడానికి అవకాశం ఉండేదన్నారు. బంద్‌లు, గొడవల వల్ల నష్టం తప్ప ప్రయోజనం ఉండదని, కేంద్రం ఇచ్చిన హామీలు సాధించుకునేందుకు నిర్మాణాత్మకంగా అందరూ కలిసి పోరాడాలని చెప్పారు.

కేంద్రం తన బాధ్యత నెరవేర్చకపోతే ఎలా?

విశాఖలో జరిగిన మూడవ భాగస్వామ్య సదస్సులో గతంలో కంటే నాణ్యమైన ఒప్పందాలు జరిగాయని చెప్పారు. పెట్టుబడులు వస్తున్నాయి కాబట్టి ఇక రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎందుకని బీజేపీ నాయకులు కొందరు అడుగుతున్నారని, అది సరికాదని అన్నారు. పెట్టుబడులు వస్తున్నాయి కదాని కేంద్రం తన బాధ్యత నెరవేర్చకపోతే ఎలాగని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు లేవని చెప్పారు. మళ్లీ కేంద్రంలో ఎవరు అధికారంలోకి వస్తారో తెలియదన్నారు.

నా జీవితంలో ఇది కీలక దశ

దేశంలో సంస్కరణలకు ప్రజామోదం తెచ్చింది తానేనని తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంపై సుదీర్ఘంగా మాట్లాడారు. ప్రస్తుత దశ తన రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైందని గతానికి, ఇప్పటికీ పాలన, రాజకీయ, ఆర్థిక, సామాజికపరమైన మార్పులు గణనీయంగా చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు అబద్ధమంటూ జగన్‌మోహన్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇలావుండగా చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానం వేడుకలను తెలుగుదేశం పార్టీ నేతలు మంగళవారం ఆయన నివాసం వద్ద నిర్వహించారు. నాలుగు దశాబ్దాల ఆయన రాజకీయ జీవితంపై ప్రజాదర్బార్ హాలు వద్ద ఫొటోగ్యాలరీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు తెచ్చిన పసుపు రంగు కేక్‌ను ముఖ్యమంత్రి కట్ చేశారు. కాగా టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ప్రముఖ సినీనటి శ్రీదేవి మృతికి చంద్రబాబుతో పాటు నేతలు సంతాపం ప్రకటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే..

విజయవాడలో వామపక్షాల ధర్నా



మహిళలను బలవంతంగా మెడపట్టుకొని వ్యానుల్లోకి ఎక్కిస్తున్న పోలీసులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ప్రత్యేక హోదా భిక్ష కాదు.. ఆంధ్రుల హక్కు అనే నినాదంతో వామపక్షాలు విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులోని ఆకాశవాణి కేంద్రం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని, విభజన చట్టంలోని హామీలన్నీ అమలుచేయాలని నేతలు నినదించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ, ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తామని చెప్పిన ప్రధాని నరేంద్ర మోదీ.. రాష్ట్ర ప్రజలను దగా చేశారని విమర్శించారు. కేంద్రంలో మోదీ దొంగాట ఆడుతుంటే, రాష్ట్రంలో చంద్రబాబు దోబూచులాడుతున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని కేంద్రంపై పోరాడాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ, చంద్రబాబుకు అసెంబ్లీ నియోజకవర్గాల పెంపుపై ఉన్న శ్రద్ధ, రాష్ట్ర ప్రయోజనాలపై లేదన్నారు. ఇదిలా ఉంటే.. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కార్యకర్తలను సౌత్‌జోన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బలవంతంగా అరెస్టుచేశారు. తీవ్ర పెనుగులాట మధ్య దోనేపూడి శంకర్, సీహెచ్ బాబూరావులతో పాటు, పలువురు మహిళలను అరెస్టుచేసి వేర్వేరు పోలీసుస్టేషన్లకు తరలించారు. కాగా, ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీల కార్యాకర్తలను అరెస్ట్ చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ మంగళవారం ఓ ప్రకటనలో ఖండించింది.

'టెట్'కు వెళ్తూ యువకుడి మృతి

విశాఖ జిల్లా సబ్బవరం మండలంలో ఘటన



పోతురాజు (ఫైల్)

సబ్బవరం (పెందుర్తి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాసేందుకు వెళుతూ ఓ యువకుడు రోడ్డు ప్రమదంలో మృతి చెందాడు. ఈ ఘటన విశాఖ జిల్లా సబ్బవరం మండలంలో చోటుచేసుకుంది. మాకవరపాలెం మండలం పైడిపాల గ్రామానికి చెందిన ముంజేటి పోతురాజు (34), చినరాజుపల్లికి చెందిన దుంగల నాగరాజు (34) ఇద్దరూ స్నేహితులు.. ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసి ఓ ప్రైవేటు అల్యూమినియం కంపెనీలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ పెందుర్తి మండలం చినముషిడివాడలోని పరీక్షా కేంద్రంలో టెట్ రాసేందుకు మంగళవారం ఉదయం బైక్‌పై బయలుదేరారు. ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారిపై బొర్రమ్మగెడ్డ వద్ద వారి ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టారు. దీంతో బైక్ వెనుక కూర్చున్న పోతురాజు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజుకు స్వల్పగాయాలయ్యాయి. సబ్బవరం పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిని చితకబాదిన టీచర్‌పై కేసు



తిరువూరు: కృష్ణాజిల్లా తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్లోని ఒక ప్రైవేటు స్కూలులో యూకేజీ విద్యార్థిని ఉపాధ్యాయురాలు చితకబాదిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. తిరువూరు మండలంలోని మునుకుళ్లకు చెందిన షేక్ మస్తాన్ వలీ కుమారుడు హసన్ తిరువూరు నాగార్జున స్కూలులో యూకేజీ చదువుతున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యం కారణంగా పాఠశాలకు రాని విద్యార్థి సోమవారం వచ్చాడు. పాఠశాల ముగిశాక ఇంటికి వెళ్లగా, స్నానం చేయించే సమయంలో బాలుడి శరీరంపై బెత్తంతో కొట్టిన దెబ్బలు కనిపించడంతో అతని తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులను ఆరాతీశారు. వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో మంగళవారం ఉదయం పోలీసుల్ని ఆశ్రయించారు. ఉపాధ్యాయురాలు లలిత తరగతిగదిలో అసహనంతో హసన్‌ను చితకబాదినట్లు పోలీసుల దర్యాప్తులో తేలడంతో కేసు నమోదు చేశారు. అదేరోజు మరో విద్యార్థిని కూడా లలిత చితకబాదారని తోటి విద్యార్థులు తెలిపారు. చిన్నారిని విచక్షణారహితంగా కొట్టిన లలిత, పాఠశాల యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.



మహిళల 100 మీటర్ల రేసులో ద్యుతీచంద్‌కు స్వర్ణం

స్వదేశీ అథ్లెట్ల మధ్య నిర్వహిస్తున్న ఇండియన్ గ్రాండ్‌ప్రి-1 అథ్లెటిక్స్ మీట్‌లో ఒడిశా స్టార్ క్రీడాకారిణి ద్యుతీచంద్ స్వర్ణ పతకాన్ని సాధించింది. పాటియాలాలో మంగళవారం జరిగిన మీట్‌లో ద్యుతీ... 100 మీటర్ల దూరాన్ని 11.57 సెకన్లలో అధిగమించి విజేతగా నిలిచింది. ప్రస్తుతం ద్యుతీచంద్ తెలంగాణకు చెందిన కోచ్ నాగపురి రమేశ్ వద్ద శిక్షణ తీసుకుంటోంది. ఇదే మీట్‌లో పురుషుల జావెలిన్ త్రోలో ఆసియా చాంపియన్ నీరజ్ చోప్రా పసిడి పతకం గెలిచాడు. అతను జావెలిన్‌ను 82.88 మీటర్ల దూరం విసిరాడు.



కర్ణాటకదే విజయహాసం

- విజయ్ హజారే ట్రోఫీ సొంతం
- ఫైనల్లో సౌరాష్ట్రపై గెలుపు
- మరోసారి మెరిసిన మయాంక్
- పుజారా శ్రమ వృథా

న్యూఢిల్లీ: టెస్టు ఫార్మాట్ రంజీ ట్రోఫీలో, టి20 టోర్నీ ముస్తాక్ అలీలో చక్కగా ఆడినా అదృష్టం కలిసిరాక టైటిల్ గెలవలేకపోయిన కర్ణాటక... వన్డే ఫార్మాట్ విజయ్ హజారే ట్రోఫీని మాత్రం ఒడిసిపట్టింది. తద్వారా ఈ సీజన్‌లో తమ అత్యద్భుత ఆటకు సరైన ముగింపునిచ్చింది. మంగళవారం సౌరాష్ట్రతో ఫిరోజ్ షా కోట్లా మైదానంలో జరిగిన ఫైనల్లో కర్ణాటక 41 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక 45.5 ఓవర్లలో 253 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (79 బంతుల్లో 90; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడైన ఇన్నింగ్స్‌కు తోడు, సమర్థ్ (65 బంతుల్లో 48; 1 ఫోర్, 1 సిక్స్); దేశ్‌పాండే (60 బంతుల్లో 49; 4 ఫోర్లు, 1 సిక్స్) సమయోచితంగా రాణించారు. సౌరాష్ట్ర బౌలర్లలో కమలేశ్ మక్వానా (4/34); ప్రేరక్ మన్కడ్ (2/54) ఆకట్టుకున్నారు. లక్ష్య ఛేదనలో కెప్టెన్ చతేశ్వర్ పుజారా (127 బంతుల్లో 94; 10 ఫోర్లు, 1 సిక్స్) మినహా మరెవరూ నిలవకపోవడంతో సౌరాష్ట్ర 46.3 ఓవర్లలో 212 పరుగులకే ఆలౌటైంది. కర్ణాటక బౌలర్లు ప్రసిధ్ కృష్ణ (3/37), కృష్ణప్ప గౌతమ్ (3/27) రాణించారు. మయాంక్‌కే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

అతడే ఆదాడు...

ఐదు పరుగులకే కెప్టెన్ కరుణ్ నాయర్ (0), కేఎల్ రాహుల్ (0) వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడిన కర్ణాటకను మయాంక్ వీరోచిత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. సమర్థ్‌తో కలిసి స్కోరును ముందుకు నడిపించాడు. కుదురుకున్నాక బౌండరీలు, సిక్సర్లతో చెలరేగాడు. శతకం చేసే ఊపులో కనిపించిన అతడు... ధర్మేంద్ర బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి అవుటయ్యాడు. కొద్దిసేపటికే సమర్థ్ కూడా వెనుదిరిగినా పవన్ దేశ్‌పాండే, శ్రేయస్ గోపాల్ (28 బంతుల్లో 31; 6 ఫోర్లు) విలువైన పరుగులు జోడించారు. అనంతరం పేసర్ ప్రసిద్ధ్ ధాటికి సౌరాష్ట్ర 15 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో కీపర్ బరోట్ (30) అండతో పుజారా అడ్డుగోడలా నిలిచాడు. టీమిండియా ఆటగాడు రవీంద్ర జడేజా (15) సహా మన్కడ్ (0), వసవాదా (0), ఉనాద్కట్ (0)ల వైఫల్యంతో సౌరాష్ట్ర కోలుకోలేకపోయింది. జట్టు స్కోరు 200 వద్ద పుజారా రనౌట్‌గా వెనుదిరగడంతో పరాజయం ఖాయమైంది. ఈ మ్యాచ్‌తో కర్ణాటక లెఫ్టార్మ్ పేసర్, 33 ఏళ్ల శ్రీనాథ్ అరవింద్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.



మయాంక్ రికార్డు

విజయ్ హజారే ట్రోఫీ ఒక సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా మయాంక్ రికార్డు సృష్టించాడు. అతను 8 మ్యాచ్‌ల్లో 723 పరుగులు చేశాడు. గతంలో ఈ రికార్డు 607 పరుగులతో (2016-17) దినేశ్ కార్తీక్ పేరిట ఉండేది. దేశవాళీ క్రికెట్ ఒకే సీజన్‌లో అన్ని ఫార్మాట్‌లలో కలిపి అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాట్స్‌మన్‌గానూ మయాంక్ (2,141 పరుగులు) గుర్తింపు పొందాడు. ఇప్పటిదాకా ఈ రికార్డు ముంబై క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ (1,947 పరుగులు; 2015-16) పేరిట ఉండేది.

ఒక రాజు ఒక రాణి



అరవై నాలుగు గడుల ఆటలో వారి ప్రేమ తొలి అడుగు వేసింది. ఇప్పుడు ఆ బంధం బలపడి ఏడడుగులు వేసేందుకు సిద్ధమైంది. ఒకరి ఎత్తుకు మరొకరు పైఎత్తులు వేసే చదరంగం ఆడుతూనే వారిద్దరు ఒకరి ప్రేమకు మరొకరు చిత్తయ్యారు. దేశం వేరు, సంస్కృతి వేరు. కానీ ఆటతో మొదలైన పరిచయం జీవితకాలపు అనుబంధంగా మారేందుకు మాత్రం అలాంటివేమీ హద్దుగా మారలేదు. భాగ్యనగరానికి, బెల్‌గ్రేడ్‌కు మధ్య ఉన్న ఆరు వేల మైళ్ల దూరాన్ని చెరిపేస్తూ వారిద్దరు పరిణయంతో ఒకటి కాబోతున్నారు. భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ (జీఎం) తెలుగు తేజం పెంటేల హరికృష్ణ, సెర్బియా క్రీడాకారిణి నాడ్జ స్టొయానొవిక్ మధ్య సాగిన ప్రేమ కథ ఇది. భారత్‌కు చెందిన ఒక అంతర్జాతీయ స్థాయి ఆటగాడు విదేశీ వనితను వివాహమాడటం ఇటీవలి కాలంలో ఇదే కావడం విశేషం.

ఒకటి కాబోతున్న చదరంగ జోడీ ● తెలుగు ఆటగాడు పెంటేల హరికృష్ణ ప్రేమ వివాహం
వధువు సెర్బియా క్రీడాకారిణి ● మార్చి 3న హైదరాబాద్‌లో పెళ్లి

సాక్షి, హైదరాబాద్

చెస్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ మార్చి 3న వివాహం చేసుకోబోతున్నాడు. వధువు సెర్బియా దేశానికి చెందిన నాడ్జ స్టొయానొవిక్. హరికృష్ణ 2745 రేటింగ్‌తో ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 20వ స్థానంలో ఉన్నాడు. నాడ్జ గతంలో సెర్బియా జాతీయ జూనియర్ చెస్ చాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత యూరోపియన్ చెస్ యూనియన్‌లో ఆర్బిటర్, మీడియా మేనేజర్‌గా పని చేస్తోంది. చెస్ సర్క్యూట్‌లో మొదలైన వీరిద్దరి పరిచయం ఇప్పుడు పెళ్లి దాకా చేరింది. ఈ నేపథ్యంలో తమ ప్రేమ వివాహం గురించి 'సాక్షి'తో హరికృష్ణ స్వయంగా చెప్పిన విశేషాలు అతని మాటల్లోనే...

'చెస్ క్రీడాకారుడిగా ప్రపంచ వ్యాప్తంగా అనేక పెద్దా, చిన్నా టోర్నీలలో నేను పాల్గొంటుంటాను. సాధారణంగా యూరప్ కేంద్రంగా చుట్టుపక్కల ఉండే దేశాల్లోనే ఇవి ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ క్రమంలో కొంత మందిని తరచుగా కలవడం, వారిలో కొందరు ఆత్మీయ స్నేహితులుగా మారిపోవడం సహజం. ఈ తరహాలో చెస్ సర్క్యూట్‌లో కలిగిన పరిచయం తెలుగు కుర్రాడినైన నా పెళ్లి ఒక సెర్బియా అమ్మాయితో జరగడం వరకు వెళుతుందని అసలు ఎప్పుడూ ఊహించలేదు.

ఉమెన్ ఫిడే మాస్టర్ (డబ్ల్యూఎఫ్ఎం) అయిన నాడ్జ యుగోస్లేవియా దేశంగా ఉన్నప్పుడు జాతీయ జూనియర్ చాంపియన్‌గా నిలిచింది. దాదాపు ఏడేళ్ల క్రితం మేమిద్దరం తొలిసారి పరిచయమయ్యాం. అయితే ఆ తర్వాత మేం పెద్దగా కలుసుకోలేదు. కొంత విరామం వచ్చేసింది. నిజంగా ప్రేమ మొదలైంది మాత్రం దాదాపు రెండేళ్ల క్రితమే. ఆ సమయంలోనే ఒకరి గురించి మరొకరం బాగా తెలుసుకున్నాం. చెస్ గురించి మాట్లాడటం మొదలు పెట్టి ఇష్టా ఇష్టాల వరకు వెళ్లడంతో తెలీకుండానే దగ్గరయ్యాం. నాడ్జకు ప్రయాణాలు చేయడం, కొత్త సంస్కృతులు గురించి తెలుసుకోవడం చాలా ఇష్టం. అదే క్రమంలో ఆమె అప్పటికీ భారత్ గురించి చాలా చదివేసింది. ఇది కూడా నాకు కలిసొచ్చింది. దాంతో ఆమెతో స్నేహంతోనే ఆగిపోకుండా మరింత ముందుకు వెళ్లాలని నిర్ణయించుకొని నేనే పెళ్లి గురించి ప్రతిపాదించాను. ఆమె వెంటనే ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. తల్లిదండ్రులతో చర్చించి కొన్ని నెలల తర్వాత ఓకే చెప్పింది. అప్పుడు నేను మా అమ్మానాన్నలతో ఈ విషయం చెప్పాను. సహజంగానే వెంటనే ఆమోదం ఏమీ లభించలేదు. జీవన శైలి, ఇతర సంప్రదాయాల గురించి వారు బాగా ఆలోచిస్తారు కాబట్టి ఎలాంటి నిర్ణయానికి రాలేదు. దాంతో మెల్లిగా ఒప్పించే ప్రయత్నం చేశాను. సరిగ్గా చెప్పాలంటే నా ప్రయత్నంకంటే కాలమే వారు అంగీకరించేలా చేసింది. దాదాపు ఏడాదిన్నర తర్వాత నా పెళ్లికి వారు ఒప్పుకున్నారు.

నాడ్జ ఆ తర్వాత మా అమ్మా నాన్నలతో మాట్లాడటం, ఇక్కడి విషయాలు, తెలుగు సంస్కృతి గురించి అన్నీ తెలుసుకోవడం జరుగుతూ పోయింది. మన పెళ్లి వీడియోలు కొన్ని చూపించి సంప్రదాయాల గురించి వివరించాను. అంతా కుదురుతున్న తర్వాతే పెళ్లి తేదీని ఖరారు చేశారు. హైదరాబాద్‌లో పెళ్లికి ఆమె తల్లి, సోదరుడు, చెల్లితో పాటు కొందరు ఫ్రెండ్స్ వస్తున్నారు. అనారోగ్యంతో తండ్రి మాత్రం రావడం లేదు. చెస్ ప్రపంచంలో దాదాపు అందరికీ మా ప్రేమ గురించి తెలుసు. వారంతా మమ్మల్ని ప్రత్యేకంగా అభినందించారు. టోర్నీ కారణంగా విశ్వనాథన్ ఆనంద్ పెళ్లికి రాలేకపోతున్నా... ఆయన సతీమణి అరుణ మాత్రం వస్తున్నారు. అనేక మంది భారత, విదేశీ చెస్ ఆటగాళ్లు కూడా హాజరవుతున్నారు. పెళ్లి తర్వాత సెర్బియా రాజధాని బెల్‌గ్రేడ్‌లో విందు జరిగే అవకాశం ఉంది. తరచుగా టోర్నీల్లో పాల్గొనడం కోసం నేను ప్రస్తుతం చెక్ రిపబ్లిక్ రాజధాని ప్రాగ్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్నాను. వివాహానంతరం అక్కడికే వెళ్లిపోతాను. నాడ్జ ఇప్పుడిప్పుడే తెలుగు నేర్చుకుంటోంది. కలిసి చాలా తెలుగు సినిమాలు చూశాం. ఆమెకు పవన్ కళ్యాణ్ అంటే చాలా అభిమానం. ఇష్టపడిన వ్యక్తితో నా ప్రేమ చివరకు పెళ్లి దాకా చేరడం చాలా సంతోషంగా ఉంది.'

పిన్న వయసు కెప్టెన్‌గా...

చరిత్రకు చేరువలో రషీద్ ఖాన్



హరారే: అఫ్గానిస్తాన్ యువ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అత్యంత చిన్న వయసు (19 ఏళ్ల 160 రోజులు)లోనే అంతర్జాతీయ జట్టుకు సారథ్యం వహించిన ఆటగాడిగా రికార్డులకెక్కనున్నాడు. రెగ్యులర్ కెప్టెన్ అస్గర్ స్టానిక్‌జాయ్ కడుపు నొప్పి కారణంగా ఆస్పత్రి పాలవడంతో రషీద్‌కు తమ జట్టు పగ్గాలు చేపట్టే అవకాశం దక్కింది. అఫ్గాన్ మార్చి 4న స్కాట్లాండ్‌తో ప్రపంచకప్ అర్హత మ్యాచ్ ఆడనుంది. దీనికి రషీద్ సారథ్యం వహిస్తాడని అఫ్గాన్ బోర్డు ట్విట్టర్‌లో ప్రకటించింది. ఇప్పటివరకు ఈ రికార్డు రాజిన్ సలే (బంగ్లాదేశ్-20 ఏళ్ల 297 రోజులు; దక్షిణాఫ్రికాపై 2004లో) పేరిట ఉంది. ఇటీవల ప్రకటించిన ఐసీసీ వన్డే, టి20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో రషీద్ నంబర్‌వన్‌గా నిలిచి పిన్న వయసులోనే ఈ ఘనత సాధించిన ఆటగాడయ్యాడు. రషీద్ 37 వన్డేల్లో 86 వికెట్లు, 29 టి20ల్లో 47 వికెట్లు తీశాడు. ఐపీఎల్ 2018 సీజన్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇతడిని 'రైట్ టు మ్యాచ్' కార్డు ద్వారా రూ.9 కోట్లకు దక్కించుకుంది.

వార్మప్‌లో విండీస్‌కు అఫ్గాన్ షాక్

హరారే: ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫయర్ వార్మప్ మ్యాచ్‌లో మాజీ చాంపియన్ వెస్టిండీస్‌కు అఫ్గానిస్తాన్ షాకిచ్చింది. పేసర్ దౌలత్ జద్రాన్ హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టడంతో అఫ్గాన్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 29 పరుగుల తేడాతో విండీస్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 35 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. వర్షం ఆటంకం కలిగించిన ఈ మ్యాచ్‌లో ఒక దశలో అఫ్గాన్ 71 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. టెయిలెండర్లు గుల్బదిన్ నయిబ్ (48; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), సమీవుల్లా షెన్వారి (42; 2 సిక్సర్లు) తొమ్మిదో వికెట్‌కు 91 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. అనంతరం విండీస్ లక్ష్యాన్ని 35 ఓవర్లలో 140 పరుగులుగా నిర్దేశించారు. అయితే గేల్ (9), శామ్యూల్స్ (34; 4 ఫోర్లు)లాంటి సీనియర్లున్న విండీస్ 26.4 ఓవర్లలో 110 పరుగులకే ఆలౌటైంది. ఇన్నింగ్స్ 20వ ఓవర్ వేసిన జద్రాన్ వరుస బంతుల్లో హెట్‌మైర్ (1), పావెల్ (9), బ్రాత్‌వైట్ (0)లను ఔట్ చేసి 'హ్యాట్రిక్' సాధించాడు.

'కేప్‌టౌన్'కు భారత్, దక్షిణాఫ్రికా జట్ల సాయం



జొహన్నెస్‌బర్గ్: తీవ్ర వర్షాభావంతో నీటికి కటకటలాడుతున్న కేప్‌టౌన్‌కు భారత్, దక్షిణాఫ్రికా క్రికెట్ జట్లు 8,500 అమెరికన్ డాలర్లు (రూ.5.52 లక్షలు) విరాళం ప్రకటించాయి. ఈ డబ్బును నగరంలో బాటిళ్లతో నీటి సరఫరా, బోర్లు వేసేందుకు వినియోగిస్తారు. గత శనివారం కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్‌లో మూడో టి20 అనంతరం ఈ మొత్తాన్ని రెండు జట్ల కెప్టెన్లు విరాట్ కోహ్లి, డు ప్లెసిస్‌లు 'గివర్స్ ఫౌండేషన్'కు అందజేశారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్టుతో పాటు మూడో వన్డే, చివరి టి20లకు కేప్‌టౌన్ ఆతిథ్యమిచ్చింది. ఆటగాళ్ల సంతకాలు చేసిన జెర్సీల వేలం ద్వారా నగరంలో నీటి ఎద్దడి నివారణకు నిధులు సేకరించాలని తాను, కోహ్లి చర్చించుకున్నామని డు ప్లెసిస్ చెప్పాడు.



రోహిత్ భరత్ విహారి రికీ భుయ్

భారత 'ఎ' జట్టులో రోహిత్ రాయుడు

భరత్, విహారి, రికీ భుయ్‌లకు చోటు
దేవధర్ ట్రోఫీ కోసం ఎంపిక ● 4 నుంచి 8 వరకు టోర్నీ

ముంబై: దేవధర్ ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో పాల్గొనే భారత్ 'ఎ', 'బి' జట్లను సీనియర్ సెలక్షన్ కమిటీ మంగళవారం ఎంపిక చేసింది. ఈ జట్టులో హైదరాబాద్‌కు చెందిన ఓపెనర్ రోహిత్ రాయుడుకు చోటు దక్కింది. ఇన్నాళ్లు రంజీ జట్లకే పరిమితమైన రోహిత్ రాయుడు తొలిసారి భారత్ 'ఎ' జట్టుకు ఎంపికయ్యాడు. విజయ్ హజారే వన్డే టోర్నీలో అతను 7 మ్యాచ్‌ల్లో 357 పరుగులు చేసి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఆంధ్ర ఆటగాళ్లలో రికీ భుయ్ కూడా 'ఎ' జట్టులో ఉండగా... హనుమ విహారి, కోనా శ్రీకర్ భరత్ 'బి' జట్టుకు ఎంపికయ్యారు. భారత 'ఎ' జట్టుకు అశ్విన్, 'బి' జట్టుకు శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహిస్తారు. ఈ రెండు జట్లతో పాటు విజయ్ హజారే ట్రోఫీ విజేత కర్ణాటక జట్టు దేవధర్ టోర్నీలో తలపడుతుంది. మార్చి 4 నుంచి 8వ తేదీ వరకు ఈ టోర్నీ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇరానీ కప్‌లో పాల్గొనే రెస్టాఫ్ ఇండియా జట్టునూ ప్రకటించారు. దీనికి కరుణ్ నాయర్ సారథ్యం వహిస్తాడు. ఈ మ్యాచ్ వచ్చే నెల 14 నుంచి 18 వరకు జరుగుతుంది. ఇందులో రెస్టాఫ్ ఇండియా... రంజీ చాంపియన్ విదర్భతో తలపడుతుంది.

రిటైరయ్యాక రాజకీయాల్లోకి: వార్నర్

మెల్‌బోర్న్: క్రికెట్ నుంచి రిటైరయ్యాక రాజకీయాలను ఎంచుకునే అవకాశం ఉందని ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ ప్రకటించాడు. ఇతర ఆస్ట్రేలియా ఆటగాళ్లలా కాకుండా తరచూ రాజకీయ నాయకులను కలిసే వార్నర్... ఇటీవల మాట్రవిల్లేలోని తన చిన్ననాటి నివాస ప్రాంతం సమీపాన ఉన్న ఓ పార్కు అభివృద్ధికి నిధులు ఇచ్చేలా దేశ ప్రధాని టోనీ అబాట్‌ను ఒప్పించడం విశేషం.

ముంచడమే మీ నైజం

- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్ సీపీ నేత అంబటి ధ్వజం
- విశ్వసనీయత, విలువలు మీలో ఏ కోశానా లేవు
- 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలకు ఏం ఒరగబెట్టారు?
- చంద్రబాబును తెలుగు జాతి బహిష్కరించాలి



సాక్షి, హైదరాబాద్: నమ్మిన వారిని ముంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నైజమని, ఆయనలో విశ్వసనీయత, విలువలు ఏ కోశానా లేవని వైఎస్సార్ సీపీ రాజకీయ సలహా మండలి సభ్యుడు అంబటి రాంబాబు విమర్శించారు. చంద్రబాబు రాజకీయ ప్రస్థానం ప్రారంభమై నాలుగు దశాబ్దాలు పూరైన సందర్భంగా పత్రికలు, ఛానెళ్లు, ఆయన వల్ల అయాచితంగా లబ్ధిపొందిన వారంతా పుంఖాను పుంఖాలుగా కథనాలు ప్రచురిస్తున్నారని చెప్పారు. 'పదవి కోసం ఎవరినైనా ముంచు..' అనేదే చంద్రబాబు ప్రజలకిచ్చే సందేశమని వ్యాఖ్యానించారు. అంబటి రాంబాబు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నమ్మించు, వంచించు, దోచేయ్ అన్నది చంద్రబాబుకు బాగా తెలిసిన పదాలని, రాజకీయ జీవితాన్ని ఇచ్చిన ఎన్టీఆర్ మరణానికి చంద్రబాబే కారణమన్నారు.

ఊసరవెల్లికీ తర్ఫీదునివ్వగల సమర్థుడు

చంద్రబాబును ఆయన కుటుంబ సభ్యులే నమ్మరని అంబటి పేర్కొన్నారు. హైదరాబాద్‌ను తానే కట్టినట్లు, రింగ్‌రోడ్డు, ఎయిర్‌పోర్టునూ నిర్మించినట్లు, చివరకు ఐటీ, సెల్‌ఫోన్ తెచ్చింది తానేనని సత్య నాదెళ్ల, పీవీ సింధును కూడా తానే తయారు చేశానని చంద్రబాబు నమ్మశక్యం కాని మాటలు చెబుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు మానసిక పరిస్థితిపై గతంలో ఓ వ్యక్తి పుస్తకాలు రాశారని అందులో అన్నీ వ్యతిరేక అంశాలే ఉన్నాయన్నారు. ఇపుడు మాత్రం టీవీల్లో బ్రహ్మాండంగా చెబుతూ చంద్రబాబు భజన చేస్తున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఊసరవెల్లికి కూడా రంగులు మార్చడంలో తర్ఫీదు నివ్వగల ఘనుడన్నారు. ఎన్టీఆర్ తెరపై నటిస్తే.. చంద్రబాబు జీవితంలో నటిస్తూ తెలుగు ప్రజలను వంచిస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక హోదాపై చంద్రబాబు ఈ నాలుగేళ్లలో ఎన్ని మాటలు మార్చారో తెలిసిందేనన్నారు. రాజకీయ అవకాశవాదానికి చంద్రబాబు పరాకాష్ట అని గతంలో 5 ఏళ్లు బీజేపీతో, ఇప్పుడు 4 ఏళ్లు బీజేపీతో బాబు సంసారం చేస్తున్నారని విమర్శించారు.

40 ఏళ్లలో ప్రజలకు ఏం చేశారు?

చీమలు పెట్టిన పుట్టలోకి పాములు చేరినట్లు.. కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి చేరి ఎన్టీఆర్‌ను సైతం మెడ పట్టుకొని బయటకు పంపించిన చరిత్ర చంద్రబాబుదని అంబటి ధ్వజమెత్తారు. నిజాయితీ గురించి ఆయన చెప్పటం హాస్యాస్పదమన్నారు. చంద్రబాబుపై ఉన్న కేసులపై విచారణ జరిగితే ఈ రాష్ట్రంలో ఆయనకు నూకలు చెల్లుతాయన్నారు. చంద్రబాబు నదుల్ని, నిధుల్ని కూడా తాకట్టు పెడతారన్నారు. 40 ఏళ్లలో చంద్రబాబు ప్రజలకు ఏం ఒరగబెట్టారో ఒక్కటైనా చెప్పగలరా? అని ప్రశ్నించారు. వెన్నుపోటు తప్ప ఆయన చేసింది ఏమీ లేదన్నారు. చెడు సంప్రదాయాలను అనుసరిస్తున్న చంద్రబాబును తెలుగు ప్రజలంతా బహిష్కరించాలని పిలుపు నిచ్చారు.

బెంగళూరు జైల్లో 'సైకో' శంకర్ ఆత్మహత్య



'సైకో' శంకర్ (ఫైల్)

బనశంకరి (కర్ణాటక): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రేపిస్ట్, హంతకుడు 'సైకో' శంకర్ అలియాస్ జైశంకర్ (37) జైల్లో గొంతు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమిళనాడులోని సేలంకు చెందిన శంకర్.. గతంలో బెంగళూరు, చుట్టుపక్కల జిల్లాల్లో అనేక మంది మహిళలపై అత్యాచారం చేసి హత్య చేశాడు. శంకర్ ప్రస్తుతం బెంగళూరు పరప్పన అగ్రహార జైల్లో ప్రత్యేక సెల్‌లో శిక్ష అనుభవిస్తున్నాడు. సోమవారం రాత్రి భోజనం చేసే స్టీల్‌ప్లేట్‌నే ఆయుధంగా మలిచి గొంతు కోసుకున్నాడు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యానికి విక్టోరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

కేంద్రం నిర్ణయాలతో పేదలకు వైద్యం దూరం

ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రవీంద్ర



లబ్బీపేట (విజయవాడ తూర్పు): దేశంలో వైద్య విధానాన్ని నీరుగార్చేలా కేంద్రం ప్రవేశ పెడుతున్న బిల్లుల వల్ల పేదలకు వైద్యం దూరమయ్యే ప్రమాదం ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రవీంద్ర వాంఖేడ్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్ ఏర్పాటును నిరసిస్తూ ఆయన ఈ నెల 25న ఐఎంఏ భారత్ యాత్ర ప్రారంభించారు. కన్యాకుమారిలో ప్రారంభమైన యాత్ర సోమవారం రాత్రికి విజయవాడ చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఐఎంఏ ఏపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తన యాత్ర మార్చి 25న ఢిల్లీలో ముగుస్తుందన్నారు. కేంద్రం తక్షణమే నేషనల్ మెడికల్ కమిషన్ ఏర్పాటును ఉపసంహరించుకోవడంతో పాటు, ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారికి ఎగ్జిట్ పరీక్షను ఎత్తివేయాలన్నారు.

'స్విస్'పై సవరణ అఫిడవిట్‌కు అనుమతి

మాజీ సీఎస్ కృష్ణారావు పిల్‌పై సాంకేతికంగా అభ్యంతరం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాజధాని అమరావతి నిర్మాణంలో స్విస్ ఛాలెంజ్ విధానాన్ని సవాల్ చేస్తూ మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు పిల్ దాఖలు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసింది. స్విస్ ఛాలెంజ్ అమలుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణ యాల్లో ఐవైఆర్ భాగస్వామిగా ఉన్నారని, అలాం టప్పుడు ఆయన దీన్ని సవాల్ చేస్తూ పిల్ దాఖలు చేయడం సరికాదని ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ విషయాలను ఆయన తన అఫిడవిట్‌లో ఎక్కడా చెప్పలేదన్నారు. ఈ నేపథ్యంలో దీన్ని పరిగణనలోని తీసుకున్న హైకోర్టు... 'స్విస్ ఛాలెంజ్‌పై నిర్ణయం తీసుకున్నప్పుడు మీరు సీఎస్‌గా ఉన్నారా? లేదా? సీఎస్‌గా ఉంటే ఆ నిర్ణయాల్లో భాగస్వాములా? కాదా? నిర్ణయాల్లో భాగస్వాములైనప్పుడు ఈ వ్యాజ్యం ఎలా దాఖలు చేస్తారు? ఈ విషయాలను మీ అఫిడవిట్‌లో ప్రస్తావించకపోవటం ఎంత వరకు సమంజసం?' అని కృష్ణారావును ప్రశ్నించింది. తాను సీఎస్‌గా పదవీ విరమణ చేసిన తరువాతే స్విస్ ఛాలెంజ్ విషయంలో అత్యధిక నిర్ణయాలు తీసుకున్నారని కృష్ణారావు న్యాయస్థానానికి నివేదించారు. ఈ విషయాలన్నింటినీ పొందుపరుస్తూ సవరణ అఫిడవిట్ దాఖలు చేస్తానని కృష్ణారావు పేర్కొనటంతో అందుకు అంగీకరించిన కోర్టు విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ
నేను శక్తి సాక్షి
విజయవాడ
బుధవారం, 28-2-2018



ఏ స్త్రీకీ లైంగిక హింసకు గురి కావలసిన అవసరం లేదు. ముందసలు తను ఒంటరిని కాదని ప్రతి స్త్రీ గుర్తుంచుకోవాలి.

- సల్మా హైక్, హాలీవుడ్ నటి

ఐశ్వర్యా పిళ్లై

కళ్లు లేవు.. చూపు ఉంది!



● ఐశ్వర్య

కళ్లు అందరికీ ఒకేలా ఉంటాయి. చూడ్డంలోనే భిన్నత్వం ఉంటుంది. పైపైన చూసేవాళ్లుంటారు. లోతుగా చూసేవాళ్లుంటారు. ఫిల్మ్ మేకింగ్‌కైతే లోతుగా చూసి, తేలిగ్గా చెప్పగలిగే కనెక్టివిటీ ఉండాలి.. అంతర్నేత్రానికీ, బహిర్నేత్రానికీ! తేలిగ్గా చెప్పడం అంటే గుండెకు హత్తుకునేలా చెప్పడం. గాఢత ఉంటుంది కానీ, గర్భితంగా ఉండదు! అలాగన్నమాట. సబ్జెక్ట్ ఎంత టఫ్ అయినా ఈజీగా నరాల్లోకి ఇంకిపోయేలా షూట్ చెయ్యాలంటే.. చూసే చూపులో ప్రత్యేకత ఉండాలి. ఆ ప్రత్యేకత ఐశ్వర్యా పిళ్లైకి ఉంది. కానీ.. కళ్లే.. లేవు! అవును. ఈ ఫిల్మ్ మేకర్‌కు రెండు కళ్లూ లేవు. కానీ.. గొప్ప చూపు ఉంది! అందుకే ఈ ఏడాది 'హోల్మన్' అవార్డుకు ఆమెకు ఎంట్రీ లభించింది. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ అంతర్జాతీయ అవార్డుకు ఇండియా నుంచి వెళ్లిన ఒకే ఒక్క ఎంట్రీ ఐశ్వర్యదే. విజేతకు 25 వేల డాలర్ల నగదు బహుమతి లభిస్తుంది. పదహారు లక్షలకు పైగా అమౌంట్! అదొక్కటే కాదు, విజేత కెరీర్‌కు అవసరమైన సహకారం కూడా లభిస్తుంది. అంతకన్నా ముందు ఐశ్వర్యకు మన సహకారం ఉండాలి. మార్చి 7 వరకు జరిగే ఆన్‌లైన్‌లో ఐశ్వర్యకు మనం ఓటెయ్యాలి. The Blind Filmmaker holman అని యూట్యూబ్‌లో కొడితే ఒకటిన్నర నిమిషాల వీడియో వస్తుంది. అది చూస్తే ఐశ్వర్య 'లుక్' ఎంత విలక్షణమైనదో తెలుస్తుంది.

చూపుంటేనే కదా ఫిల్మ్ డైరెక్షన్. కానీ ఐశ్వర్య చేస్తున్నారు కదా.. రెండు కళ్లూ లేకుండా! ఎలా? అనంతమైన అంతర్దృష్టి! హైదరాబాద్‌లోని

> ఐశ్వర్య చూపుకు బ్రేక్ పడింది కానీ, ఆమె కలలకు బ్రేక్ పడలేదు. కళ్లున్నప్పుడు లోకాన్ని చూశాను కాబట్టి కళ్లు లేకున్నా ఆ లోకాన్ని చిత్రీకరించగలను అనుకున్నారు ఐశ్వర్య.

'ఎల్వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్'లో పునరావాస సలహాదారుగా (రిహ్యాబిలిటేషన్ కౌన్సెలర్)గా పని చేస్తున్నారు ఐశ్వర్య. ఫిల్మ్ మేకింగ్ ఆమె కల. అందుకే మాస్ కమ్యూనికేషన్స్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చేశారు. విషాదం ఏంటంటే.. థర్డ్ ఇయర్‌లో ఆమె చూపు పోయింది! అయితే ఆమె చూపుకు బ్రేక్ పడింది కానీ, కలలకు బ్రేక్ పడలేదు. కళ్లున్నప్పుడు లోకాన్ని చూశాను కాబట్టి కళ్లు లేకున్నా ఆ లోకాన్ని చిత్రీకరించగలను అనుకున్నారు ఐశ్వర్య. స్క్రిప్టింగ్.. పోస్ట్ ప్రొడక్షన్.. డైరెక్షన్.. అన్నిటి దగ్గరా తనే కూర్చున్నారు. ఆ పనంతా ఆమె తన టీమ్‌తో కలిసి చేశారు. ఆ 'ఏవీ'ని ఐశ్వర్య సన్నిహితులు 'హోల్మన్' అవార్డుకు పంపారు. అక్కడ విన్ అయితే ఫిల్మ్ మేకింగ్‌లో 'శిక్షణ'ను ప్రారంభించాలని ఆమె ఆకాంక్ష. ఇక ఆమె అంతిమలక్ష్యం.. చూపులేనివారి నైపుణ్యాలతో సమాజానికి దారి చూపించే ఓ మంచి చిత్రాన్ని తియ్యడం.

ఏదైనా మందును కనిపెట్టాక ఎలుకల మీద, పందుల మీద ప్రయోగించి చూస్తారు. దాన్ని ల్యాబ్ టెస్టింగ్ అంటారు. కాసిన్ని రోజులు ఈ మగాళ్ల బుద్ధి మీద కూడా ల్యాబ్ టెస్టింగ్ చేస్తే... వేధింపులకు విరుగుడు మందు కనిపెట్టేందుకు వీలవుతుందేమో!! అప్పుడు మహిళలపై ఈ హెరాస్‌మెంట్‌లు, అత్యాచారాలు తగ్గుతాయేమో! ప్రయోగమేగా.. చేసి చూస్తే ఉపయోగమేగా!

సారీ సిస్టర్



ప్రతీకాత్మక చిత్రం

"ఈ నర్సు చాలా బాగా పని చేస్తుంది. తను డ్యూటీలో ఉంటే మాకు మా అనారోగ్యం విషయమే గుర్తుండదు. వేళకి వచ్చి మందులు అందరూ ఇస్తారు. కాని ఈ నర్సు మాత్రం నవ్వుతూ, కబుర్లు చెబుతూ చేదు మందులు మాతో తాగిస్తుంది, నొప్పి తెలియకుండా ఇంజెక్షన్ చేస్తుంది". నర్సు సమత గురించి ఆ ఆసుపత్రిలో అందరూ అనే మాట ఇది. అలాంటి 'సేవా' సమత జీవితంలోకి ఊహించని కష్టం ఒకటి వచ్చింది. ఆ కష్టాన్ని 'సాక్షి'తో పంచుకుంది.

మాది సాధారణ కుటుంబం. ఇంట్లో అమ్మ, నాన్న, అన్నయ్య, అక్క, నేను ఉంటాం. నాన్న కూలి పని చేస్తారు. అమ్మ ఒక స్కూల్‌లో ఆయాగా పని చేస్తోంది. అన్నయ్య నాన్నతో పాటే కూలి పనికి వెళ్తాడు. అక్కయ్య ఒకరి ఇంట్లో పిల్లల్ని చూసుకునే పనికి కుదిరింది. ఉదయానే వెళ్లి, తిరిగి రాత్రికి ఇంటికి వచ్చేస్తుంది. అందరం కష్టపడితేనే గాని ఇల్లు గడవదు కనుక, నేను కూడా ఉద్యోగం చేయాలని నిశ్చయించుకున్నాను.

చిన్నప్పట్నుంచీ నాకు సేవా మార్గం ఇష్టం. నా అభిరుచిని తెలుసుకుని నాకు నర్స్ ట్రయినింగ్ ఇప్పించారు నాన్న. తెలిసిన వాళ్ల ద్వారా విజయవాడలోని ఒక ప్రముఖ ఆసుపత్రిలో నర్సుగా చేరాను. నా మనసుకి నచ్చిన పని దొరకడం వల్ల, అందరికీ నచ్చేట్లు సేవ చేసే భాగ్యం దొరికింది నాకు. ఉద్యోగంలో చేరిన ఏడాదికే ప్రమోషన్ వచ్చింది. జీతం కూడా పెరిగింది. మా ఇంటి పరిస్థితి కూడా కొద్దికొద్దిగా మెరుగుపడుతూ వచ్చింది. మా ఆసుపత్రి యజమాని.. సిబ్బందిని బాగా చూసుకునేవారు.

> తప్పు చేస్తున్న అతడు నా నుంచి తప్పించుకోవాల్సింది పోయి, ఏ తప్పూ చేయని నేను అతడి నుంచి తప్పించుకోవాల్సి వస్తోంది!

అందుకే ఏ సమస్య, ఇబ్బంది వచ్చినా ఆయనకు నేరుగా చెప్పుకునేవాళ్లం. ఆయనే పరిష్కరించేవారు. అవసరం అయితే డబ్బు సహాయం కూడా చేసేవారు. అక్కడ బాగా సౌకర్యంగా ఉండటంతో, ఎంతో హుషారుగా ఉద్యోగం చేసుకుంటున్నాను. ఇలా మూడు సంవత్సరాలు గడిచాయి.

• ❖ •

ఉద్యోగం సాఫీగా సాగుతున్న ఆ సమయంలో.. మా హాస్పిటల్ లేబరేటరీలో రమేశ్ (పేరు మార్చాం) అనే వ్యక్తి టెక్నీషియన్‌గా చేరాడు. వాస్తవానికి నర్సులకి, ల్యాబ్ వాళ్లకి సంబంధం ఉండదు. కాని అతడు కావాలని మా వార్డుకి వస్తుండేవాడు. ఏదో ఒకటి కల్పించుకుని నాతో మాట్లాడటానికి ప్రయత్నించేవాడు. నేను స్పందించకపోతే, డబుల్ మీనింగ్ మాటలతో నన్ను వేధించేవాడు. తనని పెళ్లి చేసుకొమ్మని సతాయించేవాడు. అప్పటికే అతడికి పెళ్లి అయ్యి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనవసరంగా గొడవ పడటం ఎందుకని, ''నీకు పెళ్లి అయ్యింది. పిల్లలు కూడా ఉన్నారు, ఇలా ప్రవర్తించడం సరికాదు'' అన్నాను. వినలేదు. గట్టిగా చెప్పాను. వినలేదు. తిట్టాను. వినలేదు. ఎంత చేసినా అతడు నన్ను వేధించడం మానలేదు. ఎవరికైనా ఫిర్యాదు చేద్దామంటే, నా దగ్గర సాక్ష్యాధారాలు ఉండాలి. 'ఇలా అన్నాడు' అని ఒక స్త్రీ చెబితే నమ్మే లోకమా ఇది! పైగా ఆమెకే తప్పును అంటకడుతుంది.

• ❖ •

రోజులు గడుస్తున్నాయి. తప్పు చేస్తున్న అతడు నా నుంచి తప్పించుకోవాల్సింది పోయి, ఏ తప్పూ చేయని నేను అతడి నుంచి తప్పించుకోవాల్సి వస్తోంది! హాస్పిటల్‌కి రావడానికే భయం వేసేంతగా అతడు నన్ను హడలుకొట్టేస్తున్నాడు. నాకెంతో ఇష్టమైన ఉద్యోగాన్ని కూడా అతడు చేసుకోనివ్వడం లేదు. మనశ్శాంతి కరువైంది. స్టాఫ్ కూడా నన్ను గమనించారు. ''ఏంటి.. సమతా అలా ఉంటున్నావు?'' అని అడిగారు. ఏం లేదన్నాను. చెప్పుకునే విషయమా అది. కానీ చెప్పుకోక తప్పని పరిస్థితి వచ్చింది. ఆ పరిస్థితిని అతడే తీసుకొచ్చాడు.

• ❖ •

ఓరోజు రాత్రి నేను డ్యూటీలో ఉన్నాను. ఏదో పని ఉన్నట్లుగా అతడు మా వార్డుకి వచ్చాడు. మాట్లాడుతూ మాట్లాడుతూ.. నా నడుం మీద చెయ్యి వేశాడు! చేతిని విసిరికొట్టాను. మళ్లీ అలాగే చేయబోయాడు. తీవ్రంగా ప్రతిఘటించాను. అయినా వదల్లేదు. నన్ను గట్టిగా హత్తుకోబోయాడు. అతడి అసభ్య ప్రవర్తన తట్టుకోలేకపోయాను. ఉపేక్షించి లాభం లేదనుకుని, చెప్పుతో చెంప ఛెళ్లుమనిపించాను.

దాంతో అతడి ఇగో దెబ్బతిన్నట్లుంది. ఊహించని విధంగా, పక్కనే ఉన్న పూల కుండీని ఎత్తి నా తలపై కొట్టాడు. నేను కళ్లు తిరిగి పడిపోయానని, అతడు అక్కడ నుంచి పారిపోతుంటే తామే పట్టుకున్నామని నా తోటి నర్సులు, మిగతా వార్డు బాయ్స్ ఆ తర్వాత చెబితే తెలిసింది. నేను స్పృహలోకి వచ్చాక అక్కడే ఉన్న మిగతా సిబ్బంది నన్ను ఎమర్జెన్సీ వార్డుకి తీసుకువెళ్లారు. చికిత్స చేయించారు. ఇంత గొడవ జరగడంతో విషయం మా పైఅధికారులకు తెలిసింది. తక్షణమే అతడిని ఉద్యోగంలో నుంచి తొలగించి పోలీసులకు అప్పగించారు.

అతడి భార్యబిడ్డలు వీధులపాలవుతారనే ఉద్దేశంతో అన్ని రోజులు నేను ఓపిక పట్టాను. అతడి ప్రవర్తన రానురాను భరించలేని స్థితికి రావడంతో, తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసుల వరకు వెళ్లవలసి వచ్చింది.
(సమత కేస్ స్టడీ)

- వైజయంతి

యాజమాన్యం గమనిస్తుండాలి



ప్రతి సంస్థలోను లైంగిక వేధింపుల నిరోధక కమిటీ ఉండాలి. అది ప్రభుత్వ సంస్థ అయినా, ప్రభుత్వేతర సంస్థ అయినా ప్రతిచోట తప్పనిసరిగా ఉండాలి. అందులో సంస్థ ఉద్యోగులతో పాటు, ఎన్జీవో సంస్థల నుంచి ఒకరు కౌన్సెలర్‌గా ఉండాలి. ఈ కేసులో నర్సు సమత తలపై ల్యాబ్ టెక్నీషియన్ పూలకుండీ ఎత్తి పడేసేవరకు వచ్చింది! ముందుగానే పర్యవేక్షణ వ్యవస్థ ఉండి ఉంటే, ఇంతవరకూ వచ్చేది కాదు. స్త్రీలను లైంగికంగా వేధిస్తే, ఎటువంటి శిక్షలు పడతాయో వాటి మీద మగ ఉద్యోగులకు యాజమాన్యమే అవగాహన కలిగేలా చేయాలి. అప్పుడు తప్పు చేయడానికి భయపడతారు.

- **'అంకురం' సుమిత్ర,** సామాజిక కార్యకర్త

విచారణ వెంటనే ప్రారంభించాలి



ఆడవాళ్ల విషయం వచ్చేటప్పటికి.. నిప్పు లేనిదే పొగరాదనే సమాజం మనది. ఫిర్యాదు చేసినా బాధితురాలినే అనుమానిస్తారు. 'నిన్ను లైంగికంగా వేధించాడంటే, నువ్వు ఆ వ్యక్తిని ప్రోత్సహించడం వల్లే జరిగింది' అని కూడా నిందిస్తారు. మరికొందరు.. 'ఇష్టం లేని విషయాలను నేను పట్టించుకోకుండా తిరిగితే నా జోలికి రారు. నా రిజెక్షన్ అర్థం చేసుకున్నారు, వ్యతిరేకించడం కంటే ఇదే మేలు' అనే భ్రమలో ఉంటారు. 'నేను తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగం చేస్తున్నాను' అనుకుని ఫిర్యాదుకు జంకేవారు మరికొందరు. సాధారణంగా ఏదైనా ఇబ్బంది వస్తే ముందుగా కుటుంబ సభ్యులతోనో, స్నేహితులతోనో చెప్పుకుంటారు. అంతా విన్నాక వారు... 'చిన్నచిన్న' విషయాలు పట్టించుకోవద్దు అని తేల్చేస్తారు. 'ఇంత చిన్న విషయాన్ని ఇష్యూ చేస్తే మన ఇన్‌స్టిట్యూట్‌కు చెడ్డపేరు వస్తుంది' అంటారు కంపెనీ పెద్దలు. అవతలివారు అసభ్యంగా మాట్లాడుతుంటే, 'నాకు ఇష్టం లేదు' అని చెప్పడం 'చిన్న విషయం' కాదు 'పెద్ద విషయం' అని తెలియచెప్పాలి. అలా చెప్పకపోగా ఈ సంఘటనను ఎవ్వరూ ఖండించరు. దాంతో ఫిర్యాదు చేయకుండా మౌనంగా ఉండిపోయే పరిస్థితి వస్తుంది.

'సెక్సువల్ హెరాస్‌మెంట్ ప్రివెన్షన్ కమిటీ' ప్రతి ఆఫీసులోనూ ఉండాలనే చట్టం ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉండడం కూడా ఇందుకొక కారణం. ఏదైనా కారణం చేత ఆలస్యంగా ఫిర్యాదు చేస్తే, 'అప్పుడెందుకు ఫిర్యాదు చేయలేదు, ఇప్పుడెందుకు చేస్తున్నావు?' అని ప్రశ్నించకూడదు. ఎప్పుడు ఫిర్యాదు చేశారు అనేది ప్రధానం కాదు. రిపోర్టు ఇచ్చిన వెంటనే విచారణ చేయాలి.

- **దేవి,** సాంస్కృతిక కార్యకర్త

చెట్టు నీడ

ఒక నీటిచుక్క పాఠం

అదొక బౌద్ధాశ్రమం. ఒక జెన్ మాస్టర్ స్నానం చేయడానికి వేడినీటిని తొట్టిలోకి వంపుకున్నాడు. ఆ వేడినీటిలో కలపడానికి కొన్ని చన్నీళ్లు తెమ్మని శిష్యుడిని పురమాయించాడు.

శిష్యుడు బావి నుంచి చేదుకుని ఒక కుండలో నీళ్లు తెచ్చాడు. వాటిని వేడినీటి తొట్టిలో పోస్తూ, చేతితో వేడిని అంచనా వేస్తూ, గోరువెచ్చగా అయ్యేదాకా పోశాడు. అలా పోయగా అడుగున కొన్నినీళ్లు మిగిలిపోయినై. వెంటనే వాటిని నేలమీద పారబోశాడు. అది గమనించిన, జెన్ మాస్టర్‌కు ఆగ్రహం వచ్చింది.

> 'ఆ నీటిని నువ్వు అక్కడవున్న చామంతి చెట్టుకు పోసివుండొచ్చుకదా?' మళ్లీ అన్నాడు గురువు. తను చేసిన తప్పేమిటో తెలిసివచ్చి సిగ్గుపడ్డాడు శిష్యుడు.

'ఆ నీటిని అలా అనాలోచితంగా ఎందుకు పారబోశావు?' అడిగాడు గురువు.

దానికి శిష్యుడి నుంచి మౌనమే సమాధానంగా వచ్చింది.

'ఆ నీటిని నువ్వు అక్కడవున్న చామంతి చెట్టుకు పోసివుండొచ్చుకదా?' మళ్లీ అన్నాడు గురువు.

తను చేసిన తప్పేమిటో తెలిసివచ్చి సిగ్గుపడ్డాడు శిష్యుడు. 'గురువర్యా! మీరు చెప్పిన ఈ పాఠాన్ని నేను జీవితాంతం గుర్తుంచుకుంటాను. అలా గుర్తుంచుకునేలా ఈ రోజునుంచీ నా పేరును 'తెకుసుయి'గా మార్చుకుంటున్నాను' అని స్థిరంగా జవాబిచ్చాడు. తెకుసుయి అంటే ఒక నీటిచుక్క.

గురువు సంతృప్తిగా స్నానం చేయడానికి తొట్టిలోకి దిగాడు.

ఒక విలువైన పాఠం నేర్చుకోవడానికి ఒక జీవితం మొత్తాన్ని అంకితం చేస్తేనేమి!

స్నాచింగ్

తాళిబొట్టు కోసం యముణ్ణి వెంటాడినట్టు వెంటాడింది!



● సౌమ్య



కేరళలోని కొల్లం జిల్లా, తెవలక్కార పట్టణం. సౌమ్య 28 ఏళ్ల యువతి. చక్కగా చురుగ్గా ఉంటుంది. భర్త టైలర్. ఇద్దరు పిల్లలు. శోభన ఐదవ తరగతి, సోనా మూడవ తరగతి. గడచిన వారం వరకు ఆమెను అందరూ ఓ సాధారణమైన సేల్స్‌గాళ్, ఇద్దరు బిడ్డల తల్లిగానే గుర్తించారు. ఇప్పుడామె కొల్లం జిల్లాలోనే సెలబ్రిటీ. సినిమా తారల కంటే ఎక్కువ క్రేజ్ ఆమెకిప్పుడు. కన్నుగీటి ఓవర్‌నైట్ సెలబ్రిటీ అయిన ప్రియాప్రకాశ్ వారియర్ కంటే ఈ వారియరే ఇప్పుడు అక్కడ ఫేమస్. సీన్ అంతగా మలుపు తిరగడానికి ఆమె ఏం చేసింది?

సినిమా షూటింగ్‌ను తలపిస్తూ చేజ్ చేసింది. చైన్ స్నాచర్స్‌ను ఒడిసి పట్టుకుని చాచి కొట్టింది. తన తాళిమాల(మంగళసూత్రం)ను తెచ్చుకుంది.

ఉద్యోగం నుంచి సాయంత్రం తన స్కూటీ మీద ఇంటికి వస్తున్నప్పుడు సౌమ్యను ఒక బైక్ వెంబడించింది. బైక్ మీద ఇద్దరు యువకులు ఆమె పక్కగా బండిని పోనిస్తూ ఆమె మెడలోని తాళిబొట్టు దండను లాక్కున్నారు. క్షణకాలం పాటు ఆగిపోయిన సౌమ్య వెంటనే తేరుకుంది. దారిన పోయే వారికి ఏం జరిగిందో తెలిసేలా 'దొంగ... దొంగ... పట్టుకోండి' అని అరుస్తూ స్కూటీ మీద గొలుసు దొంగలను వెంబడించింది. 'దాదాపుగా

> "నాకు తాళిమాల చాలా విలువైంది. దానిని లాక్కుపోతే చూస్తూ ఎలా ఉండను? దండ లేకుండా ఇంటికి వెళ్లేది లేదు" అనుకున్నాను. అందుకే వెంబడించాను.

మూడున్నర కిలోమీటర్ల దూరం వెంబడించి వారి బైక్ ను ఓవర్‌టేక్ చేసి వారి ఎదురుగా వచ్చింది. ఆ వేగంలో ఆమె స్కూటీ బైక్‌ను ఢీకొడుతూ ఆగింది. పరుగున వచ్చిన వారు, ఏం జరుగుతుందో తెలియకపోయినా సరే అరుపులతో గుమిగూడిన వారు బైక్ నడుపుతున్న యువకుడిని ఒడిసి పట్టుకున్నారు. సౌమ్య అతడి ముఖం మీద పిడిగుద్దులు గుద్దింది. చైన్ ఉన్న వాడు మాత్రం తప్పించుకుని పారిపోయాడు. ఈ లోపు కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వాళ్లు కూడా రంగంలో దిగారు. పారిపోతున్న దొంగను నిమిషాల్లోనే పట్టుకున్నారు. సౌమ్య దండ సౌమ్యకు చేరింది. కథ సుఖాంతం.

''మెడలోని దండను వాళ్లు లాక్కుపోతే వెంబడించడానికి అంత ధైర్యం ఎలా వచ్చింది? అంత దూరం బండి మీద దొంగలను పట్టుకోవడానికి వెళ్లడమంటే చిన్న విషయం కాదు. నువ్వు చేసింది ఎంతటి సాహసమో తెలుసా?'' అని ప్రశంసాపూర్వకంగా అడిగిన వాళ్లకు ఆమె చెప్పిన సమాధానం ఏంటో తెలుసా? ''నాకు తాళిమాల చాలా విలువైంది. దానిని లాక్కుపోతే చూస్తూ ఎలా ఉండను? దండ లేకుండా ఇంటికి వెళ్లేది లేదు'' అనుకున్నాను. అందుకే వెంబడించాను. ఎలాగైనా వాళ్లను పట్టుకుని దండతోనే ఇంటికి వెళ్లాలనే కసితో వెంబడించాను. అందుకే భయం వేయలేదు'' అంటోంది.

'అమ్మాయిలంటే ఇలా ఉండాలి' అని కేరళలో తల్లిదండ్రులు తమ పిల్లలకు సౌమ్యను రోల్‌మోడల్‌గా చూపిస్తున్నారు ఇప్పుడు. కేరళకే కాదు, సౌమ్య మొత్తం దేశానికే మోడల్ ఉమన్.

- మంజీర


నాగార్జున

భయపెట్టే పోలీస్

మాములోడు కాదు ఈ ఆఫీసర్. జర డిఫరెంట్. అన్యాయం అనిపిస్తే చాలు గన్‌తోనే సమాధానం చెబుతాడు. అదెలాగో స్క్రీన్‌పై చూడాల్సిందే. నాగార్జున హీరోగా కంపెనీ పతాకంపై సుధీర్ చంద్రతో కలిసి రామ్‌గోపాల్ వర్మ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న సినిమాకు 'ఆఫీసర్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. ''శ్రీదేవి చుట్టూ ఉన్న నెగిటివిటీ తర్వాత నా సినిమా టైటిల్ అండ్ ఫస్ట్ పోస్టర్స్‌తో అంతా పాజిటివిటీ రావాలని కోరుకుంటున్నాను. మై మోస్ట్ యాంబిషియస్ ఫిల్మ్ విత్ నాగార్జున'' అంటూ రామ్‌గోపాల్ వర్మ ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్ట్‌ను నాగార్జున ట్యాగ్ చేస్తూ– ''నువ్వేం చెబుతున్నావో నాకు తెలుసు. 'అనుకున్నామని జరగవు అన్నీ.. అనుకోలేదని ఆగవు కొన్ని' అనే ఫేమస్ సాంగ్ గుర్తొస్తోంది'' అని పేర్కొన్నారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌పై 'కాప్స్ వేర్ నెవర్ దిస్ స్కేరీ' అనే లైన్ ఉంది. ఇందులో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా నాగార్జున కనిపించనున్నారు. సినిమాను మే 25న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. నిజానికి ఈ సినిమా టైటిల్ అండ్ లుక్‌ను ఆదివారమే రిలీజ్ చేయాల్సింది కానీ హీరోయిన్ శ్రీదేవి హఠాన్మరణంతో వాయిదా వేశారు.

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్

ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! నేను ఒక స్టూడెంట్‌ని. నా చిన్నప్పటి ఫ్రెండ్ అంటే నాకు చాలా ఇష్టం. టెన్త్ తరువాత ఇద్దరం విడిపోయాం. మళ్లీ గ్రాడ్యుయేషన్ టైమ్‌లో ఫేస్‌బుక్ ద్వారా దగ్గరయ్యాం. కొన్నాళ్లు చాటింగ్‌లు, కాల్స్ నడిచాయి. తను నన్ను చాలా మోటివేట్ చేసేది. నా పట్ల తన కేరింగ్ చూసి, తనంటే ఇష్టం మరింత పెరిగింది. చివరికి ఒకరోజు తన వాట్సాప్ స్టేటస్ చూసి, తను ఎవరినో ఇష్టపడుతోందని తెలిసింది. ఆ వ్యక్తి అంటే తనకు ఇంట్రెస్ట్ అని, తనతో చాలా హ్యాపీగా ఉంటానని చెప్పింది. దాంతో చాలా డిస్టర్బ్ అయ్యాను. దీన్ని నా మనసుకి ఎలా తీసుకోవాలో అర్థం కావడంలేదు. నాకు చాలా గోల్స్ ఉన్నాయి. ఈ విషయం తెలిసినప్పటి నుంచీ దేనిపైనా దృష్టి పెట్టలేకపోతున్నాను. మళ్లీ నేను నార్మల్ అవ్వాలంటే ఏం చెయ్యాలి?

– వాసు

అమ్మాయికి నిజం చెప్పెయ్యాలి.

'ఎలా చెప్పాలి సార్?'

ఉత్తరం రాయాలి..

'పొండి సార్, ఉత్తరం ఏంటి? మెయిల్ పెట్టమందాం. ఏం రాయాలి సార్? మీరే రాయండి సార్, వాసు కటింగ్ పేస్టింగ్ చేసుకుంటాడు సార్!'

డియర్ ప్రియురాలా, నువ్వు ఒకడిని ప్రేమిస్తున్నావు. బాగా లవ్వేస్తున్నావు. విపరీతంగా హ్యాపీ అవుతున్నావు. కానీ నీకు ఒక విషయం చెప్పాలి. నేను నిన్ను ప్రేమించినంతగా ఏ లవర్ ప్రేమించలేదు. అది ఎలా అనుకుంటున్నావా? నువ్వు ఇంకొకరి ప్రేమలో సంతోషంగా ఉన్నావని నేను నీ సంతోషాన్ని సంతోషంగా సంతోషిస్తున్నాను చూడూ.. అది నిజమైన లవ్. నువ్వు అలాగే సంతోషంగా సంతోషిస్తూ ఉండు. నీ సంతోషాన్ని నేను ప్రేమిస్తూ సంతోషంగా ఉంటాను..!

ఇట్లు,
నీ స్కూల్ లవర్,
వాసు.

'సార్ ఎంత డీప్ లవ్ సార్ వాసుది. కటింగ్ పేస్టింగ్ చేస్తే అమ్మాయి గాలి మళ్లచ్చు సార్!' అని నవ్వింది నీలాంబరి.

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

డోన్ట్ వర్రీ!


రవితేజ

.... హీరో రవితేజకు సెట్‌లో ఎటువంటి ప్రమాదం జరగలేదు అని అభిమానులకు భరోసా ఇచ్చారు దర్శకుడు కల్యాణ్‌కృష్ణ. రవితేజ హీరోగా ఆయన దర్శకత్వంలో ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామ్ తాళ్ళూరి ఓ సినిమా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ స్పాట్‌లో బైక్ చేజింగ్ స్టంట్ చేసిన రవితేజ ప్రమాదవశాత్తు గాయపడ్డారని, రెండు నుంచి మూడు వారాల సమయం పాటు విశ్రాంతి తీసుకోమని ఆయనకు డాక్టర్లు సూచించారని ఇండస్ట్రీలో వార్తలు వినిపించాయి. ఈ వార్తల్లో నిజం లేదని దర్శకుడు కల్యాణ్‌కృష్ణ పేర్కొన్నారు. ''రవితేజగారికి ఏమైంది? ఆయన గురించి చాలా వార్తలు వస్తున్నాయి?'' అని ఓ అభిమాని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ''ఏమీ జరగలేదు. ఆ వార్తల్లో నిజం లేదు. డోన్ట్ వర్రీ. ఆయన పర్ఫెక్ట్'' అని ఆ అభిమాని పోస్ట్‌కు స్పందించారు కల్యాణ్ కృష్ణ. ఇందులో మాళవిక వర్మ కథానాయిక. ఈ సినిమాకు 'నేల టిక్కెట్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని ఫిల్మ్‌నగర్ టాక్.

సూపర్ చార్జ్‌డ్!

ఎనర్జీకి ఎగ్జామ్‌పుల్‌గా ఉంటారు హీరో రామ్. ఆ ఎనర్జీతో సిల్వర్‌స్క్రీన్‌పై మరోసారి మ్యాజిక్ చేయడానికి రెడీ అవుతున్నారాయన. 'నేను లోకల్' ఫేమ్ నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో రామ్ హీరోగా ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ మార్చి 8న స్టార్ట్ కానుంది. ''నా నెక్ట్స్ సినిమా మార్చి 8న స్టార్ట్ కానుంది. సూపర్ చార్జ్‌డ్'' అని పేర్కొన్నారు హీరో రామ్. బ్యూటీఫుల్ లవ్ స్టోరీగా రూపొందనున్న ఈ సినిమాలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్ అని సమాచారం.


రామ్

ది కూల్ మామ్

శ్రీదేవి చివరి యాడ్ ఇదే?

'ఇంగ్లిష్ వింగ్లిష్' తర్వాత శ్రీదేవి నటించిన 'మామ్' కూడా సూపర్ హిట్ అయిన విషయం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. విశేషం ఏంటంటే.. శ్రీదేవి ఫుల్ లెంగ్త్ రోల్ చేసిన లాస్ట్ మూవీ 'మామ్' అయితే.. చివరి యాడ్ కూడా 'మామ్' పేరుతోనే ఉంది. సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన దానిని బట్టి, శ్రీదేవి నటించిన లాస్ట్ యాడ్ 'ది కూల్ మామ్'. 2 నిమిషాల 30 సెకన్లు నిడివిగల ఈ యాడ్‌లోని కొంత


'ది కూల్ మామ్' యాడ్‌లో శ్రీదేవి

భాగం ఇంటర్‌నెట్‌లో వైరల్‌గా మారింది. ఇది చిన్నారులను ఉత్తేజపరిచే యాడ్. ఓ ఫుడ్‌కి సంబంధించిన ఈ యాడ్‌లో ''ఇల్లైనా, స్కూలైనా ఓపెన్‌గా ఉండండి. ఎమోషనల్ డ్రామాను నేను యాక్సెప్ట్ చేయను. ఎందుకంటే మీ అమ్మ మీకు స్నేహితురాలు అండ్ సూపర్ కూల్'' అంటూ శ్రీదేవి సందడి చేశారు. ఇందులో జగదేక సుందరి మామ్‌గా చాలా అందంగా కనిపించారు. మొత్తం నాలుగు గెటప్స్‌లో కనిపించి, ఆకట్టుకున్నారు. ఈ యాడ్‌లో శ్రీదేవి హావభావాలు సూపర్‌గా ఉన్నాయి. అతిలోక సుందరి ఆకస్మిక మరణం పొంది ఉండకపోతే ఇలాంటి మరెన్నో యాడ్స్‌లోనూ, సినిమాల్లోనూ చూసి ఉండేవాళ్లం. అన్నట్లు.. ఇది చివరి యాడ్ అని సర్క్యులేట్ చేశారు. అది ఎంతవరకు నిజం అన్నది తెలియాల్సి ఉంది. ఆ సంగతలా ఉంచితే.. నిజజీవితంలో శ్రీదేవి కూల్ మామ్. ఈ యాడ్‌లోనూ అలానే కనిపించారు. కచ్చితంగా జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ ఓ మంచి మామ్‌ని మిస్సయ్యారు. అండ్.. మనం కూడా మంచి నటిని మిస్సయ్యాం.

ఆ మాటలు బాధించాయి

ఇన్నాళ్లకు హీరో నాగశౌర్య తన గురించి చేసిన కామెంట్స్‌పై పెదవి విప్పారు కథానాయిక సాయిపల్లవి. ''నేను యాక్ట్ చేసిన కో–స్టార్స్ అందరిలో కల్లా సాయిపల్లవి డిఫరెంట్. ఆమె లొకేషన్‌కు టైమ్‌కి రారు. క్రమశిక్షణ లేదు. షూటింగ్ స్పాట్‌లో ఇబ్బంది పడ్డాం. 'ఫిదా' సక్సెస్ ఓన్లీ సాయిపల్లవిదే కాదు. టీమ్ అందరిది'' అని సాయిపల్లవిని ఉద్దేశిస్తూ ఓ సందర్భంలో హీరో నాగశౌర్య కామెంట్ చేసినట్లుగా ప్రచారమవుతోంది. ఏఎల్ విజయ్ దర్శకత్వంలో నాగశౌర్య, సాయిపల్లవి జంటగా నటించిన తమిళ్ చిత్రం 'కరు'. తెలుగులో 'కణం' పేరుతో విడుదల కానుంది. కాగా నాగశౌర్య కామెంట్స్‌పై సాయిపల్లవిని ప్రశ్నిస్తే ఆమె ఈ విధంగా స్పందించారట. ''సొంత అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు అందరికీ ఉంటుంది. ఇతరుల మనోభావాలను నేను గౌరవిస్తాను. నా వల్ల ఎవరైనా ఇబ్బంది పడితే నాకు బాధగా ఉంటుంది. నాగశౌర్యకి నాతో ఉన్న ప్రాబ్లమ్ ఏంటో తెలియదు. నా గురించి అతను మాట్లాడిన మాటలు విని, బాధపడ్డాను. డైరెక్టర్ విజయ్‌గారికి ఫోన్ చేసి 'నా ప్రవర్తన వల్ల షూటింగ్ స్పాట్‌లో ఎవరికైనా ఇబ్బంది కలిగిందా?' అనడిగాను. ఆయన లేదన్నారు. ఎవరైనా నాపై కంప్లైట్ చేశారా? అని కూడా అడిగాను. 'నో' అన్నారు. ఈ విషయం గురించి నాగశౌర్య కూడా నాతో ఎప్పుడూ మాట్లాడలేదు. నా అదృష్టం కొద్దీ ఈ విషయాన్ని నాగశౌర్య దాచలేదు. ఓపెన్‌గా కామెంట్ చేశారు. మంచిదే'' అని సాయిపల్లవి అన్నారని ప్రచారం జరుగుతోంది.


సాయిపల్లవి

మేం విడిపోవడానికి శ్రుతీహాసన్ కారణం కాదు

కమల్‌హాసన్–శ్రీదేవి బ్రేక్ కే బాద్ మళ్లీ కలిశారా? కమల్ పొలిటికల్ లైఫ్‌లో గౌతమికి స్థానం ఉందా? కమల్ ఆరంభించిన పొలిటికల్ పార్టీ 'మక్కళ్ నీది మయమ్'కి గౌతమి సపోర్ట్ చేయబోతున్నారా? అటు చెన్నై ఇటు హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో ఒకటే చర్చ. ఈ చర్చకు గౌతమి ఫుల్ స్టాప్ పెట్టారు. కమల్‌తో ఇప్పుడు తనకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారామె. సోషల్ మీడియా ద్వారా గౌతమి తన మనోభావాలను పంచుకున్నారు. ''పాస్ట్ ఈజ్ పాస్ట్ అండ్ దేర్ ఆర్ రీజన్స్ ఫర్ ఇట్'' అంటూ ఈ నెల 24న ఓ లెటర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారామె. ''ఎవరి గురించైనా నేను ఏదైనా చెబుతున్నానంటే తప్పకుండా ఓ కారణం ఉంటుంది. 30 ఏళ్లుగా నన్ను తెలిసినవారికి నేనేంటో బాగా తెలుసు'' అంటూ 'ప్రూఫ్ అండ్ జడ్జ్‌మెంట్స్' అంటూ మరో లెటర్‌ను మంగళవారం పోస్ట్ చేశారు గౌతమి.

ఈ రెండు ఉత్తరాల ద్వారా ఆమె తన జీవితంలోని కొన్ని విషయాలను చెప్పుకొచ్చారు. వాటిలో కొన్ని సంగతులు..

- మిస్టర్ కమల్‌హాసన్‌కు నా సపోర్ట్ లభిస్తుందన్న వార్తల్లో నిజం లేదు. ఆల్మోస్ట్ మా 13ఏళ్ల రిలేషన్‌షిప్‌కు 2016లో ఫుల్‌స్టాప్ పడింది. ప్రస్తుతం పర్శనల్‌గా కానీ ప్రొఫెషనల్‌గా కానీ మరే విధంగా కానీ మిస్టర్ కమల్ హాసన్‌తో నాకు ఎటువంటి సంబంధాలు లేవు. ప్రస్తుతం నా కూతురి (సుబ్బలక్ష్మి) భవిష్యత్, ఆర్థిక వనరులపైనే దృష్టిపెట్టాను
- మిస్టర్ కమల్‌హాసన్‌తో నా రిలేషన్‌షిప్ బ్రేక్ అవ్వడానికి మూడో వ్యక్తి ఎవరూ కారణం కాదు. మా బంధం చెడిపోవడానికి శ్రుతీహాసన్ కారణం అని చాలామంది చెప్పుకుంటున్నారని విన్నాను. అదేం లేదు. మేం విడిపోవడానికి పిల్లలెవరూ కారణం కాదు. శ్రుతి, అక్షరలను నేనిప్పటికీ పిల్లలుగానే చూస్తాను. అయినా.. ఇద్దరు పెద్దవాళ్లు ఒక రిలేషన్‌షిప్ నుంచి విడిపోవడానికి పిల్లలు కారణం కారనే నేను నమ్ముతాను. మిస్టర్ కమల్‌హాసన్ కొన్ని కొత్త కమిట్‌మెంట్స్ తీసుకున్నారు. అవి నా ఆలోచనలకు సరిపడలేదు. పైగా నా ఆత్మగౌరవం దెబ్బతింటుందన్న భావన కలిగింది. ఆత్మాభిమానాన్ని వదులుకోదలచుకోలేదు. మా రిలేషన్ చెడిపోవడానికి ఇదొక్కటే కారణం.
- రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ (కమల్‌హాసన్ సొంత నిర్మాణ సంస్థ) నిర్మించిన సినిమాలకు, మిస్టర్ కమల్‌హాసన్ బయట సంస్థల్లో నటించిన సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేశాను. అప్పట్లో నా ఇన్‌కమ్ సోర్స్‌లో మేజర్ ఇదే. అయితే 'దశావతారం, విశ్వరూపం'.. మరికొన్ని సినిమాలకు సంబంధించిన కొంత పారితోషికం ఇంకా రావాల్సి ఉంది.
- ప్రస్తుతం నా దృష్టంతా నేను నిర్వహిస్తున్న 'లైఫ్ ఎగైన్ ఫౌండేషన్', నా కూతురు భవిష్యత్ మీదే. నన్ను సపోర్ట్ చేస్తున్న అందరికీ ధన్యవాదాలు.


గౌతమి

కాసుకో సుడోకు

5				9	4			8
			3			1	9	4
1				6		2		3
4		8		3			2	
	3	7				8	1	
	5			8		4		7
3		5		7				2
7	4	9			5			
6			9	1				5

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

5	9	8	3	6	2	1	4	7
7	4	3	8	1	9	5	6	2
6	1	2	7	4	5	8	9	3
4	5	9	2	7	8	3	1	6
3	8	1	9	5	6	7	2	4
2	6	7	4	3	1	9	5	8
9	7	5	6	2	3	4	8	1
8	3	6	1	9	4	2	7	5
1	2	4	5	8	7	6	3	9



''మా వాడికి అన్ని సబ్జెక్టులలోనూ గుండు సున్నాలొస్తున్నాయి. వాడెలా బాగుపడతాడో అర్థం కావటం లేదు'' విచారంగా అన్నాడు సుబ్బయ్య.

''దానికంత విచారం దేనికిరా? కోడిగుడ్ల వ్యాపారంలోకి దించు రాణిస్తాడు..'' చెప్పాడు రామయ్య.

పరి పరిశోధన

'వాహన'ం ఎగిరింది..

ఎగిరే ట్యాక్సీలో ఆఫీసుకెళ్లే రోజులు దగ్గరపడ్డాయి. మొన్నటికి మొన్న చైనీస్ కంపెనీ ఎహాంగ్ తొలిసారి ఇద్దరిని తమ ఎయిర్ ట్యాక్సీలో విజయవంతంగా కొంతదూరం వెళ్లేలా చేయగా.. తాజాగా విమాన తయారీ సంస్థ ఎయిర్‌బస్ తన ఎయిర్ ట్యాక్సీ 'వాహన'ను పరీక్షించింది. అమెరికాలోని ఒరెగాన్



రాష్ట్రంలోని పెండెల్టన్ కేంద్రంలో జరిగిన ఈ పరీక్షలో వాహన దాదాపు నిమిషం పాటు గాల్లోకి ఎగిరింది. ఆ తరువాత సురక్షితంగా నేలకు దిగింది. ట్రాఫిక్ చిక్కులను తప్పించేందుకు ఎయిర్‌బస్ సిద్ధం చేస్తున్న వాహన 50 మైళ్ల దూరం వరకూ ప్రయాణించగలదు. డ్రైవర్ లేదా పైలట్ అవసరం కూడా లేకపోవడం ఇంకో విశేషం. మొత్తం ఎనిమిది ప్రొపెల్లర్ల సాయంతో గాల్లోకి ఎగిరే వాహనంలో ఇంధనం విద్యుత్తే.

చిటికెలో మట్టి పరీక్షలు...

వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే భూమి సారవంతంగా ఉండటంతోపాటు చీడపీడలకు అవకాశాలు తక్కువగా ఉండాలని మనకు తెలుసు. అయితే భూసారాన్ని పరీక్షించేందుకు ఇప్పటికే కొన్ని టెక్నాలజీలు అందుబాటులో ఉన్నాయిగానీ.. చీడపీడల విషయానికి వస్తే మాత్రం ఇలాంటివేవీ లేవు. ఈ అంతరాన్ని పూరించేందుకు వాషింగ్టన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఓ వినూత్నమైన టెక్నాలజీని అభివృద్ధి చేశారు. పంట నష్టానికి కారణం కాగల సూక్ష్మజీవుల వివరాలను ఇది అతితక్కువ సమయంలో గుర్తించి రైతులకు వివరాలు అందిస్తుంది. ఇదే పనిచేసేందుకు ప్రస్తుతం కొన్ని వారాల సమయం పడుతుందన్నది తెలిసిందే. మట్టిలో ఉండే సూక్ష్మజీవుల డీఎన్ఏ పోగులను ప్రత్యేకమైన అయస్కాంతాల సాయంతో గుర్తించి.. పాలిమరేస్ చెయిన్ రియాక్టర్ల ద్వారా వివరాలు తెలుసుకోవడం ఈ టెక్నాలజీలోని కీలక అంశం. పరికరాన్ని తయారు చేసేందుకు అవసరమైన అన్ని విడిభాగాలు, విధానం గురించి వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఒక పరిశోధన వ్యాసంలో వెల్లడించారు. వాషింగ్టన్ ప్రాంతంలోని బంగాళాదుంపల పొలాల్లో ఈ పరికరాన్ని పరిశీలించి మంచి ఫలితాలు సాధించామని ఈ పరిశోధనలో పాల్గొన్న శాస్త్రవేత్త కివామూ తనాకా అనే శాస్త్రవేత్త చెప్పారు.



హిందీ నేర్చుకున్న గూగుల్ అసిస్టెంట్...

స్మార్ట్‌ఫోన్లతో మరింత సులువుగా పనిచేసేందుకు సిరి, కోర్టానా, గూగుల్ అసిస్టెంట్ వంటి వాయిస్ అసిస్టెంట్లు ఎంతో ఉపయోగపడతాయి. కానీ ఇప్పటివరకూ చాలావరకూ వాయిస్ అసిస్టెంట్లు ఇంగ్లిష్ భాషకు మాత్రమే స్పందిస్తాయి. అయితే ఏడాది తిరిగేలోగా ఈ పరిస్థితి మారిపోనుంది. ఎందుకంటే హిందీతోపాటు దాదాపు 30 ఇతర భాషల్లో ఈ సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు గూగుల్ సిద్ధమవుతోంది మరి! కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే ఈ వాయిస్ అసిస్టెంట్లు అవసరమైతే మన మెయిళ్లు ఓపెన్ చేసి కొత్త మెయిల్స్‌ను చదివి వినిపించడంతోపాటు.. అన్ని రకాల సందేహాలను వికీపీడియా లేదా ఇతర మార్గాల ద్వారా తీరుస్తాయి. ప్రస్తుతం ఇంగ్లిష్‌కు మాత్రమే పరిమితమైన గూగుల్ అసిస్టెంట్‌ను ఏడాది తిరిగేలోగా డానిష్ భాషతోపాటు డచ్, హిందీ, ఇండోనేసియన్, నార్వేజియన్, స్వీడిష్ భాషల్లో అందుబాటులోకి తెస్తామని దీనిద్వారా ఆండ్రాయిడ్‌ను ఉపయోగించే వారిలో 95 శాతం మందికి వాయిస్ అసిస్టెంట్ లభిస్తుందని గూగుల్ ప్రతినిధి ఒకరు చెప్పారు.



మెదడు సైజు పెరిగింది

గత ముప్పయి లక్షల సంవత్సరాల వ్యవధిలో మనిషి మెదడు సైజు మూడు రెట్లు పెరిగిందని ఒక తాజా అధ్యయనంలో తేలింది. మెదడు పరిమాణం పెరగడం వల్లనే నాగరికత, సంస్కృతి, భాషలు, పరికరాలను తయారు చేసుకునే సామర్థ్యం అభివృద్ధి చెందాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దాదాపు వందకు పైగా మానవ శిలాజాలను నిశితంగా పరీక్షించిన తర్వాత షికాగో వర్సిటీ శాస్త్రవేత్తలు ఈ మేరకు నిర్ధారణకు వచ్చారు. షికాగో వర్సిటీకి చెందిన శిలాజ శాస్త్రవేత్త డాక్టర్ ఆండ్రూ డ్యూ ఆధ్వర్యంలోని శాస్త్రవేత్తల బృందం ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి 13 మానవ జాతులకు చెందిన 94 శిలాజాలను సేకరించి పరీక్షలు జరిపింది. పరిణామ క్రమంలో మానవ జాతికి సమీప బంధువులైన చింపాంజీలతో పోలిస్తే ఇప్పటి ఆధునిక మానవుల మెదడు పరిమాణం మూడు రెట్ల కంటే ఎక్కువగా ఉంటోందని, ఈ స్థాయిలో పరిణామం చెందడానికి ముప్పయి లక్షల ఏళ్ల కాలం పట్టిందని డాక్టర్ ఆండ్రూ డ్యూ తెలిపారు.



సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం
28-2-2018

నేను నా దైవం

రామజోగయ్య శాస్త్రి, పాటల రచయిత



ఫొటో: శివ మల్లాల

లోకాలనేలేటోడు నీకు సాయం కాకపోడు

ఆడ ఏడనో కొండమీద కూసొని ఉంటాడు. ఈడ ఏడనో మనం మట్టిలో దొర్లాడుతుంటాం. ఓపారి సూడాలని ఓసారి దరిచేరాలని శానా ఆశ ఉంటుంది. దేవుడు కొండమీద ఉండనీ.. ఆకాశం అవతల ఉండనీ.. మన భుజమ్మీద ఒక చేయి ఉండనే ఉంటుంది. దేవుడంటే మిత్రుడు, స్నేహితుడు, శ్రేయోభిలాషి అంటూ... 'సదాశివా సన్యాసి తాపసి కైలాసవాసి..' పాటను అందించి మనందరి మనసులు గెలుచుకున్న రచయిత రామజోగయ్యశాస్త్రి గారితో ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ!

● పాటల రచయితగా వెలుగొందడం దైవ రచన అంటారా, మీ స్వయంకృషి అంటారా?

మనలోని ప్రతీ ఒక్కరి జీవితం డెస్టినీ మీద ఆధారపడి ఉంటుందని నా నమ్మకం. నా జీవితం కూడా భగవంతుని దయగానే భావిస్తున్నాను. ప్రపంచంలో వేలాది విషయాలు ఉన్నప్పుడు నాకు ఈ 'అక్షరం' మీదనే ఎందుకు జిజ్ఞాస కలిగింది? అదే నాకు అన్నం పెట్టేదిగా ఎలా అయ్యింది. ఇది తలచుకుంటే ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంటుంది. ఈ రంగంలోకి రావడానికి, నిలదొక్కుకోవడానికి దైవం ప్రేరణ తప్పక ఉంది. ఇంజనీరింగ్ చదివాను. ఉద్యోగం చేస్తూనే నా ఇష్టాన్ని తీర్చుకోవడానికి ప్రయత్నం చేశాను. పాటలు పాడటం అంటే ఇష్టం. ఆ ప్రయత్నంలో ఉండగానే పాట రాయాలనే ఆలోచన కలిగింది. నా ప్రయత్నమేదీ వృథా కాలేదు. ఇప్పటికీ నా ప్రతి అడుగులోనూ భగవంతుని అనుగ్రహం ఉంది. అయితే, దైవ కృప ఒక్కటే సరిపోదు. మన స్వయంకృషి ఉండాలి. మనమేదీ చేయకుండా భగవంతుని మీద వదిలేయడం సరైనది కాదు. ఉదయం పూజాధికాలు ముగించుకున్న తర్వాత రాయడం పనిగా పెట్టుకుంటాను. రాసే పనిలో లేనప్పుడు చదువుతాను. ఈ ధ్యాసలో పడితే అన్నం, నీళ్లు కూడా గుర్తుకురావు. జీవితంలో నిలదొక్కుకోవడానికి విధి మనకు కొన్ని అవకాశాలను ఇస్తుంది. వాటిలో అమితంగా నచ్చిన దాన్ని పట్టుకుంటాం. దానిని వదలకుండా ఆ పనికి కావల్సిన వనరులన్నీ సమకూర్చుకోగలగాలి. సమర్థతను పెంపొందించుకోవాలి. చేసే సాధన ఎంత ఉంటే దైవం ఆశీస్సులు అంతగా ఉంటాయని నమ్ముతాను.

● చాలా మంది రచనలు చేసేటప్పుడు ముందు వారి ఇష్టదైవం పేరును రాస్తుంటారు. మీరూ అలా రాసే రచన మొదలుపెడుతుంటారా?

ఒకటి కాదు మూడు రాస్తాను. మొదటగా శ్రీ గురుభ్యోనమః అని రాసుకుంటాను. ఆ విధంగా ముందు గురువును తలచుకుంటాను. తర్వాత 'సాయి ప్రసాదం' అని రాస్తాను. ప్రతీ అక్షరం సాయిబాబా ప్రసాదంగా భావిస్తాను. మా ఇంటి పేరు కూడా సాయిప్రసాదం అనే ఉంటుంది. ఇక ఏ పని చేసినా ఓర్పుగా, శ్రద్ధగా చేయడం అనేది ముఖ్యం. ఇదే విషయాన్ని సాయిబాబా సూక్తుల ద్వారా తెలియజేశారు. అందుకే పేజీకి ఒక మూలన 'శ్రద్ధ– సబూరి' అని రాసుకుంటాను. ఒక పాట ఎన్ని సార్లు రాసినా, ఎన్ని పేజీలు రాసినా.. ప్రతీ ఒక్క పేజీ మీద ఈ మూడు పదాలు తప్పనిసరిగా ఉంటాయి.

● మీలో ఆధ్యాత్మికత పెంపొందడానికి చిన్నప్పుడు ఇంట్లో అమ్మనాన్నలు చేసే పూజలు, తరచూ దేవాలయ సందర్శనలు దోహదపడ్డాయంటారా?

మన సంస్కృతి, సంప్రదాయాలు ఆధ్యాత్మికత వైపు నడిపించే సాధనాలు. అవి నిన్నటి తరం నుంచి నేటి తరానికి, నేటి తరం నుంచి రేపటి తరానికి చేరుతుంటాయి. దైవానికి సంబంధించిన అంశాలు కూడా పెద్దవారి నుంచే పిల్లలు అందిపుచ్చుకుంటారు. మా అమ్మ (సరస్వతమ్మ) రాముడి భక్తురాలు. భద్రాచల రాముడికి మొక్కుకున్నాక నేను పుట్టానని, రాముడి భిక్ష అని భావిస్తూ నాకు 'రామజోగయ్య' అని పేరు పెట్టింది. అమ్మ ఆధ్యాత్మిక ప్రపంచం నుంచి నేనూ కొన్ని అలవర్చుకున్నాను. సాహిత్యంపైన ప్రేమ అక్కడినుంచే వచ్చి ఉంటుందని నా భావన. అయితే, భగవతారాధనలో నిత్యం చేసే క్రతువుల కన్నా ఆధ్యాత్మికానందం ఎవరికి వారు మనసు లోతుల్లో నుంచి పొందాలి. ఇది వారి మానసిక పరిణతిని బట్టి ఉంటుంది. నా చిన్నతనంలో గుళ్ల వద్ద తరచూ కొన్ని భక్తి పాటలు చెవిన పడుతుండేవి. వాటిలో మనసులో బలంగా నాటుకుపోయినవి 'శివ శివ శంకర.. భక్తవ శంకర శంభో హరహర మహాదేవ..', 'రామనీలమేఘశ్యామ కోదండ రామా.. రఘుకులాద్రి శోమ పరంధామ సార్వభౌమ..' అనే పాటలు. ఇవి చెవిన పడితే చాలు ఇప్పటికీ ఏదో తెలియని ఆధ్యాత్మిక భావం మనసును తట్టిలేపుతుంది. ఇక 'పిబరే రామరసం..' అనే కీర్తన ఏ రూపంలో, ఏ సందర్భంలో, ఎక్కడ విన్నా పరవశానికి లోనవుతుంటాను.

● ఇతర కవులు రాసిన పాటల పరవశం గురించి చెప్పారు. మరి మీరు రాసిన దేవుడి పాటల్లో మీకు బాగా నచ్చినవి..

రెండు పాటలు ఉన్నాయి. 'సదాశివ సన్యాసి తాపసి కైలాసవాసి..' అనే పాట నాకు చాలా ఇష్టమైనది. ఈ పాటకు జరిగిన కృషి, తపనను మర్చిపోలేను. ప్రతి పదమూ ఓ అద్భుతంగా అమరింది. ఈ పాట ద్వారా నాకు ఎక్కడలేని గుర్తింపు లభించింది. అంతకు ముందు సినీ పరిశ్రమలోనూ, బయట రామజోగయ్యశాస్త్రిని చూసిన విధానం వేరు. ఈ పాట తర్వాత నాకో గుర్తింపు, ప్రత్యేకత లభించాయి. మరో పాట నాగార్జున నటించిన సాయిబాబా సినిమాలో 'నీ పదముల ప్రభవించిన గంగా యమున.. మా పాలిట ప్రసరించిన ప్రేమా కరుణ..' అద్భుతం అనిపిస్తాయి. ఆ బాబాయే దయతలచి నా చేత ఈ పాట రాయించాడా అనిపిస్తుంది.

> **● పాట రాసే ముందు మంచి పదాలను ఇవ్వమని దేవుడిని తలుచుకుంటారా?**
>
> పని ఇచ్చిన వారు.. అంటే పాట రాయమని చెప్పినవారు నాకు దైవ సమానులే! నాకు ఓ పనిని అత్యంత నమ్మకంగా అప్పజెప్పినప్పుడు అంతే జాగ్రత్తగా ఆ పనిని చేయాలి. అదే నేను చేసే పూజ.

● దేవుడు మీకు అక్షరరూపంలో సరస్వతిని ఇచ్చాడు. అలాంటి అక్షరాన్ని కమర్షియల్ పాటలకు వాడటం గిల్ట్‌గా ఎప్పుడైనా భావించారా?

ఎంతమాత్రమూ లేదు. ఎందుకంటే, భగవంతుని స్తుతించే కీర్తన అయినా, డ్యూయెట్, ఐటమ్ సాంగ్.. ఏదీ వేరు కాదు. ఇది దైవం నాకు ఇచ్చిన పని. నేటి తరానికి తగ్గట్టుగా ఉంటూనే విలువలు కోల్పోకుండా ఆ పరిధిలోనే నన్ను వరించిన పనులు చేస్తాను. నా ద్వారా ఎప్పుడూ చెడు రాదు. సాయి ప్రసాదం అని ఎప్పుడైతే రాసుకున్నానో అది భగవంతుని ప్రసాదంగానే భావించి భక్తిగా నా పనిని పూర్తి చేస్తాను.

● ఒక దశకు వచ్చాక.. అంటే ఆర్థికంగా స్థిరపడ్డాక ఎవరికైనా ఇక దేవుడితో పని లేదనిపిస్తుందా? అలా మీకు ఎప్పుడైనా అనిపించిందా?

ఆర్థికపరమైన విషయానికి, ఆధ్యాత్మికంగా దైవంతో కనెక్టివిటీ ఉండటానికి ఏ మాత్రం సంబంధం లేదు. ఈ రెండూ వేరు వేరు విషయాలు. దేవుడు మనకు మంచి ఆలంబన. నా దృష్టిలో అయితే మంచి మిత్రుడు. మోటివేషనల్ స్పిరిట్. నా ఏకాగ్రతను ఇనుమడింపజేసే ఒక అంశం. నన్ను సరైన పద్ధతులు, కట్టుబాట్లలో ఉంచి పోషించే విషయం. నా కష్టనష్టాలు చెప్పుకునే కేంద్రస్థానం. ఇవన్నీ ఆర్థికంగా ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు ఒకలా ఉండవు. కొంతమందికి దైవం మూర్తి స్వరూపంగా ఉంటాడు, కొంతమందికి భావనా స్వరూపంగా ఉంటాడు. అది వారి ఆలోచనా విధానం బట్టి ఉంటుంది. ఎవరెలా పూజించినా ప్రపంచాన్ని నడిపించే శక్తి ఉంది. ఆ శక్తికి అందరం ఎప్పుడూ అనుసంధానమై ఉండాల్సిందే! డబ్బులు ఉండటం, లేకపోవడం అనేది సమస్య కాదు. దేవుడితో మన సంబంధం ఎప్పుడూ శాశ్వతంగా ఉందా లేదా అనేది తరచి చూసుకోవాలి. అలాగే, ప్రపంచంలో మనశ్శాంతిని మించిన సంపద లేదు. దేవుడితో ఎంత కనెక్ట్ అయి ఉంటే అంత మనశ్శాంతిగా ఉంటాం. ఎంత ఎత్తులకు ఎదుగుతున్నా భగవంతునితో కనెక్టివిటీ శాశ్వతంగా ఉండాలి.

● మీరు ఎప్పుడూ నుదుటన బొట్టుతో కనిపిస్తారు. ఈ రంగంలోకి వచ్చాకనే ఇలా బొట్టు పెట్టుకోవడం ప్రారంభించారా? దీని వెనుక ఉన్న సందర్భం ఏంటి?

పూజ చేసుకున్నప్పుడు బొట్టు పెట్టుకోవడం మనందరి అలవాటు. ఒకసారి ఇంట్లో ఏదో పూజ జరిగి బయటకు వెళ్లినప్పుడు బొట్టు పెట్టుకొని ఉన్నాను. కలిసినవారు బొట్టుతో బాగున్నానని చెప్పారు. అసలు విషయం ఏంటంటే నా నుదురు విశాలంగా ఉంటుంది. నుదురు మధ్యలో ఏదో ఒకటి ఉంచాలి. బొట్టు పెట్టుకుంటే బాగుంటుందనిపించింది. అంతకు మించి వేరే ఉద్దేశం లేదు.

● మీ బాల్యంలో దేవుడు, ఇప్పుడు దేవుడు? ఈ రెండింటి మధ్య మీ ఆలోచనలు..

సంప్రదాయ కుటుంబంలో పుట్టినా, హేతుబద్ధమైన విషయాల పట్ల అవగాహనతో ఉండేవాడిని. ఎప్పుడూ నన్ను నేను సద్విమర్శ చేసుకుంటూ ఉండేవాడిని. ఈ ప్రక్రియ నా ఎదుగుదలకు బాగా దోహదపడింది. ఎప్పుడూ విరగబడి ఛాందసంగా పూజలు చేసింది లేదు. అలాగని అస్సలు పూజలు చేయకుండా లేను. అమ్మానాన్నలకు ఒక్కడినే కొడుకును. చిన్నప్పుడు అమ్మానాన్నలతో పాటు రాముడు, కృష్ణుడు, గణేషుడు .. అని పూజించినవాన్నారు. అయితే, నాదైన జీవితంలో ప్రవేశించాక మాత్రం 'సాయిబాబా' ఆలంబన అయ్యాడు. నాకు తెలియకుండానే నా జీవితంలో బాబా గారు ప్రవేశించారు. దేవతలందరిలోనూ ముందువరసలో బాబా ఉంటారు. అందరు దేవతలను ఆయనలో చూసుకుంటాను.

- నిర్మలారెడ్డి చిల్కమర్రి

శక్తి కౌన్సెలింగ్

నా తల సింక్‌లో ఉంచి వేణ్ణీళ్ల ట్యాప్ తిప్పాడు



ప్రతీకాత్మక చిత్రం

ప్ర. మా పెళ్లయి యేడాది అవుతోంది. అరేంజ్‌డ్ మ్యారేజ్. ఆయనకు అమెరికాలో ఉద్యోగం. పెళ్లయిన నెలకు డిపెండెంట్ వీసా మీద అమెరికా వెళ్లాను. ఓ పదిహేను రోజులు బాగానే ఉన్నాడు. తర్వాత నుంచి అసలు రూపం చూపించడం మొదలుపెట్టాడు.

వంట చేస్తుంటే ఉడుకుతున్న కూరలో మగ్గుడు నీళ్లు కుమ్మరించేవాడు. నేను స్నానాకి వెళితే బయట నుంచి బాత్రూమ్ డోర్ లాక్ చేసేవాడు. బాగా రెడీ అయినా తప్పే.. రెడీ కాకపోయినా తప్పే. అతని ఫ్రెండ్స్ ఇంటికి వస్తే పలకరిస్తే లైటింగ్ కొడుతున్నావా అనేవాడు. ఓసారి.. మీ అమ్మానాన్న.. అంటూ మా పేరెంట్స్‌ని తిడుతుంటే సహించలేక ఎదురు తిరిగాను. అంతే నా జుట్టుపట్టి లాగి తోసేశాడు. సోఫాకి నా తల కొట్టుకొని రక్తం వచ్చింది. అయినా ఆగకుండా... నా జుట్టు పట్టుకొని బాత్రూమ్‌లోకి ఈడ్చుకెళ్లి సింక్‌లో నా మెడను వంచి వేడి నీళ్ల ట్యాప్ తిప్పాడు. తట్టుకోలేక తప్పించుకునే ప్రయత్నంలో ఆయన్ని తోసేశాను. కిందపడ్డాడు. ఆవేశంతో లేచి అక్కడే ఉన్న సిజర్స్‌తో నా పెద్ద జడను కత్తిరించేశాడు. వాళ్ల వాళ్లకు ఫోన్ చేసి "నా పెళ్లాం నన్ను కొడుతోంది" అంటూ ఏడ్చాడు. "మీ అమ్మాయి రాక్షసి. కాపురం చేయడం నావల్ల కాదు, పంపించేస్తున్నాను" అని అప్పటికప్పుడు టికెట్ బుక్ చేసి ఇండియాకు పంపించేశాడు.

నేను ఆయన దగ్గరున్నది కేవలం ఆరు నెలలే. ఆయన పెట్టే హింస గురించి మా వాళ్లకు చెబితే హర్ట్ అవుతారని చెప్పకుండా దాచాను. కాని ఇక్కడికి వచ్చాక జరిగినదంతా చెప్పాను. మా పెద్దవాళ్లు నన్ను తీసుకొని హైదరాబాద్‌లోనే ఉన్న మా అత్తారింటికి వెళ్లారు. వాళ్లూ నాదే తప్పన్నట్టుగా చెప్పి మా పెద్దవాళ్లను ఇన్‌సల్ట్ చేశారు. మా వారికి ఫోన్ చేస్తే బూతులు తిట్టాడు మా వాళ్లను. తను ఇంకో పెళ్లి చేసుకుంటానని బెదిరిస్తున్నాడు. ఆయనను ఇండియాకు రప్పించి, శిక్షించే మార్గం లేదా? నేనేం చేయాలి?

– ఆరతి, హైదరాబాద్.

జ. ఇదంతా డొమెస్టిక్ వయొలెన్స్ కిందకే వస్తుంది. ముందు మీరు మీ భర్త మీద కేస్ పెట్టండి. తర్వాత లుక్ అవుట్ కేస్ కింద కంప్లయింట్ ఇవ్వండి. అలాగే 498 ఏ, వయొలెన్స్, హెరాస్‌మెంట్ కిందా కంప్లయింట్ ఫైల్ చేయండి. మీ హజ్బెండ్ అమెరికాలో ఉన్నాడు కాబట్టి మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్‌లోని ఎన్ఆర్ఐ సెల్‌కి, ఇండియన్ ఎంబసీకి దరఖాస్తు చేయండి. అంతేకాదు మీ భర్త అమెరికాలో ఏ స్టేట్‌లో ఉంటున్నాడో ఆ స్టేట్ లా గురించి తెలుసుకొని హెరాస్‌మెంట్‌కు పాల్పడ్డాడని అక్కడి అటార్నీతో మీ భర్తకు లీగల్ నోటీస్ ఇప్పించండి.

అన్నిటికన్నా ఎక్కువ వర్కవుట్ అయ్యేది లుక్ అవుట్ నోటీసే. మీ భర్త ఎప్పుడు ఇండియాకు వచ్చినా ఈ లుక్ అవుట్ నోటీస్ కింద అతనిని వెంటనే అరెస్ట్ చేస్తారు. ఇదేకాక.. మీరు సెక్షన్ 125 కింద మెయిన్‌టెనెన్స్ కోసం కోర్టులో కేస్ వేసుకోవచ్చు కూడా. ఇందుకోసం చాలా తిరగాల్సి ఉంటుంది. అతనికి శిక్ష పడాలి అనుకుంటే మీకు ఈ ఓపిక అవసరం!



- మమతా రఘువీర్,
అడ్వకేట్, ఫౌండర్, తరుణి

మాకు పంపండి: ఒక మహిళగా మీరు గృహహింస వంటి వేధింపులకు గానీ, సామాజికంగా వివక్షకుగానీ, సంబంధిత ఇతర సమస్యలతో బాధపడుతున్నారా? మీ సమస్యను రాసి మాకు మెయిల్ ద్వారా పంపించండి. ఆయా రంగాలకు చెందిన నిపుణులతో మీకు తగిన సూచనలు / సలహాలు ఇప్పించే ఏర్పాటు చేస్తాం. మీరు మీ ప్రశ్నలను పంపాల్సిన మెయిల్ ఐడీ : nenusakthiquestions@gmail.com

మళ్లీ చెప్పకుందాం! రీటోల్డ్ కథలు - 18

కాళ్లు కడుక్కుని





● రాధిక

'దెయ్యం అని పేపర్ మీద రాయండి'

రాసింది.

'ఇప్పుడు దానిని చింపండి'

చింపింది.

'కసిగా. గట్టిగా. పరాపరా'

కసిగా. గట్టిగా. పరాపరా చింపుతూనే ఉంది. చింపుతుంటే లోపలేదో జరుగుతూ ఉంది. కండరాలకు ఏదో శక్తి పెరుగుతూ ఉంది. పెదాలు అదురుతున్నాయ్. చేతులు వణుకుతున్నాయి. పరాపరా... చింపుతూ ఉంది.

'గుడ్. ఇప్పుడు సగం చచ్చింది. అలా వదిలేయండి. దానిని పూర్తిగా చంపుదాం'

దళసరి అద్దం ఉన్న టేబుల్ మీద ఆ కాగితం ముక్కలు అలా పడి ఉన్నాయ్.

'రిలీఫ్‌గా ఉందా?'

'ఊ'

'కొంచెం ఏడ్వాలని ఉందా?'

'ఉంది. రావట్లేదు. నా పన్నెండవ ఏట నుంచి ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా ఏడ్వలేదు డాక్టర్'

'సంతోషంతో?'

'సంతోషంతో కూడా'

'ఏం... మీ హస్బెండ్ మీకు హ్యాపీనెస్ ఇవ్వడం లేదా? హరాస్ చేస్తున్నాడా?'

'ఏమంటున్నారు? అతనంటే నాకు ప్రాణం. ఈ లోకంలో నేను ఎవర్నయినా నమ్మితే అది అతన్నే. అంత మంచి మగవాడు, స్నేహితుడు మరొకడు లేడు. కాని రాత్రయితేనే'....

'అయితేనే?'...

'దగ్గరకు తీసుకుంటాడు. చేతిని ముద్దాడతాడు. బుగ్గను ముద్దాడతాడు. భుజం మీద చెయ్యేస్తుంటే... నాకు దెయ్యం కనబడి... దెయ్యం... దెయ్యం'... ఒక్కసారిగా వికృతంగా అరవడం మొదలుపెట్టింది.

'కూల్.. కూల్... అదిగో దెయ్యం... చచ్చిపడుంది' కాగితాల వైపు చూపించాడు.

శ్వాసను నెమ్మదింప చేస్తూ మెల్లగా శాంతించింది.

'మొదటిసారి దెయ్యాన్ని ఎప్పుడు చూశారు?' మంచినీళ్ల గ్లాసును ముందుకు తోస్తూ అడిగాడు.

'పదీ పదకొండేళ్లప్పుడు అనుకుంటాను. నానమ్మ ఊళ్లో ఉండేదాన్ని. పక్కింట్లో ఒక రాత్రి పెద్ద గోల అయ్యింది. అందరూ మూగారు. ఆమెకు దెయ్యం పట్టిందట. కాళ్లూ చేతులు కొట్టుకుంటూ ఏదో భాష మాట్లాడుతుండింది. నానమ్మ కొంగు పట్టుకుని భయంగా చూస్తూ నిలబడ్డాను. ఆమెకు పాతిక ముప్పై ఉంటాయి. భర్తకు అరవై దాటిపోయాయి. గతి లేక చేశారట. ఆయన రాత్రయితే పొలానికి వెళ్లిపోయేవాడు పడుకోవడానికి. ఈమె ఒక్కత్తే ఉండేసరికి దెయ్యాలు గోడ దూకి వస్తున్నాయట. ఆ దెయ్యాలను అదిలించలేక బెదిరించలేక వాటి బారిన పడలేక రక్షించుకోలేక తానే దెయ్యంలా మారిపోయింది. చాలా భయం వేసింది.'

వింటూ ఉన్నాడు.

'ఆ రాత్రి నానమ్మను అడిగాను. నన్ను కూడా దెయ్యం పట్టుకుంటుందా అని. దగ్గరకు తీసుకొని గుండెలకు అదుముకుని నేనున్నంత కాలం పట్టదమ్మా అంది. కాని దెయ్యం నన్ను పట్టుకునే తీరింది'

'ఎక్కడా... వీధిలోనా.. స్కూల్లోనా... ఆడుకునే చోటా.. పొలాల్లోనా?'

'ఇంట్లో'

'ఇంట్లో?'

'అవును. ఇంట్లో'

'ఒక్క నిమిషం' అని సొరుగులాగి లైటర్ బయటకు తీశాడు.

'ఇప్పుడు శ్రద్ధగా ధ్యాస మరల్చకుండా తగలబెడుతున్న సంగతి మీలో రిజిస్టర్ అయ్యేలాగా ఒక్కో కాగితాన్ని కాలుస్తూ చెప్పండి' లైటర్ వెలిగించాడు.

మొదటి కాగితం ముక్క తగలబడి నుసి రాలింది.

'నాన్న ఏం పని చేసేవాడు కాదు. తాగడం ఆయన పనిగా ఉండేది. పగలంతా బలాదూరు తిరిగేవాడు. పేక ఆడేవాడు. ఎవరైనా ఏమన్నా అంటే కొట్లాట పెట్టుకునేవాడు. మురికి బట్టలు... మాసిన గడ్డం... వాసన... సారాయిలో నంచుకోవడానికి ఉబ్బెత్తుగా ఉండే రేగుపళ్ల జేబు'...

ఇంకో కాగితం కాలి నుసి అయ్యింది.

'కాని నాన్నకు ఉండి ఉండి దెయ్యం పట్టేది. రాత్రి పూట అమ్మను జుట్టు పట్టి గదిలోకి ఈడ్చేవాడు. తలుపేసేవాడు. దెయ్యం దిగేదాకా తలుపు తెరుచుకునేది కాదు. అమ్మకు ఇష్టం లేదు ఆ దెయ్యం అంటే. తిట్టేది. కొట్టేది. రక్కేది. ఊహూ. వినేవాడు కాదు. దెయ్యం దించుకోవాల్సిందే. ఏమనుకున్నాడో ఏమో... నానమ్మ ఊరి నుంచి నన్ను తీసుకొచ్చేశాడు. పన్నెండేళ్లుంటాయి. బొద్దుగా పుష్టిగా ఉండేదాన్ని. ఆ రాత్రి నాన్నలో దెయ్యం లేచింది. అది అమ్మ గదిలోకి వెళ్లలేదు. నా గదిలోకి వచ్చింది'... కాగితం తగలడుతూ ఉంటే రెండు కళ్ల చివర నీటి బిందువులు పొంగాయి.

'దెయ్యం వచ్చి... దెయ్యం వచ్చి'...

కాగితాలు కాల్చే వేగం పెరిగింది. కళ్లు తడుస్తున్నాయి.

'అయ్యో వద్దు... ఛీ దెయ్యమా వద్దూ... అరుస్తున్నాను... బయట అమ్మ తలుపు బాదుతూ ఏడుస్తూ... దెయ్యం మింగేస్తుందేమో అన్నంతలో తలుపు పగలగొట్టి దెయ్యం తల చిట్లగొట్టి'...

కళ్లు కారుతున్నాయి.

పెదాలు బిగిసి ప్రతీకారం తీర్చుకుంటున్నట్టుగా చేతులు కాగితాలను తగలబెడుతున్నాయి. నుసి. రాలు. నుసి. నశించు. నుసి. నీకిదే శాస్తి.

'ఆ రోజు ఏడ్వడం మానేశాను. మళ్లీ ఇవాళ'...

ఒక్కసారిగా రెండు కళ్లను చేతుల్లో దాచుకుంది. మలినాలు... తెట్టు... కల్మషం... మరొకరి చర్య వల్ల ప్రమేయం లేకపోయినా చేరుకుపోయిన మురికి... అన్నీ కారిపోతున్నాయి... పూర్తిగా... సంపూర్ణంగా... మరేమీ మిగలనట్టుగా...

అతడు లేచి ఆ నుసినంతా ఒక కాగితం మీదకు సర్దాడు.

'దీనిని ఫ్లష్ చేస్తే మళ్లీ జీవితంలో దీనిని మీరు చూడగలరా?'

తల అడ్డంగా ఆడించింది.

'అయితే ఫ్లష్ చేసి రండి'

చేతుల్లోకి తీసుకుని ఆ నుసినే చూస్తూ ఆ నుసినే సింక్‌లో వేసి ఆ నుసి పైకి ట్యాప్ తిప్పితే ఆ నుసి చురుగ్గా కదలుతూ చీకట్లోకి జారిపోతూ మళ్లీ ఎప్పుడూ తనకెప్పుడూ కనిపించడానికి వీల్లేకుండా అగాధంలోకి వెళ్లిపోయింది.

ముఖం కడుక్కుంది.

'రిలీఫ్‌గా ఉందా?' అడిగాడు.

'ఊ'

బజర్ నొక్కితే హజ్బెండ్ లోపలికొచ్చాడు.

'తీసుకెళ్లండి. ఎంజాయ్ లైఫ్.'...

ఆమె వైపు తిరిగి అన్నాడు...

'ఏమండీ... దారిలో పూలు తీసుకుంటారుగా'

నవ్వింది. అది ఎంత బాగుంది.

కథ ముగిసింది.

రాధిక రాసిన 'అపచ్ఛాయ' కథ ఇది.

ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి ఎంత జాగ్రత్తగా నడిచినా ఎన్ని ముళ్లను రాళ్లను తప్పుకుని నడిచినా అశుద్ధం ఎక్కడో చోట అంటుతూనే ఉంటుంది. అక్కడ శిలలా బంధింపబడరాదు. కాళ్లు కడుక్కోవాలి. రుద్ది రుద్ది ఆ పీడ జ్ఞాపకాలను వదిలించుకోవాలి. ముందు చాలా జీవితం ఉంటుంది. అది ఎప్పుడూ మంచి జీవితమే అయి ఉంటుంది. సత్యం.


పునః కథనం: **ఖదీర్**



ఆస్కార్ 2018 - బెస్ట్ పిక్చర్

అండ్ ది ఆస్కార్ గోస్ టూ...

ఆస్కార్ అవార్డుల వేడుక జరిగే సాయంత్రం. అప్పటికి బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ యాక్టర్, బెస్ట్ యాక్ట్రెస్.. లాంటి టాప్ క్యాటగిరీల అవార్డులు ఇచ్చేశాక అందరూ ఆసక్తిగా, టెన్షన్‌తో ఎదురుచూసే ఒక్క ఆస్కార్ మిగిలి ఉంటుంది. అదే బెస్ట్ పిక్చర్. ఒక సినిమాను, మొత్తంగా బెస్ట్ అనాలంటే ఆ సినిమాకు ఎన్ని అర్హతలు ఉండాలి? డైరెక్షన్, యాక్టింగ్, స్కోర్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్.. ఇలా అన్ని విభాగాల్లో ఆ సినిమా ది బెస్ట్ అనిపించుకునే ఔట్‌పుట్ ఇవ్వాలి. అన్నింటికీ మించి, ఈ విభాగాలన్నింటినీ డామినేట్ చేస్తూ, కేవలం కథగా ఒక బెస్ట్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలి. అలాంటి సినిమాలు సంవత్సరానికి ఎన్ని వస్తాయి? అందులోంచి నామినేషన్స్ ఎంపిక చేయడమే కష్టం. ఇక ఆ నామినేషన్స్ నుంచి ఒక్క సినిమా ఎంపిక చెయ్యడం అంటే? ఈ ఏడాది ఆస్కార్ బరిలో 'బెస్ట్ పిక్చర్' కోసం తొమ్మిది సినిమాలు పోటీ పడుతున్నాయి. ఆ తొమ్మిది సినిమాలూ దేనికదే ప్రత్యేకం. వీటిలో ఆస్కార్ అందుకొని, అవార్డు వేడుకను గ్రాండ్‌గా ముగించే సినిమా ఏది?



1 డార్కెస్ట్ అవర్

(దర్శకుడు: జోయ్ రైట్)



1940ల్లో జరుగుతుంది ఈ కథ. రెండో ప్రపంచ యుద్ధం ప్రపంచ దేశాలను కుదిపేస్తోంది. అన్ని దేశాలూ తమకు సంబంధం లేని విషయం అనుకున్నా కూడా ఏదో ఒకటి చేయాల్సిన పరిస్థితి. గ్రేట్ బ్రిటన్‌కు ప్రధానిగా ఎన్నికయ్యాడు విన్‌స్టన్ చర్చిల్. ఇలాంటి సమయంలో అతనికి ఎదురైన సవాళ్లేంటి? జర్మనీని ఎలా ఎదుర్కొన్నాడు? యుద్ధం వైపుకు వెళ్లాలా? ఓ పక్క తమ సైనికులు చావు బతుకుల్లోకి వెళ్లిపోతున్నారు. ఇలాంటి స్థితిలో చర్చిల్ తీసుకున్న నిర్ణయాలు ఏంటన్నది ప్రస్తావిస్తూ 'డార్కెస్ట్ అవర్' సినిమా నడుస్తుంది. జోయ్ రైట్ దర్శకుడు. చర్చిల్ పాత్రలో గ్యారీ ఓల్డ్‌మన్ నటించాడు. హిస్టరీని తెలివిగా, బెస్ట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తూ చెప్పిన సినిమాగా డార్కెస్ట్ అవర్ సూపర్ రివ్యూలు తెచ్చుకుంది. అవార్డు అందుకునేందుకు మిగతా సినిమాలకు గట్టి పోటీ ఇచ్చేలానే ఈ సినిమా కనిపిస్తోంది.

2 డంకర్క్

(దర్శకుడు: క్రిస్టోఫర్ నోలన్)



'డార్కెస్ట్ అవర్'లానే 'డంకర్క్' కూడా రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలోనే, సరిగ్గా 1940 కాలంలోనే జరుగుతుంది. ఇంగ్లాండ్, ఫ్రాన్స్ లాంటి దేశాలన్నీ జర్మనీ కూటమితో పోరాడుతున్నాయి. జర్మనీదే పైచేయి. ఇంగ్లండ్, ఫ్రాన్స్ సైనికులు అన్నివిధాలా చావుకు దగ్గరవుతున్నారు. ఫ్రాన్స్‌లోని డంకర్క్ తీర ప్రాంతంలో దాదాపు నాలుగు లక్షల మంది దిక్కు దోచని పరిస్థితిలో ఉన్నారు. అందరూ పోరాడాలనుకుంటున్న సైనికులే! కానీ జర్మనీ దాడుల ముందు నిలబడలేరు. వాళ్లు బతకాలి. అందుకు ప్రభుత్వం ఎవాక్యుయేషన్ చేపట్టింది. డంకర్క్ నుంచి సైనికులను సేఫ్ ప్లేస్‌కు ఎవాక్యుయేట్ చేయడం ఎలా జరిగిందో 'డంకర్క్' సినిమా చెప్తుంది. ఇందులో వార్ ఉంటుంది. కానీ అది వార్‌లా ఉండదు. టైమ్‌ను వాడుకుంటూ నోలన్ చేసిన ప్రయత్నం అద్భుతం అనిపించుకుంది. ఇన్నేళ్ల కెరీర్‌లో లెక్కలేనంత మంది అభిమానులను, ఎవరికీ సాధ్యం కాని స్థాయిలో బాక్సాఫీస్ సక్సెస్‌నూ అందుకున్న నోలన్ 'డంకర్క్'తో బెస్ట్ డైరెక్టర్ నామినేషన్ కూడా దక్కించుకున్నాడు.




3 ది షేప్ ఆఫ్ వాటర్

(దర్శకుడు: గెలెర్మో దెల్‌తోరో)

'ది షేప్ ఆఫ్ వాటర్' ఫ్యాంటసీ తరహా కథ. ఎలీసా ఈ కథలో ప్రధాన పాత్ర. ఎలిసాకు మాటలు రావు. ఏది చెప్పాలన్నా సైగల ద్వారానే చెప్తుంది. హై సెక్యూరిటీ ఉండే ఒక గవర్నమెంట్ ల్యాబరోటరీలో ఆమె క్లీనింగ్ లేడీగా పనిచేస్తుంది. అదొక సీక్రెట్ ల్యాబ్. అందులో కొన్ని వింత ప్రయోగాలు జరుగుతాయి. అక్కడే ఎలీసా ఒక వింత జీవిని చూస్తుంది. వాటర్ ట్యాంక్‌లో ఉంటుంది ఆ జీవి. ఆ జీవితో సైగలతో మాట్లాడుతుంది ఎలీసా. ఆ వింత జీవికి దగ్గరైపోతుంది ఎలిసా. ఇద్దరి మధ్యా లవ్. ఆ తర్వాత ఏం జరుగుతుందీ? అన్నది సినిమా. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. విమర్శకుల ప్రశంసలు అందుకుంది. గెలెర్మో బెస్ట్ డైరెక్టర్ నామినేషన్ కూడా దక్కించుకున్నాడు. ఈ లిస్ట్‌లో ఆస్కార్‌కు దగ్గరగా ఉన్న సినిమాగా 'షేప్ ఆఫ్ వాటర్' పేరు వినిపిస్తోంది.

4 త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి

(దర్శకుడు: మార్టిన్ మెక్‌డొనా)



మిల్డ్రెడ్ హెయిజ్‌కి కోపమొచ్చింది. కూతురు చనిపోయి నెలలు గడుస్తున్నాయి. ఆమెను చంపినవారిని ఇప్పటికీ పట్టుకోలేదు పోలీసులు. పోరాడి పోరాడి అలిసిపోయింది. అప్పుడే ఆమెకు ఒక ఆలోచన వచ్చింది. సరిగ్గా టౌన్ స్టార్టింగ్ పాయింట్ దగ్గర మూడు బిల్‌బోర్డ్స్ పెట్టిందామె. ఆ బిల్‌బోర్డ్స్‌లో కూతురు మర్డర్ కేసును ఛేదించని పోలీసుల గురించి రాసింది. దాని గురించి అందరూ మాట్లాడటం మొదలుపెట్టారు. ఆమెకు బెదిరింపులు పెరిగాయి. పత్రికల వాళ్లొచ్చారు. టీవీ వాళ్లు వచ్చారు. ఆ తర్వాత ఆమె ఎవరి పేర్లైతే ప్రస్తావించిందో వాళ్లతో ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి? అన్నదే కథ. చివరకు కూతురు మర్డర్ మిస్టరీ ఛేదించిందా లేదా కూడా ప్యారలల్‌గా ఇంకో కథ. గోల్డెన్ గ్లోబ్‌లో బెస్ట్ పిక్చర్ అవార్డు దక్కించుకున్న ఈ సినిమా, ఆస్కార్‌లోనూ గట్టి పోటీ ఇచ్చేలానే కనిపిస్తోంది.

5 కాల్ మీ బై యువర్ నేమ్

(దర్శకుడు: లూకా గడనీనో)



'కాల్ మీ బై యువర్ నేమ్'.. అదే పేరుతో ఉన్న నవల నుంచి పుట్టిన సినిమా. 1983 నేపథ్యంలో కథ నడుస్తుంది. 17 ఏళ్ల హీరో ఎలియో, తన తండ్రి వద్ద ఇంటర్న్‌గా పనిచేయడానికి వచ్చిన అబ్బాయి ఒలివర్‌ని ఇష్టపడతాడు. ఒకరికొకరు తక్కువ రోజుల్లోనే దగ్గరైపోతారు. మరోపక్క ఎలియోకు ఒక గర్ల్‌ఫ్రెండ్ కూడా ఉంటుంది. ఇలాంటి పరిస్థితిలో ఎలియో, ఒలివర్‌ల షాకింగ్ రిలేషన్‌షిప్ ఎక్కడికి వెళుతుంది, అది వాళ్ల జీవితాలను ఎలా మారుస్తుంది అన్నదే సినిమా. షాకింగ్ ఎలిమెంట్‌తో కమింగ్ ఆఫ్ ఏజ్ జానర్లో తెరకెక్కిన ఈ సినిమాకు ఊహించని రీతిలో అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. కథలోని కోర్ ఎమోషన్ ప్రేక్షకులను కట్టిపడేసేలా చేసింది. ఆస్కార్ బెస్ట్ పిక్చర్ రేసులో ఈ సినిమా కూడా గట్టి పోటీ ఇచ్చేలానే కనిపిస్తోంది.

6 గెట్ ఔట్

(దర్శకుడు: జోర్డాన్ పీలె)

హీరో క్రిస్ వాషింగ్టన్‌కు ఒక గర్ల్‌ఫ్రెండ్ ఉంటుంది. అతను నల్లజాతి వాడు. ఆ అమ్మాయి తెల్లజాతికి చెందినది. 'ఈ వీకెండ్ మా ఇంటికి వచ్చి నా పేరెంట్స్‌తో మాట్లాడాలి నువ్వు..' అని చెప్పి హీరోను హీరోయిన్ తన ఇంటికి తీసుకెళ్తుంది. అక్కడికెళ్లాక హీరోకు కొన్ని విచిత్రమైన పరిస్థితులు ఎదురవుతాయి. విచిత్రమైన మనుషులు కనిపిస్తుంటారు. కథ ఊహించని మలుపులు తిరుగుతూ థ్రిల్లింగ్‌గా సాగిపోతుంది. చివరకు ఈ కథ ఎక్కడికి వెళుతుందన్నదే సినిమా. 'గెట్ ఔట్' తక్కువ బడ్జెట్‌లో తెరకెక్కి బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించిన సినిమా. విమర్శకులు కూడా ఈ సినిమాను మెచ్చుకోకుండా ఉండలేకపోయారు. సాధారణంగా హర్రర్ సినిమాలు ఆస్కార్ బెస్ట్ పిక్చర్ వరకూ వెళ్లడం అరుదు. 'గెట్ ఔట్' నామినేషన్ వరకూ వచ్చింది. దర్శకుడు జోర్డాన్ కూడా ఈ సినిమాకు బెస్ట్ డైరెక్టర్ నామినేషన్ దక్కించుకున్నాడు. హీరో డేనియల్ కలూయా బెస్ట్ యాక్టర్ నామినేషన్ దక్కించుకున్నాడు.

7 లేడీ బర్డ్


(దర్శకురాలు: గ్రెటా గెర్విగ్)



లేడీ బర్డ్ ఒక టీనేజ్ అమ్మాయి. హైస్కూల్లో సీనియర్ స్టూడెంట్. లేడీ బర్డ్ తల్లికి ఆమె ఎలా కోరుకుంటే అమ్మాయి అలా ఉండాలని ఉంటుంది. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి పిచ్చి ఇష్టం. అయినా ఏదో తెలియని దూరం ఇద్దరి మధ్యా. లేడీ బర్డ్ ఒకబ్బాయిని ప్రేమిస్తుంది. విడిపోతుంది. ఇంకో అబ్బాయితో మళ్లీ ప్రేమలో పడుతుంది. ఈ పరిస్థితుల్లో లేడీ బర్డ్‌కు, ఆమె తల్లికి మధ్యన జరిగే ఎమోషనల్ జర్నీ ప్రధాన కథగా సినిమా నడుస్తుంది. గ్రెటా గెర్విగ్ అద్భుతంగా ఈ సినిమాను తెరకెక్కించింది. ఆస్కార్‌లో బెస్ట్ డైరెక్టర్స్‌గా నామినేషన్ దక్కించుకున్న వాళ్లలో ఐదో వ్యక్తి గ్రెటా. సోయర్స్ రోనన్ నటన అద్భుతంగా ఉంటుందీ సినిమాలో. ఆమె బెస్ట్ యాక్ట్రెస్‌గా నామినేషన్ కూడా దక్కించుకుంది.

8 ఫాంటమ్ థ్రెడ్


(దర్శకుడు: పాల్ థామస్ ఆండర్సన్)



1950లో లండన్ నేపథ్యంలో నడిచే ఈ కథలో హీరో ఒక డ్రెస్‌మేకర్. పెద్ద పెద్ద పర్సనాలిటీలకు, సినిమా స్టార్స్‌కు డ్రెసెస్ డిజైన్ చేస్తుంటాడు. అతడి జీవితంలోకి అమ్మాయిలు వస్తుంటారు. పోతూంటారు. ఒకమ్మాయి మాత్రం అతనికి తెలీకుండానే బాగా దగ్గరైపోతుంది. ప్రేమలో పడిపోతాడు. ఆ అమ్మాయి వచ్చాక తను కెరీర్ మీద దృష్టిపెట్టలేకపోతున్నానని భావిస్తాడు. ఆ తర్వాత వారిద్దరి కథ ఏయే మలుపులు తిరుగుతుందన్నదే సినిమా. పాల్ థామస్ ఆండర్సన్ మేకింగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఆయన ఈ సినిమాకు బెస్ట్ డైరెక్టర్‌గా నామినేట్ అయ్యాడు కూడా. డేనియల్ డే లూయిజ్ నటనను కూడా అందరూ మెచ్చుకున్నారు. ఆయన కూడా ఆస్కార్‌కు నామినేట్ అయ్యాడు.

9 ది పోస్ట్

(దర్శకుడు: స్టీవెన్ స్పీల్‌బర్గ్)



మూడు దశాబ్దాల కాలంలో ప్రభుత్వానికి సంబంధించి ప్రపంచానికి తెలియని ఒక సీక్రెట్‌ను బయటపెట్టాలి. నలుగురు ప్రెసిడెంట్స్ మారిపోయారు ఈ కాలంలో. కేథరిన్ వాషింగ్టన్ పోస్ట్‌కు ఫస్ట్ ఫీమేల్ పబ్లిషర్. ఎడిటర్ బ్రాడ్లీతో కలిసి ఆమె ఈ సీక్రెట్‌ను బయటపెట్టాలనుకుంటుంది. వాళ్ల కెరీర్‌కే పెద్ద ముప్పు తెచ్చిపెట్టే వ్యవహారం అది. అయినా పోరాడతారు. ఒక నిజ జీవిత కథను సినిమాగా మార్చి తెరకెక్కించడంలో స్పీల్‌బర్గ్ చూపిన ప్రతిభకు ముగ్ధులైపోయారంతా. స్పీల్‌బర్గ్‌ను అందరూ గొప్ప దర్శకుడని ఎందుకంటారో ఈ సినిమా మరోసారి ఋజువు చేస్తుంది. అయితే ఈ సినిమాకు స్పీల్‌బర్గ్ నామినేషన్ దక్కించులేకపోవడం గమనార్హం. టామ్ హ్యాంక్స్, మెరిల్ స్ట్రీప్ లాంటి టాప్ యాక్టర్స్ నటించిన సినిమా, విమర్శకుల ప్రశంసలను అందుకొని, ఆస్కార్ రేసులో అన్ని సినిమాలకూ గట్టి పోటీ ఇస్తూ నిలబడింది.

పైన చెప్పుకున్న తొమ్మిది సినిమాల్లో.. తొమ్మిదీ డిఫరెంట్ జానర్ సినిమాలే! అన్నీ బెస్ట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చినవే! 'ది షేప్ ఆఫ్ వాటర్', 'ది పోస్ట్' సినిమాలు ఇందులో ఆస్కార్‌కు దగ్గరగా ఉన్నట్టు కనిపిస్తున్నా, ఆ వేడుక జరిగేరోజు వచ్చేసరికి ఏ సినిమా అవార్డు గెలుచుకుంటుందనేది వేచి చూడాల్సిందే! అంటే మార్చి 4 వరకూ ఈ వెయిటింగ్ తప్పదనే!!

'బెస్ట్ పిక్చర్' ఓటింగ్ లెక్కలు వేరు!

ఆస్కార్ విజేతలను ఎంపిక చేసేందుకు కొంతమంది మెంబర్స్ ఓటింగ్‌ను లెక్కలోకి తీసుకుంటారు. ఈ ఏడాది 6,028 మంది మెంబర్లు వేసే ఓట్లతో విజేతలను ఎంపిక చేస్తున్నారు. ఇక మొత్తం 24 క్యాటగిరీల్లో 23 క్యాటగిరీల్లో ఎక్కువ ఓట్లు ఎవరికి వస్తే వాళ్లకు అవార్డును ఇచ్చేస్తారు. ఒక్క 'బెస్ట్ పిక్చర్'కు మాత్రం ఓటింగ్ పద్ధతి వేరేలా ఉంటుంది. ప్రిఫరెన్షియల్ బ్యాలెట్ పద్ధతిలో బెస్ట్ పిక్చర్‌ను ఎంపిక చేస్తారు. ఈ పద్ధతిలో మెంబర్స్‌ను మీకిష్టమైన సినిమా ఏది అని అడగకుండా, మీకు నచ్చిన ఆర్డర్ ఇవ్వండి అని అన్ని సినిమాలకు ర్యాంక్ ఇవ్వమంటారు. అలా నామినేట్ అయిన అన్ని సినిమాలకు, అందరూ ర్యాంకులు ఇస్తారు. అందులో 50 శాతానికి మించి మెంబర్లు ర్యాంక్ 1 ఏ సినిమాకు ఇస్తారో అదే బెస్ట్ పిక్చర్ అవుతుంది. ఒకవేళ ఏ సినిమాకూ 50 శాతం మంది ర్యాంక్ 1 ఇవ్వకపోతే, తక్కువమంది ర్యాంక్ 1 ఇచ్చిన సినిమాను ఎలిమినేట్ చేసి, మిగిలిన సినిమాలకు మళ్లీ ఇదే ప్రాసెస్ రిపీట్ చేస్తారు. ఏదో ఒక సినిమా 50 శాతానికి మించి ర్యాంక్ 1 తెచ్చుకునే వరకూ ఈ ప్రాసెస్ కొనసాగుతుంది. అప్పుడు బెస్ట్ పిక్చర్ అవార్డు అందుకుంటుంది. ఆస్కార్ ఫంక్షన్‌లో చివర అవార్డుకు ఉన్న క్రేజ్ వెనక ఇంత కథ ఉంది మరి!!

బెస్ట్ డైరెక్టర్ - బెస్ట్ పిక్చర్ లింక్

సాధారణంగా బెస్ట్ డైరెక్టర్ నామినేషన్స్ దక్కించుకున్న వారి సినిమాలన్నీ బెస్ట్ పిక్చర్‌కు కూడా నామినేట్ అయి ఉంటాయి. ఈ ఏడాది బెస్ట్ డైరెక్టర్‌గా నామినేట్ అయిన ఐదుగురి సినిమాలూ బెస్ట్ పిక్చర్‌గానూ నామినేట్ అయ్యాయి. ఈ లింక్ ఎప్పుడో ఒక్కసారి కానీ తప్పదు. బెస్ట్ పిక్చర్ అవార్డును ఆ సినిమాను నిర్మించిన వ్యక్తికి అందిస్తారు. నిర్మాతలు ఇద్దరు, ముగ్గురు ఉంటే ఆ ముగ్గురికీ ఇస్తారు. అయితే ఆ సంఖ్య పెరిగితే మాత్రం, ప్రొడక్షన్‌తో బాగా సంబంధమున్న ఫస్ట్ ముగ్గురికే ఆస్కార్ ఇస్తారు. బెస్ట్ పిక్చర్ క్యాటగిరీలో గతంలో ఐదే నామినేషన్స్ ఉండేవి. ఇప్పుడు ఆ లిస్ట్‌ను 5 నుంచి 10 కి తీసుకెళ్లారు. ఐదు లేదా ఐదుకు మించి, పదికి తగ్గకుండా ఆస్కార్ నామినేషన్స్ ఉంటాయి. ఈ ఏడాది తొమ్మిదికి సరిపెట్టారు.



● పరుచూరి వెంకటేశ్వరరావు, లయన్ కిరణ్, వీఐ ఆనంద్, పూజా గాంధీ, శ్రీనివాసరాజు

మమ్మల్ని దండుపాళ్యం గ్యాంగ్ అంటున్నారు

- పూజా గాంధీ

''దండుపాళ్యం 3' తర్వాత మరో రెండు మూడేళ్ల వరకూ ఈ జానర్‌లో సినిమాలు చేయను. రెండు భాగాల్లో కీలక పాత్రలు చేసిన నటీనటులే మూడో భాగంలోనూ చేశారు. కొన్ని పాత్రలకు మాత్రం వేరేవాళ్లను తీసుకున్నాం. ఈ మూడు భాగాలకు నాతో పాటు వర్క్ చేసిన డైలాగ్ రైటర్ రమేశ్, కెమెరామేన్ వెంకట్‌ప్రసాద్, ఎడిటర్ రవిచంద్రన్‌లకు థ్యాంక్స్. 'దండుపాళ్యం' సిరీస్‌లో ఇదే చివరిది'' అని శ్రీనివాసరాజు అన్నారు. బొమ్మాళి రవిశంకర్, పూజా గాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవి కాలే ముఖ్య తారలుగా ఆయన దర్శకత్వంలో రూపొందిన 'దండుపాళ్యం 3'ని శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో సాయికృష్ణ ఫిలింస్ సమర్పణలో శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్‌పై శ్రీనివాస్ మీసాల, సాయికృష్ణ పెండ్యాల తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ఆడియో వేడుకలో పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ– ''ఇప్పటికి మేం 365 చిత్రాలకి రాసాం. ఇప్పుడు మేము, శ్రీనివాసరాజు ఓ సినిమాకి పని చేస్తున్నాం. తను ఏ సినిమా గురించైనా 365 రోజులు డిస్కస్ చెయ్యగలడు. అంత నాలెడ్జ్ ఉంది. వరుసగా సీక్వెల్స్‌తో హిట్స్ సాధిస్తున్నాడు. ఇప్పుడు ఈ చిత్రం కూడా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''మేం ఇంతకుముందు చేసిన పాత్రలను మరచిపోయి, 'దండుపాళ్యం'లో చేసిన పాత్రలను గుర్తుపెట్టుకుంటున్నారు. మమ్మల్ని 'దండుపాళ్యం' గ్యాంగ్ అంటున్నారు. ఈ సినిమాలో చేసిన లక్ష్మి పాత్ర కోసం నా బాడీ లాంగ్వేజ్, మాట తీరు మార్చుకోవాల్సి వచ్చింది'' అని పూజా గాంధీ అన్నారు. ''ఈ సినిమాలో మేం భయంకరమైనవాళ్లలా కనిపించినా రియల్‌గా అమాయకులం'' అని మకరంద్ అన్నారు. ''తెలుగులో ఎన్నో సినిమాలు చేసినా రాని గుర్తింపు ఈ సినిమాతో వచ్చింది'' అని రవి కాలే చెప్పారు. ఈ వేడుకలో దర్శకుడు నక్కిన త్రినాథరావు, వీఐ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం ఖరారు?



● శ్రియ

మూడు రోజుల పాటు వేడుకలు

పెళ్లి పీటల మీద కూర్చుని, మూడు ముళ్లు వేయించుకుని, ఏడడుగులు వేయడానికి శ్రియ రెడీ అయ్యారని సమాచారం. 'మీ పెళ్లెప్పుడు?' అని ఎప్పుడు అడిగినా 'దాని గురించి నేను చెప్పను. అది నా వ్యక్తిగత విషయం' అని నిర్మొహమాటంగా చెప్పేవారు శ్రియ. ఇటీవల 'గాయత్రి' సినిమా ప్రమోషనల్ ఇంటర్వ్యూస్‌లోనూ అలానే అన్నారు. అయితే శ్రియ సైలెంట్‌గా పెళ్లి పనులతో బిజీగా ఉన్నారన్నది తాజా వార్త. రష్యాకి చెందిన క్రీడాకారుడు, వ్యాపారవేత్త ఆండ్రై కొశ్చీవ్, శ్రియ లవ్‌లో ఉన్నారని కొన్ని రోజుల క్రితం వార్త వచ్చింది. ఈ ఇద్దరూ త్వరలో 'వెడ్‌లాక్'లోకి ఎంటరవ్వాలనుకుంటున్నారట. ఇటీవల రష్యా వెళ్లి ఆండ్రై తల్లిదండ్రులను కూడా కలిశారట శ్రియ. పెద్దల సమ్మతం లభించిందని టాక్. వచ్చే నెల 17, 18, 19 తేదీల్లో రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వివాహ వేడుకలు జరుగుతాయని తెలిసింది. హోలీ థీమ్‌లో ఓ రోజు వేడుక, ఇంకో రోజు సంగీత్, మరో రోజు మెహందీ.. ఇలా మూడు వేడుకలను ఇప్పటికే ప్లాన్ చేశారట. మరి... మూడు ముళ్లు పడే డేట్ ఈ మూడు తేదీల్లో ఒకటా? లేక వేరేనా? అని తెలియాల్సి ఉంది.